అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

బుధవారం 27-9-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 219 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు | వెల : 6.50

మణిపూర్‌లో మరో దారుణం

- అదృశ్యమైన ఇద్దరు విద్యార్థుల హత్య
- సోషల్ మీడియాలో ఫొటోలు వైరల్



ఇంఫాల్ : మణిపూర్‌లో జులై 6న అదృశ్యమైన ఇద్దరు మెయితీ విద్యార్థులు హత్యకు గురయ్యారు. వారి మృతదేహాల ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారటంతో మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్తపరిస్థితులు నెలకొన్నాయి. ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించిన రెండు రోజుల అనంతరం ఈ ఫొటోలు వెలుగులోకి రావడం గమనార్హం. ఆ ఇద్దరు విద్యార్థులను కుకీ సాయుధ దుండగులు అపహరించినట్టు ఆగస్టులో సుప్రీంకోర్టుకు సమర్పించిన స్టేటస్ కో నివేదికలో రాష్ట్ర ప్రభుత్వం

...11లో

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

- సీఎం కేసీఆర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



తెలంగాణ సాయుధ పోరాట కాలంలో చిట్యాల ఐలమ్మ ప్రదర్శించిన ధైర్య సాహసాలు, చైతన్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు అన్నారు. ఐలమ్మ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరుపుతున్నదనీ, వారి త్యాగాలను మరువలేమనీ చెప్పారు. ఆ కాలంలోనే హక్కుల సాధన కోసం న్యాయస్థానాల్లో చట్టపరమైన పోరాటం చేసిన ప్రజాస్వామిక వాది, సబ్బండ వర్గాల ఆత్మగౌరవ ప్రతీక చిట్యాల ఐలమ్మ అని ఆయన

...11లో


ఇదర్ కా మాల్ ఉదర్.. ఉదర్ కా మాల్ ఇదర్...
(ఇక్కడి సరుకు అక్కడికి, అక్కడి సరుకు ఇక్కడికి)
అనేది ఉర్దూలో బాగా పాపులర్ అయిన నానుడి.
అధికార బీఆర్‌ఎస్ పరిస్థితి ఇప్పుడు ఇదే తరహాలో కొనసాగుతున్నది. 2001 నుంచి కేసీఆర్‌తోపాటు నడిచిన ఉద్యమకారులు, సొంత పార్టీలోని సీనియర్లు, జూనియర్లు, ఇతర పార్టీల నుంచి వచ్చిన చేరిన నేతలు, వారితోపాటు అంగబలం, అర్థబలం ఉండి గులాబీ కండువా కప్పుకున్న బడా వ్యాపారవేత్తలు, పరిశ్రమాధిపతులు... వెరసి కారుకు లోడెక్కువైంది. ఎంతగా అంటే.. అది మోయలేనంతగా. ఇప్పుడు ఈ బరువే... గులాబీ పార్టీ అధినేతలకు 'తల బరువు'గా మారింది.



కారులో చదరంగం

ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వలేకపోతే ఎంపీగా...అదీ లేకుంటే ఎమ్మెల్సీ...

- ఆ రెండూ కాకుంటే కార్పొరేషన్ పదవులు
- బీఆర్‌ఎస్ బాస్‌కి బుజ్జగింపుల తలనొప్పి
- 'రైతు బంధు సమితి' వద్దంటున్న తాటికొండ రాజయ్య
- ఆర్టీసీ చైర్మెన్ వద్దు.. ఎమ్మెల్యే టిక్కెటే ముద్దంటున్న ముత్తిరెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఏండ్ల తరబడి బీఆర్‌ఎస్‌లో పదవుల కోసం ఎదురు చూసిన నేతలు ఈసారి ఎలాగైనా ఎమ్మెల్యే టిక్కెట్ దక్కించుకుని శాసనసభలో అడుగుపెట్టాలని భావించారు. కానీ సిట్టింగులకే అధిక ప్రాధాన్యతనిచ్చిన సీఎం కేసీఆర్, ఒకేసారి 115 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించి పార్టీకి ఊపు తెద్దామనుకున్నారు. కానీ ఆ ఊపు సంగతేమోగానీ, అసమ్మతి రాగాలు, ధిక్కార స్వరాలు ఊపందుకున్నాయి. దీంతో ఇది కాకపోతే అది, అదీ కాకపోతే ఇంకోటి అంటూ నేతలను బుజ్జగించటం అధినేత వంతైంది.

ఒకవైపు పార్టీలో సీనియర్లుగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి లాంటి లీడర్లు పార్టీని వీడిన నేపథ్యంలో... మరోవైపు ఆ నష్టాన్ని పూడ్చుకునేందుకు కేసీఆర్ బీఆర్‌ఎస్‌లోకి వలసలను ప్రోత్సహిస్తూ వస్తున్నారు. కాంగ్రెస్ వైపు చూస్తున్న బీజేపీ నేతలకు గాలం వేస్తున్నారు. ఇందులో భాగంగానే మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి లాంటి నేతలను గులాబీ గూటికి రప్పించేందుకు రంగం సిద్ధం చేశారు. ఆ వరసలో మరో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి పేరు కూడా వినిపిస్తుండటం గమనార్హం. బీఆర్‌ఎస్ తొలి జాబితాలో చోటు దక్కని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పార్టీపై గుర్రుగా ఉన్న సంగతి తెలిసిందే. వారితో మాట్లాడి, ఒప్పించి వేరే పదవుల్లో సర్దుబాటు చేసిన సంగతి తెలిసిందే. వీరిలో ముత్తిరెడ్డికి ఆర్టీసీ చైర్మెన్ పదవినీ, రాజయ్యకు రైతు బంధు సమితి రాష్ట్ర అధ్యక్ష పదవిని ఇచ్చి సంతృప్తి పరిచేందుకు సీఎం ప్రయత్నించారు. ఆ మేరకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో చర్చలు, సమాలోచనలు కూడా కొనసాగాయి. కానీ ముత్తిరెడ్డి, రాజయ్య ఎమ్మెల్యే సీటు పైన్నే గురి పెట్టారని తెలుస్తోంది. సీఎం మాట కాదనలేక ఆర్టీసీ చైర్మెన్, రైతు బంధు సమితి పదవులకు ఒప్పుకున్నా... 'తమకు ఇష్టం లేకపోయినా ఒప్పించారు...' అంటూ వారు

...11లో

కొన్నింటిలో మార్పులు తప్పవా...?

బీఆర్‌ఎస్ తొలి జాబితాలో ప్రకటించిన పేర్లలో సైతం పలు మార్పులు చేర్పులు చోటు చేసుకోనున్నాయనే వాదన బలంగా వినబడుతున్నది. మహబూబాబాద్ నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే శంకర్ నాయక్ పేరును ప్రకటించినప్పటికీ.. అక్కడి నుంచి ఎంపీ మాలోత్ కవితను పోటీ చేయించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. జనగామలో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డికే సీటు ఖాయమంటున్నప్పటికీ అక్కడి నుంచి మాజీ ఆర్మీ అధికారి భిక్షపతి పేరునూ సీఎం పరిశీలిస్తున్నారు. మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కాంగ్రెస్‌లో చేరనున్న క్రమంలో... అక్కడి నుంచి బీజేపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజయ్యను బరిలోకి దింపాలని కేసీఆర్ భావిస్తున్నారు. ఆ సీటును మంత్రి మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖరరెడ్డికి కేటాయిస్తారనే ప్రచారం కూడా జరుగుతున్నది.

ఆందోళనలు ఆంధ్రాలో చేసుకోండి

చంద్రబాబు అరెస్టుపై ఇక్కడ చేస్తే ఊరుకోం

- ఆ వ్యవహారంలో మేం తటస్థంగా ఉన్నాం : మంత్రి కేటీఆర్
- తెలంగాణ ఏర్పాటును మోడీ కించపరుస్తున్నారని వ్యాఖ్య



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు పంచాయితీ ఆంధ్రాలోనే తేల్చుకోవాలని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏపీ పంచాయితీలకు తెలంగాణను వేదిక కానివ్వబోమని స్పష్టం చేశారు. అక్కడ రాజకీయ విభేదాలకు తెలంగాణ ప్రజలను తెదేపా, వైకాపా ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. చంద్రబాబు అరెస్టు ఏపీలో రెండు రాజకీయ పార్టీల మధ్య జరుగుతున్న యుద్ధం. మా పార్టీ నేతలు స్పందిస్తే అది వారి వ్యక్తిగత వ్యవహారం. తెలంగాణ ప్రజలు, తెలంగాణ రాష్ట్రంపై ఎలాంటి ప్రభావం చూపించే అంశం కాదు. ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న రాజకీయ వివాదాలతో తెలంగాణకు సంబంధం లేదు. ర్యాలీలు, ధర్నాలు చేయాలనుకుంటే అక్కడే చేయాలి. అక్కడ చేయకుండా

...2లో

29న ఎన్నికల క్యాబినెట్



- ఆఖరిసారిగా భేటీకానున్న మంత్రివర్గం
- మరోసారి ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్ల సిఫారసు
- కొత్త పింఛన్లు.. రైతు బంధు పెంపుపై చర్చించనున్న సీఎం
- ఉద్యోగుల డీఏ, నిరుద్యోగుల కోసం పథకం, ఇతర ప్రధానాంశాలపైనా నిర్ణయాలు

...11లో

మహిళా రిజర్వేషన్లలో వాస్తవాలివే..

- ప్రజల ఖాతాల్లో పదిహేను లక్షలేస్తామనడం ఎంత నిజమో.. ఇదీ అంతే..
- మరో పదేండ్లు గడిచినా అమలుకావు : కాంగ్రెస్ దేశవ్యాప్త ప్రచారం



...11లో

వహీదా రెహమాన్‌కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు

- అభినందనల వెల్లువ
- తెలుగులో మొదలై .. హిందీలో వెలిగిన తార



...12లో

సీజనల్ వ్యాధుల కట్టడికి చర్యలు తీసుకోండి

- ఏజెన్సీ ప్రాంతాలకు ప్రత్యేక వైద్య బృందాలను పంపండి
- తీవ్రత ఎక్కువున్న జిల్లాల్లో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి
- సీఎం కేసీఆర్‌కు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని లేఖ



...11లో

పోరాటం ఉధృతం

'అంగన్‌వాడీ' సమస్యలు పరిష్కరించాలి



- ప్రభుత్వం నిర్బంధాన్ని తక్షణమే ఆపాలి
- చర్చలు జరిపి సమ్మె విరమింప చేయాలి : కేంద్ర కార్మిక సంఘాల నేతల డిమాండ్
- హైదరాబాద్‌లో ధర్నాకు భారీగా తరలొచ్చిన అంగన్‌వాడీ ఉద్యోగులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేంద్ర కార్మిక, ఉద్యోగ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ జేఏసీతో చర్చలు జరిపి సమ్మె విరమణకు చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు మద్దతుగా అవసరమైతే కార్మిక సంఘాలే నేరుగా సమ్మెకు దిగుతాయని ప్రకటించారు. అంగన్‌వాడీ ఉద్యోగుల పైనా, సమ్మెపైనా రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాన్ని

...2లో

సైన్యంలో రాజకీయాలు

పావులుగా వాడుకుంటున్న ప్రభుత్వం

- దళాల సామర్థ్యం పెంచడం లేదు
- వీరమరణం పొందుతున్నా పట్టింపు లేదు
- మోడీ సర్కారుపై తీవ్ర విమర్శలు..



లడఖ్‌లో ప్రధాని మోడీ (ఫైల్)

న్యూఢిల్లీ : సైనిక దళాల ప్రధాన లక్ష్యం ఉగ్రవాదాన్ని అంతం చేయడమేనని నరేంద్ర మోడీ ప్రభుత్వం భావిస్తోంది. అధికారంలోకి రావడానికి ముందు నుంచీ ఆ పార్టీ విధానం అదే. జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని అణచివేయడానికే సైన్యాన్ని ఉపయోగించాలని కమలనాథులు అభిప్రాయపడ్డారు. దీని వెనుక బీజేపీకి రెండు ముఖ్యమైన ఉద్దేశాలు ఉన్నాయి. ఒకటి పాకిస్తాన్‌ను బూచిగా చూపడం. రెండోది మన దేశంలో నివసిస్తున్న ముస్లింలకు పాకిస్తాన్ అండగా నిలిచేలా అవకాశం కల్పించడం. దీంతో హిందూత్వ మద్దతుదారులు తన వెనుక సంఘటితమవుతారని ఆ పార్టీ ఉద్దేశం. హిందూ రాష్ట్ర ఎజెండాను ముందుకు తీసికెళ్లేందుకు ఇది దోహదపడుతుందని దాని అభిప్రాయం. దీంతో పాటు 'ఒకే దేశం...ఒకే పెన్షన్' పథకం అమలుతో ప్రభుత్వం మాజీ సైనికాధికారుల మెప్పు కూడా పొందగలిగింది.


భారత సైనిక దళంలో 13 లక్షల మంది పని చేస్తున్నారు. వీరిలో ప్రతి ఏటా సుమారు యాభై వేల మంది పదవీవిరమణ చేస్తున్నారు. తన 'జాతీయవాద' ఆలోచనల్లో వారికి భాగస్వామ్యం కల్పించడం బీజేపీకి అవసరం. బీజేపీ లక్ష్యాలు, ఉద్దేశాలు చూస్తుంటే ఆ పార్టీ తన రాజకీయ అవసరాల కోసం సైనిక దళాలను ఉపయోగించుకుంటోందని అర్థమవుతుంది. అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే నియంత్రణ రేఖ (ఎల్‌సీ) వెంబడి కంచెను పటిష్టం చేయాలని అప్పటి రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ సైన్యానికి సూచించారు. దీనికి సైనికాధికారులు వంతపాడుతూ సరిహద్దులో నిఘాను బలోపేతం చేసేందుకు కంచెను పటిష్టం చేస్తామని ప్రకటించారు. అయితే 2004లో సరిహద్దు వెంబడి కంచె వేయడమే అతి పెద్ద తప్పిదమైంది. ఇది దళాల మానసిక స్థితిని దెబ్బతీసింది. తమ శిబిరాలపై భారత సైన్యం దాడులు చేస్తుందేమోనన్న భయానికి పాకిస్తాన్ స్వస్తి చెప్పింది. నిర్భీతితో

...11లో

టీఎస్పీఎస్సీ విశ్వసనీయత ప్రశ్నార్థకం

కమిషన్‌పై అనేక సందేహాలు

- గ్రూపు-1 రద్దు వెనక్కి తీసుకోవాలన్న అప్పీల్‌పై హైకోర్టు



నవతెలంగాణ-హైదరాబాద్

పేపర్ లీకేజీ తర్వాత కూడా పరీక్షలను సక్రమంగా నిర్వహించడంలో టీఎస్పీఎస్సీ విఫలమైందనే అభిప్రాయం బలంగా ఉందనీ, ఆ కమిషన్‌పై విశ్వసనీయత ప్రశ్నార్థకంగా మారిందని హైకోర్టు తీవ్ర స్థాయిలో వ్యాఖ్యానించింది. దీనివల్ల లక్షల మంది అభ్యర్థుల భవిష్యత్ ఆయోమయంగా మారుతున్నదని ఆందోళన వ్యక్తం చేసింది. నోటిఫికేషన్లలోని నిబంధనలను ఆ కమిషనే అమలు చేయకపోవడమేంటని ప్రశ్నించింది. నిబంధనలను అమలు చేయకపోవడంలోని అంతర్యం అర్థం కావడం లేదని

...2లో

దసరా నుంచి సీఎం అల్పాహార పథకం

మెనూను త్వరగా రూపొందించండి

- అమలుకు ఏర్పాట్లు పూర్తి చేయండి
- అవసరమైన వంటపాత్రలు సమకూర్చండి: అధికారులకు మంత్రి సబిత ఆదేశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉచితంగా అల్పాహారాన్ని అందించేందుకు ఉద్దేశించిన 'ముఖ్యమంత్రి అల్పాహార పథకం'కు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో తన కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి స్మితా సబర్వాల్, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ,

...11లో



హైదరాబాద్‌లో..
బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	59,730	▼ 220
22 క్యారెట్లు	54,750	▼ 200
కిలో వెండి	77,600	▼ 1400



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 102
రిటైల్ (లైవ్)	రూ. 124
స్కిన్‌తో	రూ. 180
స్కిన్‌లెస్	రూ. 205

ఎమ్మెల్యే మదన్ రెడ్డికే టికెట్ ఇవ్వాలని..
సెల్ టవర్ ఎక్కిన యువకులు
- రెండు గంటలకు పైగా హల్ చల్..

నవతెలంగాణ-నర్సాపూర్

రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేసేందుకు ప్రస్తుత ఎమ్మెల్యే మదన్ రెడ్డికే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సాయంత్రం మెదక్ జిల్లా కొల్చారం మండలానికి చెందిన నలుగురు యువకులు సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్ చేశారు. ఎమ్మెల్యే వచ్చి నచ్చజెప్పడంతో దిగివచ్చారు. కొల్చారం మండలానికి చెందిన రవీందర్, శ్రీకాంత్, సురేష్ గౌడ్,, అన్వేష్.. నర్సాపూర్ పట్టణంలోని మెదక్ వెళ్లే మార్గంలోని షుగర్ ఫ్యాక్టరీ పక్కనున్న సెల్ టవర్ ఎక్కారు. ఎమ్మెల్యే మదన్ రెడ్డికే టికెట్ ఇస్తామని హామీ ఇచ్చేంతవరకు టవర్ దిగమని సుమారు రెండు గంటల పాటు అక్కడే ఉన్నారు. విషయం తెలుసుకున్న సీఐ షేక్ లాల్ మదర్, ఎస్ఐ శివ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలించలేదు. కాగా, విషయం ఎమ్మెల్యే మదన్ రెడ్డికి తెలియడంతో.. ఆయన రాత్రి 8 గంటల సమయంలో సంఘటనా స్థలానికి వచ్చి యువకులకు నచ్చజెప్పడంతో వారు సెల్ టవర్‌పై నుంచి కిందికి దిగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టికెట్ తనకే వస్తుందని, ఎవరూ భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇటువంటి పనులు ఎవరూ చేయొద్దని సూచించారు.

టీఎస్పీఎస్సీ విశ్వసనీయత ప్రశ్నార్థకం

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించింది. బయోమెట్రిక్ తీసుకోకపోవడానికి కారణాలు చెప్పాలని ఆదేశించింది. విచారణను బుధవారానికి వాయిదా వేసింది. గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షలను రద్దు చేస్తూ ఇటీవల సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సర్వీస్ కమిషన్ సెక్రటరీ దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ జె.అనిల్‌కుమార్‌లతో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది. ఈ సందర్భంగా సర్వీస్ కమిషన్‌పై బెంచ్ అనేక ప్రశ్నలను సంధించింది. ఒకసారి పేపర్ లీకేజీ, పరీక్షల రద్దు తర్వాత రెండోసారి నిర్వహించిన గ్రూప్-1 పరీక్షను సమర్థంగా నిర్వహించకపోవడంపై తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేసింది. గ్రూప్-4 పరీక్షలో మాత్రం బయోమెట్రిక్ తీసుకోవడం లేదని పేర్కొంటూ అనుబంధ నోటిఫికేషన్ జారీచేసినట్టుగా గ్రూప్-1 పరీక్షలకు కూడా ఎందుకు జారీ చేయలేదని నిలదీసింది. కౌంటర్లో పేర్కొన్న మొత్తం అభ్యర్థుల సంఖ్యకు, కమిషన్ వెబ్‌సైట్‌లో అభ్యర్థుల సంఖ్యకు ఎందుకు తేడా వచ్చిందని ప్రశ్నించింది. ఏకంగా 258 మంది ఎలా పెరిగిందని నిలదీసింది. అందులో దొడ్డి దారిలో వచ్చిన వారుంటే వాళ్లు కొన్నేండ్ల తర్వాత ఐఏఎస్ వంటి కన్ఫర్డ్ అధికారులు అవుతారని చెప్పింది. అలాంటి వారు నిర్ణయాలు తీసుకుంటే ప్రజల భవిష్యత్తు ఏం కావాలని ప్రశ్నించింది. కమిషన్ సుప్రీంకోర్టుకు వెళితే నియామకాలు తీవ్ర జాప్యం అవుతాయని గుర్తు చేసింది. రద్దు చేశాక తిరిగి పరీక్ష నిర్వహించేప్పుడు బయోమెట్రిక్ ఉండదని నోటిఫికేషన్ ఇస్తే అభ్యర్థులు ఏం చేయగలరని కూడా ప్రశ్నించింది. నోటిఫికేషన్ నిబంధన ప్రకారమే బయోమెట్రిక్ తీసుకోవాలని అభ్యర్థుల తరఫు న్యాయవాది చెప్పారు. 258 అభ్యర్థుల సంఖ్య పెరిగిందంటే వాళ్లంతా దొడ్డిదారిని నియామకాలు పొందితే ఏం కావాలన్నారు. నోటిఫికేషన్ నిబంధనలు సవరించే అధికారం కమిషన్‌కు ఉందని అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ చెప్పారు. హాల్ టికెట్‌లో బయోమెట్రిక్ లేదని చాలా స్పష్టం ఉందనీ, ఆ వెంటనే కోర్టులో వ్యాజ్యం వేయకుండా పరీక్ష రాసిన తర్వాత కేసు వేశారని చెప్పారు. ఇది లక్షల మంది అభ్యర్థుల భవిష్యత్‌తో ఆడుకోవడమేనని అన్నారు.. ఏ దశలోనైన నిబంధనలు మార్చే హక్కు కొత్త నిబంధనలు చేర్చడం, రద్దు చేయడం తదితర హక్కులు కమిషన్‌కు ఉన్నాయన్నారు. లక్షల మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్న కారణంగా టెక్నికల్‌గా సమస్యలుంటాయనే బయో మెట్రిక్ అమలు చేయలేదని వివరించారు. బయోమెట్రిక్ విధిగా ఉండాలని లేదనీ, గతంలో యుపీఎస్సీ పరీక్షల్లో కూడా బయోమెట్రిక్ తీసుకోలేదని చెప్పారు. పరీక్ష జరిపిన రోజు ఫోన్ ద్వారా అందిన వివరాలు, తరువాత కచ్చితమైన వివరాలతో నివేదికల తయారీ వల్ల పరీక్షకు హాజరైన అభ్యర్థుల సంఖ్యలో మార్పులు వచ్చాయన్నారు. ఒకరి బదులు మరొకరు పరీక్ష రాయకుండా జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. దీనిపై స్పందించిన హైకోర్టు'ప్రశ్న పత్రాల లీకేజీతో ఒకసారి గ్రూప్-1 పరీక్షను రద్దు చేసి మరోసారి నిర్వహిస్తున్నపుడూ మళ్లీ అదే నిర్లక్ష్యం కనబడితే ఎలా' అని కమిషన్‌ను ఉద్దేశించి ప్రశ్నించింది. బయోమెట్రిక్ విధానం అమలు చేస్తున్నట్టు నోటిఫికేషన్లో పేర్కొని దాన్ని ఎందుకు అమలు చేయలేదని కూడా నిలదీసింది. నిరుద్యోగులతో అత్మహత్యలు చేసుకుంటున్నారనీ, అనర్హులు 100 మందికి అవకాశం లభిస్తే లక్షలాది అభ్యర్థుల ఆశలు ఏం కావాలని కూడా ప్రశ్నించింది. ఇరుపక్షాల వాదనల తర్వాత హైకోర్టు విచారణను బుధవారానికి వాయిదా వేసింది. గతంలో నిర్వహించిన పరీక్షలకు బయోమెట్రిక్ అమలు చేసినప్పుడు హాజరైన అభ్యర్థులు, అందుకు తీసుకున్న చర్యలు, ఇప్పుడు పరీక్షా కేంద్రాల వారీగా వివరాలు నివేదించాలని కమిషన్‌ను ఆదేశించింది.

ఆత్మగౌరవానికి ప్రతీక
కొండా లక్ష్మణ్ బాపూజీ..

సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కొండా లక్ష్మణ్‌బాపూజీ ఆత్మగౌరవానికి ప్రతీక అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. తాను నమ్మిన విశ్వాసంతో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం రాజీలేని పోరాటాన్ని నడిపారని తెలిపారు. బడుగు బలహీన వర్గాల చైతన్యానికి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని కొనియాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 108 వ జయంతి (సెప్టెంబర్ 27) సందర్భంగా, వారు తెలంగాణ కు అందించిన సేవలను, చేసిన త్యాగాలను సీఎం కేసీఆర్ స్మరించుకున్నారు. దేశ స్వాతంత్ర్యోద్యమంలో, తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో ఆయన చేసిన పోరాటం నాటి తరాన్ని ఎంతో ప్రభావితం చేసిందని గుర్తుచేశారు. ఎమ్మెల్యేగా, డిప్యూటీ స్పీకర్‌గా, మంత్రిగా ఎన్నో పదవులను నిర్వహించిన బాపూజీ, తెలంగాణ కోసం మంత్రి పదవిని త్యజించి నిబద్ధత కలిగిన నేతగా చరిత్రలో నిలిచారన్నారు. బాపూజీ ఆశయాలను రాష్ట్ర ప్రభుత్వం తన కార్యాచరణ ద్వారా నెరవేరుస్తున్నదనీ, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి వున్నదని సిఎం స్పష్టం చేశారు. వారి స్మారకార్థం పలు కార్యక్రమాలు చేపట్టామనీ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి యేడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తూ ఆయనకు నివాళి అర్పిస్తున్నదని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రగతి ప్రస్థాన మే కొండా లక్ష్మణ్ బాపూజీకి నిజమైన నివాళి అని సీఎం అన్నారు.



సీఎంకు వైరల్ ఫీవర్, దగ్గు
- చికిత్సనందిస్తున్న వ్యక్తిగత వైద్యులు

సీఎం కేసీఆర్ గత వారం రోజుల నుంచి వైరల్ ఫీవర్, దగ్గుతో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని ఆయన కుమారుడు, మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. సీఎం వ్యక్తిగత వైద్యులు ఆయనకు ఇంటివద్దనే చికిత్సనందిస్తూ పర్యవేక్షిస్తున్నారు. వైద్యుల చెబుతున్న దాని ప్రకారం... కొద్ది రోజుల్లోనే సీఎం పూర్తిగా కోలుకుంటారని కేటీఆర్ పేర్కొన్నారు.

ఏపీలో ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు నారా లోకేశ్ వినతి
- యువగళం ప్రారంభిస్తామనగానే కేసు పెట్టారు
- రిటర్న్ గిఫ్ట్ ఇచ్చే బాధ్యతను తీసుకుంటా : మీడియాతో నారా లోకేశ్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కోరారు. మంగళవారం టీడీపీ ఎంపీలు కేశినేని నాని, గల్లా జయదేవ్, రామ్మోహన్ నాయుడు, కనకమేడల రవీంద్రకుమార్ తో కలిసి లోకేష్ రాష్ట్రపతిని కలిశారు. టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు విషయాన్ని ఈ సందర్భంగా రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లారు. జగన్ పాలన, ప్రతిపక్షాల అణచివేతపై రాష్ట్రపతికి వివరించారు. ఈ సందర్భంగా వినతి అందజేశారు. రాష్ట్రపతితో భేటీ అనంతరం లోకేష్ మీడియాతో మాట్లాడుతూ.. "2019 నుంచి ఏపీలో ప్రతిపక్షాలపై జరుగుతున్న అరాచకాలను రాష్ట్రపతికి వివరించాం. టీడీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిన అంశాలను వివరించారు. 45 ఏళ్ల ప్రజాజీవితంలో ఉన్న చంద్రబాబును స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో జైలుకు పంపించారని వివరించాం. మా వద్ద ఉన్న ఆధారాలన్నింటినీ రాష్ట్రపతికి అందజేశాం. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడితే కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారు" అని విమర్శించారు.



ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో ఇరికించారు

"యువగళం పాదయాత్ర తిరిగి ప్రారంభిస్తానని నిన్న ప్రకటించిన తర్వాత.. నన్ను ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో ఇరికించారు. ఇన్నర్ రింగ్ రోడ్డు, ఫైబర్ గ్రిడ్, స్కిల్ డెవలప్‌మెంట్ తో నాకేంటి సంబంధం. ఇన్నర్ రింగ్ రోడ్డు లేకపోయినా కేసు ఎలా పెట్టారో అర్థం కావట్లేదు. ఢిల్లీలో ప్రతిపక్ష పార్టీల నేతలను కలిసి ఏపీలో అరాచకాలపై వివరించాం. రోజుకో వదంతి, రోజుకో కేసులతో వేధిస్తున్నారు" అని విమర్శించారు.

తప్పకుండా రిటర్న్ గిఫ్ట్ ఇస్తాం

"తప్పకుండా రిటర్న్ గిఫ్ట్ ఇచ్చే బాధ్యత తీసుకుంటా. ఈ ప్రభుత్వం దొంగ కేసులు పెట్టి మమ్మల్ని వేధిస్తోంది. కేసులకు సంబంధించి ప్రభుత్వం వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. కేసు పెట్టాక అధారాలు ఇవ్వాలని సీఐడీ అధికారులు కోరుతున్నారు. కక్ష సాధింపు తప్ప ఒక్క కేసులోనూ చంద్రబాబు పాత్ర లేదు. నాకు, మా కుటుంబ సభ్యులకు ఒక్క పైసా రాలేదు. ఆయా కంపెనీల వద్ద ఒక కప్పు టీ కూడా తాగ లేదు" అని లోకేష్ స్పష్టం చేశారు.

పోరాటం ఉధృతం

(మొదటిపేజీ తరువాయి)

తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ధర్నా నిరహించారు. అంగన్‌వాడీ ఉద్యోగులు పెద్దఎత్తున తరలొచ్చారు. 'కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి, ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి, ఉద్యోగ భద్రత కల్పించాలి, జేఏసీతో చర్చించి సమ్మెను పరిష్కరించాలి, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ చెల్లించాలి, అంగన్‌వాడీలపై పోలీసుల నిర్బంధాన్ని ఎత్తేయాలి, ప్రభుత్వ మొండి వైఖరి నశించాలి'అని పెద్దఎత్తున నినాదాలు చేయడంతో పాటు ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె ఈశ్వర్‌రావు, ఏఐటీయూసీ నాయకులు పావని అధ్యక్షవర్గం సమావేశాన్ని నిర్వహించారు.

మాతో పెట్టుకుంటే చరిత్ర పునరావృతం : పాలడుగు భాస్కర్

అంగన్‌వాడీల శక్తి గురించి మాజీ సీఎం చంద్రబాబును అడిగి తెలుసుకోవాలని సీఎం కేసీఆర్‌కు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ సూచించారు. తమతో పెట్టుకుంటే చరిత్ర పునరావృతమవుతుందని హెచ్చరించారు. సమస్యలను పరిష్కరించకపోతే అంగన్‌వాడీ ఉద్యోగులు, వారి కుటుంబాలు హైదరాబాద్‌ను దిగ్బంధిస్తారని చెప్పారు. ఇప్పటికైనా చర్చలు జరపాలనీ, మంత్రి, అధికారులను పంపాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను జఠిలం చేయొద్దని సూచించారు. 16 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదని విమర్శించారు. అంగన్‌వాడీ ఉద్యోగులు ఒంటరిగా లేరనీ, రాష్ట్రంలోని కోటి మంది కార్మికులు, కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల అండ ఉందన్నారు. అంగన్‌వాడీలు అర్ధాకలితో ఉన్నారనీ, వారికి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాలిస్తూ సమ్మెకు వెళ్లేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే చేశాయని విమర్శించారు. సమ్మె చేయడం రాజ్యాంగ హక్కని చెప్పారు. కానీ సమ్మె చేయడమే నేరంగా చూడ్డం, అప్రజాస్వామికంగా అణచివేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పటికైనా పట్టుదలకు పోకుండా సమస్యల పరిష్కారానికి పూనుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యూసుఫ్, ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి సూర్యం, ఉపాధ్యక్షులు ఎస్ఎల్ పద్మ, ఐఎన్‌టీయూసీ జాతీయ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉమానాగేంద్రమణి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం విజయ్‌కుమార్ యాదవ్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎంకె బోస్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్ మాట్లాడుతూ 70 వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగులు ఈనెల 11 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారని చెప్పారు. చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నదని విమర్శించారు. తాళాలు పగలగొట్టి సమ్మెను విచ్ఛిన్న చేయాలని చూస్తున్నదనీ, బెది రింపులకు పాల్పడుతున్నదని చెప్పారు. సమ్మెలో ఉన్న సం ఘాలను చర్చలకు పిలవకుండా అప్రజాస్వామికంగా వ్యవ హరిస్తున్నదని అన్నారు. చిన్న పిల్లలు, బాలింతలపై రాష్ట్ర ప్రభుత్వానికి ప్రేమ ఉంటే సమ్మెలో ఉన్న సంఘాలతో చర్చ లు జరిపి సామరస్యంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ప్రగతిభవన్‌ను ముట్టడిస్తాం: జయలక్ష్మి

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడతామనీ, ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ (టీచర్స్), హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి జయలక్ష్మి హెచ్చరించారు. ఇంకా తాత్సారం చేస్తే గత ప్రభుత్వాలకు పట్టిన గతే బీఆర్ఎస్‌కు పడు తుందన్నారు. గాలిమాటలతో సమ్మెను విరమించేది లేదని స్పష్టం చేశారు. చర్చలకు పిలిచి నిర్దిష్టమైన హామీలను ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం వైఖరి మార్చుకోకపోతే ఎమ్మెల్యేలు, మంత్రులను పనిచేయనివ్వబోమనీ, దిగ్బంధిస్తా మని హెచ్చరించారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ కరుణకుమారి మాట్లాడుతూ 16 రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ వైఖరి మార్చుకోవాలనీ, వెంటనే చర్చలకు పిలవాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలు ఆంధ్రాలో చేసుకోండి

(మొదటిపేజీ తరువాయి)

ఇక్కడ రాజకీయ రాద్ధాంతం చేస్తానంటే ఎలా?. ఇక్కడ మేం ఒక ప్రభుత్వాన్ని నడుపుతున్నాం. శాంతిభద్రతల సమస్య వస్తే ఎలా? ఇలాంటి వాటికి ఇక్కడ ఎలా అనుమతిస్తాం. వాళ్ల ఘర్షణలకు హైదరాబాద్ వేదిక ఎలా అవుతుంది.? ఆ రెండు పార్టీలకు తెలంగాణలో ఉనికి లేదు.. స్థానం లేదు. తెలంగాణలో అన్ని ప్రాంతాల వారు కలిసిమెలిసి ఉన్నారు. చంద్రబాబు అరెస్టు వ్యవహారంలో మేం తటస్థంగా ఉన్నాం. ఇలాంటివి చాలా సున్నితమైన అంశాలు. వాటిని చాలా జాగ్రత్తగా హ్యాండిల్ చేయాలి. ప్రస్తుతం ఈ విషయం న్యాయస్థానం పరిధిలో ఉంది. ఈ సమయంలో రోడ్లపైకి వచ్చి ఎవరు పడితే వారు ఏది పడితే అది మాట్లాడకూడదు. చంద్రబాబు న్యాయ పోరాటం చేస్తున్నారు. ఆయనకు జరగాల్సిన న్యాయం కోర్టుల్లో జరుగుతుంది అని కేటీఆర్ వివరించారు.

అందరూ దోస్తులే

"లోకేశ్ .. జగన్.. పవన్ కల్యాణ్ నాకు మంచి స్నేహితులు. అందరూ దోస్తులే. ఆంధ్రాలో నాకు తగాదాలు లేవు. ఇప్పటికిప్పుడు యుద్ధాలు చేయాల్సిన అవసరం కూడా లేదు. అలాగే వారికి కూడా అలాంటి అవసరం లేదు. ప్రాంతాలతో సంబంధం లేకుండా హైదరాబాద్‌లో అందరూ కలిసి మెలసి ఉంటున్నాం. ఇక్కడున్న ఆంధ్రా ప్రజలు పదేండ్ల నుంచి సంతోషంగా ఉన్నారు. ఇక్కడికి వచ్చి వాళ్లను ఇబ్బంది పెట్టడం సరికాదు. ర్యాలీలకు ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని ఓ మిత్రుడి ద్వారా లోకేశ్ ఫోన్ చేయించారు. ఒకరికి అనుమతిస్తే ఇంకొకరు ర్యాలీ చేస్తారు. అందుకే అనుమతించడం లేదని చెప్పా. ఐటీ కారిడార్‌లో తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా ఉద్యమాలకు అప్పటి ప్రభుత్వాలు కూడా అనుమతి ఇవ్వలేదు. ఐటీ కార్యకలాపాలు దెబ్బతినొద్దు. ఏపీ నుంచి ఎంతో మంది ఇక్కడికొచ్చి పెట్టుబడులు పెడుతున్నారు. వాళ్ల పెట్టుబడులు, భవిష్యత్తు బాగుండాలి. అలా ఉండాలంటే హైదరాబాద్‌లో శాంతి భద్రతలు అదుపులో ఉండాలి" అని కేటీఆర్ అన్నారు.

తెలంగాణపై విషం చిమ్మిన మోడీ

అమృతకాల సమావేశాల్లో ప్రధాని మోడీ తెలంగాణపై ఎందుకు విషం చిమ్మారని మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. "పదే పదే తెలంగాణ ఏర్పాటును మోడీ కించపరుస్తున్నారు. తెలంగాణపై పగబట్టినట్టు మాట్లాడుతున్నారు. తల్లిని చంపి బిడ్డను వేరు చేశారని పదే పదే అంటున్నారు. 14 ఏండ్లు కేసీఆర్ పోరాడితే తెలంగాణ వచ్చింది. ప్రధాని చేసిన వ్యాఖ్యలకు తెలంగాణ ప్రజలకు తప్పకుండా వివరణ ఇవ్వాల్సిందే. పాలమూరు-రంగారెడ్డి అనుమతులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారు. పాలమూరు పచ్చబడుతుంటే భాజపా నేతల కండ్లు మండుతున్నాయి" అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

వాటా తేల్చే తీరిక ప్రధాని మోడీకి లేదా?

పాలమూరులో కాలు పెట్టే నైతిక హక్కు ప్రధాని మోడీకి లేదు. నదీ జలాల్లో వాటా తేల్చాలని కేసీఆర్ అడిగి పదేండ్లైంది.. సీఎం అయిన నెల రోజుల్లోనే కేసీఆర్.. మోడీని కలిసి విజ్ఞప్తి చేశారు. కృష్ణా జలాల్లో వాటా తేల్చే తీరిక ప్రధాని మోడీకి లేదా? అని కేటీఆర్ ప్రశ్నించారు. అమరావతికి తట్టెడు మట్టి, తొట్టెడు నీళ్ల మాత్రమే ఇచ్చారు. ఖాళీ చేతులతో వచ్చి ఖాళీ చేతులతో వెళ్లడం మోడీకి అలవాటే. ఈసారి కూడా 110 స్థానాల్లో డిపాజిట్లు గల్లంతు కావడం ఖాయం. తెలంగాణలో ఒక్క ప్రాజెక్టుకైనా జాతీయ హోదా ఇవ్వాలని అడిగాం. తొమ్మిదిన్నరేండ్ల తరువాత అయినా ప్రధాని మోదీ పాప పరిహారం చేసుకోవాలి. రెండు జాతీయ పార్టీలు తెలంగాణపై పగబట్టాయని విమర్శించారు.

గవర్నర్ పదవికి తమిళిసై అర్హురాలు కాదు..

"ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న వ్యక్తులనే ఎమ్మెల్సీలుగా కేబినెట్ సిఫార్సు చేసింది. గవర్నర్ మనసుతో ఆలోచించి ఉంటే తిరస్కరించేవారు కాదు. రాజకీయాల్లో ఉన్న వారిని సిఫారసు చేయొద్దని గవర్నర్ అన్నారు. ఈ నియమం ఆమెకు వర్తించదా? గవర్నర్ అయ్యే ముందు వరకు తమిళిసై తమిళనాడు భాజపా అధ్యక్షురాలిగా ఉన్నారు. ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్న వారు గవర్నర్ గా వ్యవహరించకూడదని సర్కారియా కమిషన్ స్పష్టంగా చెప్పింది. గవర్నర్లు మోడీ ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారు. జ్యోతిరాదిత్య సింధియా కూడా ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. గవర్నర్ ఇప్పటికీ భాజపా నేతగా వ్యవహరించట్లేదా? తెలంగాణలోనే కాదు అన్ని రాష్ట్రాల్లోనూ గవర్నర్లు మోడీ ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారు. మీకో న్యాయం ఇతరులకో న్యాయమా? గవర్నర్ పదవికి తమిళిసై అర్హురాలు కాదు. బలహీన వర్గాలకు చెందిన ఇద్దరు వ్యక్తులను శాసనమండలికి తీసుకొస్తామంటే మీ కేంటి ఇబ్బంది. ఎవరు అర్హులు..ఎవరు అనర్హు లో? ప్రజాక్షేత్రంలో తేల్చుకుంటాం" అని కేటీఆర్ సవాల్ చేశారు.

అలరించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు
- సికింద్రాబాద్ గణపతి ఆలయంలో నృత్యప్రదర్శన

రేతిబౌలి : సికింద్రాబాద్ లోని రేతిబౌలి గణపతి ఆలయంలో తొమ్మిదో రోజు వినాయక వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళ వారం ఆలయ ప్రాంగణంలో చిన్నా రలతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకు న్నాయి. గణపతి ఆలయ కమిటీ చైర్మెన్ వోదెల సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు టెట్ ఫలితాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలు బుధవారం ఉదయం పది గంటలకు విడుదల కానున్నాయి. ఈనెల 15న టెట్ రాతపరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. టెట్ పేపర్-1కు 2,69,557 మంది దరఖాస్తు చేస్తే వారిలో 2,26,744 (84.12 శాతం) మంది హాజరయ్యారు. పేపర్-2కు 2,08,498 మంది దరఖాస్తు చేయగా, వారిలో 1,89,963 (91.11 శాతం) మంది అభ్యర్థులు పరీక్ష రాశారు.

అంగన్వాడీ సమ్మెకు పలు పార్టీల మద్దతు



బోనాలతో నిరసనలు, రాస్తారోకోలు
- మహబూబాబాద్ చలో కలెక్టరేట్ ఉద్రిక్తం

నవతెలంగాణ-విలేకరులు

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగులు చేపట్టిన సమ్మె మంగళవారం 16వ రోజుకు చేరుకున్నది. తెలంగాణ అంగన్‌వాడీ, హెల్పర్స్ యూనియన్ జాయింట్ రాష్ట్ర కమిటీల (సీఐటీయూ, ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో నిరసనలు చేపట్టారు. మాజీ ఎమ్మెల్యేలు దీక్షలకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మహబూబాబాద్‌లో చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. జిల్లా నలుమూలల నుంచి మహబూబాబాద్ వస్తున్న అంగన్‌వాడీలను అడ్డుకునేందుకు.. మరిపెడ, ఇల్లెందు, నర్సంపేట, కేసముద్రం, తొర్రూరు రహదారుల్లో పోలీసులు పెద్ద ఎత్తున మోహరించి వారిని ఎక్కడికక్కడ అడ్డుకొని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. అయినా పోలీసులను తప్పించుకొని 500 మంది అంగన్‌వాడీలు మానుకోట తహసీల్దార్ కార్యాలయం చేరుకున్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్‌ను అరెస్ట్ చేయడానికి పోలీసులు ప్రయత్నించగా అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. దాంతో వారిమధ్య తోపులాట ఘర్షణ నెలకొంది. అయినా అక్కడి నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీగా బయలుదేరగా.. బంధం కట్ట వద్దకు చేరుకోగానే.. అప్పటికే అక్కడ మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. దాంతో వారు రోడ్డుపై బైటాయించి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఈ సమ్మెకు మద్దతు తెలిపేందుకు వచ్చిన సీపీఐ(ఎం), సీపీఐ జిల్లా కార్యదర్శులు సాదుల శ్రీనివాస్, బి.విజయ సారథి ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 రోజులుగా సమ్మెలో ఉన్న అంగన్‌వాడీల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, మహిళా కార్మికులను రోడ్డున పడేసిన ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో గద్దె దింపేందుకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ఉద్యోగులుగా గుర్తించకుండా పని చేసినంత కాలం గౌరవ వేతనంతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని విమర్శించారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించినా, సమ్మెలో ఉన్న యూనియన్‌లను తక్షణమే చర్చలకు పిలవకపోయినా అవసరమైతే ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బి.అజయ్, సీపీఐ(ఎంఎల్) నాయకులు బుజ్జి దేవేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సురనేని రాము, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకులు స్నేహబిందు, బి. సరోజ, చిరా లక్ష్మీనరసమ్మ, శైలజ నీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా యాచారంలో చేపట్టిన సమ్మెకు మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మద్దతు తెలిపి మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మెలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ మాట్లాడుతూ.. వెంటనే చర్చలకు పిలిచి సమస్యను పరిష్కరించాలని కోరారు. శంషాబాద్‌లో మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. వీరికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బైతి శ్రీధర్ మద్దతు తెలిపారు. వికారాబాద్ జిల్లా పరిగి పరిధిలోని బీజాపూర్-హైదరాబాద్ జాతీయ రహదారిపై అంగన్‌వాడీలు రాస్తారోకో నిర్వహించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో అంగన్‌వాడీలు బోనాలతో నిరసన తెలిపారు. స్థానిక రాజీవ్ చౌక్ వద్ద మానవహారం చేశారు. సమ్మెకు మాజీ ఎమ్మెల్యే రేపాల శ్రీనివాస్ మద్దతు తెలిపారు. ఈ సమ్మెలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లయిన కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇతర సౌకర్యాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో మంత్రి సత్యవతి రాథోడ్ దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించి నిరసన తెలిపారు. యాదాద్రిభువనగిరిలో భువనగిరి, ఆలేరు, చౌటుప్పల్, రామన్నపేట మండలకేంద్రాల్లో సమ్మె కొనసాగింది.

బీఆర్ఎస్‌లో 'బీసీ' ఒక్కడే

ఉమ్మడి మెదక్ జిల్లాలో కొరవడిన సామాజిక న్యాయం

- 11 స్థానాల్లో రెండు ఎస్సీ రిజర్వుడ్
- 9 జనరల్ స్థానాల్లో బీసీ ఒక్కరే
- బీసీ ఆశావహుల్లో తీవ్ర నిరాశ
- బీఆర్ఎస్‌కు ముదిరాజుల మూకుమ్మడి దూరం

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి మెదక్ జిల్లాలో అధికార బీఆర్ఎస్ పార్టీలో సామాజిక న్యాయం కొరవడింది. 11 అసెంబ్లీ స్థానాలకు గాను ఒకే ఒక్క బీసీకి చోటు లభించింది. రెండు ఎస్సీ రిజర్వుడ్ స్థానాలు పోగా మిగతా తొమ్మిది స్థానాల్లో ఓసీలకే టికెట్లు కేటాయించారు. ఐదుగురు రెడ్లు, ముగ్గురు వెలమ సామాజిక తరగతులకు చెందిన వాళ్లే పోటీ చేయనున్నారు. కేసీఆర్ అగ్రవర్ణాలకే ప్రాధాన్యత ఇవ్వడంతో బీసీ ఆశావహులకు నిరాశ తప్పలేదు. టికెట్లు ఆశించిన ముగ్గురు ముదిరాజ్ సామాజిక తరగతికి చెందిన ఆశావహులు అసమ్మతి గళం వినిపిస్తూ వేరుకుంపటి పెడుతున్నారు. మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ ఎంత బుజ్జగించినా వినే పరిస్థితి కనిపించడం లేదు. బీఆర్ఎస్ నుంచి బి-ఫామ్స్ ఇచ్చే వరకు శాంతించేది లేదంటూ ముదిరాజ్‌లు మూకుమ్మడిగా తిరుగుబాటు చేస్తున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లా రాజకీయాల్ని నిశితంగా పరిశీలిస్తే.. అధిపత్య కులాలదే పైచేయిగా కనిపిస్తోంది. బీఆర్ఎస్‌లో గత రెండు పర్యాయాలు ఓసీలే పోటీ చేసి గెలిచారు. ఇప్పుడు మూడో సారి కూడా ఆ పార్టీలో వెలమ, రెడ్డి సామాజిక తరగతులకే పెద్ద పీట వేశారనే ఆరోపణలున్నాయి. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు, మేనల్లుడు తన్నీరు హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎస్సీ రిజర్వుడు స్థానాలు పోగా మిగతా అన్ని చోట్ల కూడా ఓసీలనే బీఆర్ఎస్ అభ్యర్థులుగా ప్రకటించారు. చట్టసభల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలని, సామాజిక న్యాయం అమలు చేయాలనే డిమాండ్ బలంగా వినిపించే ఉమ్మడి మెదక్ జిల్లాలో అధికార పార్టీ మాత్రం మచ్చుకు ఒకే ఒక సీటు బీసీకి కేటాయించి చేతులు దులుపుకుంది. అనేక మంది బీసీ ఆశావహులు పార్టీ కోసం కష్టపడి పని చేశారు. సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజాదరణ పొందారు. అధికార పార్టీలో కొనసాగుతున్న అనేక మంది బీసీలకు కనీస గుర్తింపు రాకపోవడంతో తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. ఎన్నికల వేళ ఇద్దరు, ముగ్గురు ఉద్యమకారులకు రాష్ట్ర స్థాయి చైర్మెన్ పదవులు కట్టబెట్టిన బీఆర్ఎస్.. అంతిమంగా బీసీలకు మరోసారి మోసమే చేసిందని విమర్శలు వెలువడుతున్నాయి.

బీసీ ఆశావహులకు నిరాశ

బీఆర్ఎస్‌లో క్రియాశీలకంగా పనిచేస్తున్న పలువురు బీసీ నాయకులు ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. పార్టీలో కష్టపడి పనిచేయడంతో పాటు స్వంత డబ్బులు ఖర్చు చేసి సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజలకు దగ్గరయ్యారు. తీరా కేసీఆర్ ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో చోట లభించకపోయే సరికి తీవ్ర నిరాశకు గురయ్యారు. పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి చిట్కూల్ ఏకగ్రీవ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్ టికెట్ కోసం ఎంతో కష్టపడ్డారు. నియోజకవర్గంలో 70 వేల మంది ముదిరాజ్ ఓటర్లున్నారు. ఎమ్మెల్యేగా గెలవాలనే లక్ష్యంతో నీలం మధు అనేక సేవా కార్యక్రమాలు చేశారు. తీరా తనకు అవకాశం కాకపోయే సరికి నెల రోజులుగా తన అనుచరులు వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేస్తున్నారు. మంత్రి హరీశ్‌రావు బుజ్జగించినా తగ్గడంలేదు. సంగారెడ్డి టికెట్ కోసం ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ వైస్ చైర్మెన్ పట్నం మాణిక్యం ముదిరాజ్ తీవ్రంగా ప్రయత్నించారు. అయినా అవకాశం రాకపోయే సరికి ఆయన తన అనుచరులతో ప్రత్యేక సమావేశాలు జరుపుతున్నారు. ఈ నెల 22న తన పుట్టిన రోజున భారీ జనసమీకరణతో ఊరేగింపు, సభ పెట్టి తానే బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేయబోతున్నట్టు ప్రకటించుకున్నారు. ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులుగా ఉన్న పులి మామిడి రాజు కూడా టికెట్ ఆశించి రాకపోయేసరికి ఇటీవల ఆయన బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. ముగ్గురు కీలకమైన ముదిరాజ్ తరగతికి చెందిన నాయ కులకు అవకాశం రాకపోయే సరికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముదిరాజులు బీఆర్ఎస్‌కు దూరం అయ్యే అవకాశముంది. సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లో ముదిరాజ్‌లు సమావేశమై బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. గజ్వేల్‌లో ఈటల కుటుంబంలో ఎవరో ఒకరు పోటీ చేస్తే బీఆర్ఎస్‌కు ముదిరాజ్ ఓటర్లు మరింత దూరమవుతారనే చర్చ వినిపిస్తుంది.

చింత ప్రభాకర్ ఒక్కరే బీసీ..



11 స్థానాలకు గాను ఒకే ఒక బీసీ వ్యక్తికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించింది. సంగారెడ్డి నియోజకవర్గం నుంచి పద్మశాలి బీసీ సామాజిక తరగతికి చెందిన చింత ప్రభాకర్‌కు టికెట్ ప్రకటించారు. సుదీర్ఘ కాలం రాజకీయాల్లో ఉన్న చింత ప్రభాకర్ టీడీపీలో ఉన్నప్పుడే ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ఆ తర్వాత టీఆర్ఎస్‌లో చేరారు. 2014 ఎన్నికల్లో టీఆర్ఎస్ నుంచి సంగారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. 2018 ఎన్నికల్లో తిరిగి టీఆర్ఎస్ తరపున పోటీ చేసిన ఆయన కాంగ్రెస్ ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి చేతిలో ఓడిపోయారు. దాంతో చింత ప్రభాకర్‌కు బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవితో పాటు చేనేత అభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మెన్ పదవిని కూడా ఇచ్చారు. ఇటీవల ఆయన అనారోగ్యానికి గురై కోలుకున్నారు. తిరిగి మూడో సారి పోటీ చేసేందుకు పార్టీ అవకాశం కల్పించింది.

ఐదుగురు రెడ్లు.. ముగ్గురు వెలమలు

ఉమ్మడి మెదక్ జిల్లాలోని 11 అసెంబ్లీ స్థానాల్లో.. జహీరాబాద్, అందోల్ ఎస్సీలకు రిజర్వుడు చేయబడ్డాయి. మిగతా తొమ్మిదిలో సంగారెడ్డి మాత్రమే బీసీకిచ్చారు. మెదక్ అసెంబ్లీ నియోజకవర్గం టికెట్‌ను సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికే ఇచ్చారు. నర్సాపూర్ టికెట్ పెండింగ్‌లో పెట్టినా రెడ్డి సామాజిక తరగతికే దక్కనుంది. సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మహిళా కమీషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి వీరిద్దరిలో ఒకరికి ఛాన్స్ రానున్నది. సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేట జిల్లాలో 4 అసెంబ్లీ స్థానాలుండగా, గజ్వేల్ నుంచి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, సిద్దిపేట నుంచి తన్నీరు హరీశ్‌రావు, హుస్నాబాద్ నుంచి వడితల సతీష్‌కుమార్ పోటీ చేయనున్నారు. ఈ ముగ్గురు కూడా వెలమ సామాజిక తరగతికి చెందిన వారే. దుబ్బాక నియోజకవర్గం నుంచి ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిని బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించారు.

కేటీపీపీ ఇంజినీరింగ్ అధికారుల గుండెల్లో గుబులు

- నేడో, రేపో మరికొంతమంది అధికారుల అరెస్టులు
- యంత్ర పరికరాల చోరీ ఘటనపై పోలీసుల రెడ్ మార్క్



నవతెలంగాణ - గణపురం

జయశంకర్-భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని చెల్పూర్ కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు(కేటీపీపీ)లోని యంత్ర పరికరాల చోరీ కేసులో ఇంజినీరింగ్ అధికారుల గుండెల్లో గుబులు పుడుతోంది. నేడో, రేపో మరి కొంతమంది ఇంజినీరింగ్ అధికారులను అరెస్టు చేసేందుకు రంగం సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. కేటీపీపీలోని స్టోర్ రూమ్‌లో జూన్ మొదటి వారంలో చోరీ జరిగింది. ప్రాజెక్టుకు వినియోగించే టర్బైన్ విడి భాగాలు, బాయిలర్, జనరేటర్, బేరింగ్స్, కాపర్ వాల్స్ లాంటి సుమారు రూ.82 లక్షల విలువైన పరికరాలు మాయమయ్యాయి. దీనిపై ఇంజినీరింగ్ అధికారులు జూన్ 7న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జెన్కో విజిలెన్స్ అధికారులు, డైరెక్టర్లు కేటీపీపీలో పరిశీలించారు. అనంతరం ఇద్దరు సీఐలు, ఒక డీఎస్పీ అధికారితో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేశారు. వారు విచారణ చేపట్టగా అవినీతి బాగోతం ఒకొక్కటి వెలుగులోకి వస్తోంది. ఈ క్రమంలో కేటీపీపీకి వెల్డింగ్, కట్టింగ్ పనులు చేసే కల్యాణి ఇంజినీరింగ్ వర్క్స్‌కు చెందిన కాంట్రాక్టర్ ఠాగూర్ వద్ద కొన్ని సామాన్లు లభ్యమయ్యాయి. దాంతో ఆయన్ను పోలీసులు గత శుక్రవారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదే కేసులో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్(ఏడీఈ) డి. కిరణ్‌కుమార్‌నూ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కాగా పోలీసుల విచారణలో మరి కొంతమంది ఇంజినీరింగ్ అధికారులు ఉన్నట్టు సమాచారం. రూ.82 లక్షల దొంగతనం కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు జెన్కో అధికారులను సీరియస్‌గా విచారిస్తున్నారు.

తెగిన కడెం ప్రాజెక్టు గేటు

- కౌంటర్ వెయిట్ రోప్
- వృథా అవుతున్న నీరు



నవతెలంగాణ-కడెం

నిర్మల్ జిల్లా కడెం మండలంలోని కడెం ప్రాజెక్టు వరద గేట్లు ఎత్తే సమయంలో 15వ నెంబర్ వరద గేటు కౌంటర్ వెయిట్ రోప్ పుల్లి వద్ద తెగిపోయింది. అది ప్రాజెక్టు కింది వైపు నీళ్లలో పడిపోయింది. దీంతో కడెం ప్రాజెక్టు 15వ నెంబర్ వరద గేట్ ఎత్తలేని పరిస్థితి ఏర్పడింది. గతంలో వరద పోటెత్తడంతో ప్రాజెక్టు గేట్లు దెబ్బతిన్నాయి. వాటి మరమ్మతు పనులు పూర్తికాకముందే ప్రాజెక్టు 15వ నెంబర్ వరద గేటు కౌంటర్ వేయిట్ విరిగిపోయింది. ఇప్పటికే ప్రాజెక్టు రెండో నెంబర్ వరద గేటు కౌంటర్ వెయిట్ గత వరదలకు విరిగిపోవడంతో నేటికీ మరమ్మతులు పూర్తికాక గేటు ఎత్తలేని పరిస్థితుల్లో ఉంది. ఇప్పుడు 15వ నెంబర్ వరద గేటు కౌంటర్ వెయిట్ రోప్ వైర్ తెగి విరిగిపోవడంతో దీనికి మరమ్మతులు ఎన్నాళ్లకు పూర్తవుతాయోనని స్థానికుల్లో చర్చ నడుస్తోంది. ప్రాజెక్టు మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక నాయకులు, రైతులు, కడెం ముంపు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తగ్గేదేలే అంటున్న కసిరెడ్డి..!

- ప్రగతిభవన్‌లో కేటీఆర్ బుజ్జగించే ప్రయత్నం
- నాన్నతో మాట్లాడతానన్న మంత్రి
- కార్యకర్తల ఒత్తిడి ఉందన్న ఎమ్మెల్సీ
- 29న కాంగ్రెస్‌లో చేరేందుకు ఏర్పాట్లు



నవతెలంగాణ -కల్వకుర్తి

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి కారు దిగి చెయ్యి అందుకునేందుకు సిద్ధమైనట్టు ప్రచారం సాగుతోంది. ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ వైఖరితోపాటు, పార్టీలో కార్యకర్తలకు జరుగుతున్న అన్యాయంపై అధిష్టానానికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం వల్ల విసిగి వేసారి పోయిన ఆయన చివరకు బీఆర్ఎస్‌ను వీడేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఆయన పార్టీ మారుతున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో ప్రగతిభవన్ వర్గాలు స్పందించాయి. స్వయంగా మంత్రి కేటీఆర్ కసిరెడ్డి నారాయణరెడ్డికి ఫోన్ చేసి పిలిపించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనతో చర్చలు జరిపారు. "ముహూర్తాల సమయం ఇవ్వండి.. అభ్యర్థి మార్పు విషయంలో నాన్నగారి(సీఎం కేసీఆర్)తో మాట్లాడి నిర్ణయం తీసుకుంటాం.. పార్టీ మారొద్దు.. మీకు భవిష్యత్తు ఉంటుంది" అని ఎమ్మెల్సీకి మంత్రి నచ్చజెప్పే ప్రయత్నం చేసినట్టు తెలిసింది. తనపై కార్యకర్తల ఒత్తిడి తీవ్రంగా ఉందని, గతంలో పార్టీ టికెట్ ఇస్తామన్న హామీ విషయాన్ని ఈ సందర్భంగా కసిరెడ్డి గుర్తుచేసినట్టు సమాచారం. సర్వే ఆధారంగా టికెట్లు కేటాయిస్తామని చెప్పి.. ఇప్పుడు సర్వేలో అట్టడుగున ఉన్న వ్యక్తికి పార్టీ టికెట్ ఎలా ఇస్తారంటూ ప్రశ్నించినట్టు సమాచారం. నియోజకవర్గంలో నెలకొన్న వాస్తవ పరిస్థితులను ఒకసారి తెలుసుకోవాలని మంత్రిని కోరారు. పార్టీలో సముచిత స్థానం లేదని, అలాంటప్పుడు ఎలా కొనసాగాలి అంటూ మంత్రికి వివరించే ప్రయత్నం చేశారు.

ఐదు సంవత్సరాలుగా ఎంతో ఓపికతో ఉన్నానని, తన మద్దతుదారులకు, కార్యకర్తలకు పార్టీలో ఎమ్మెల్యే తగిన గుర్తింపు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారని తెలిసింది. నియోజకవర్గంలో ప్రభుత్వ పథకాలు దళిత బంధు, గృహలక్ష్మి, బీసీ బంధు తదితర పథకాలలో ఎమ్మెల్యే చెప్పిన వ్యక్తులకే అందజేస్తున్నారని అలాంటప్పుడు తాను పార్టీలో ఉండి ఏమి ఉపయోగం లేదని మంత్రితో అన్నట్టు సమాచారం. కార్యకర్తల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని నిర్ణయం తీసుకుంటానని చెప్పినట్టు వినిపిస్తోంది. 'అన్నా తొందర పడొద్దు.. కూర్చొని మాట్లాడదాం" అంటూ మంత్రి కేటీఆర్ సర్దిజెప్పే ప్రయత్నం చేయగా.. ఎమ్మెల్సీ మాత్రం తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమైనట్టు ప్రచారం సాగుతోంది.

ఈనెల 29న కాంగ్రెస్‌లోకి..

బీఆర్ఎస్ పార్టీ నాయకుల తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు నిర్ణయించుకున్నట్టు సమాచారం. ఇప్పటికే పార్టీ అధినేత రాహుల్ గాంధీతో చర్చించిన ఆయన ఈనెల 29న కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. రాబోయే ఎన్నికల్లో కల్వకుర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. దీంతో ఉమ్మడి జిల్లాలో అధికార పార్టీపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు నారాయణరెడ్డికి స్వాగతం పలుకుతున్నారు. ఆయన పార్టీలోకి వస్తే కల్వకుర్తి గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమన్న ధీమాతో ఉన్నారు.

యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల్ని రెగ్యులరైజ్ చేయాలి

- కాంట్రాక్ట్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి నిరసన



నవతెలంగాణ-కేయూ క్యాంపస్

రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న 1445 మంది కాంట్రాక్టు అధ్యాపకుల్ని రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ మంగళవారం హన్మకొండ జిల్లా కాకతీయ విశ్వవిద్యాలయంలోని కాంట్రాక్ట్ అధ్యాపకులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. యూనివర్సిటీ పరిపాలన భవనం నుంచి ఎస్‌డీఎల్‌సీ క్రాస్ రోడ్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ చైర్మెన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోధ్ పాల్గొని మాట్లాడారు. 145 రోజుల నుంచి అనేక విధాలుగా సదస్సులు, రౌండ్ టేబుల్, కాన్ఫరెన్స్, నిరసనలు, రిలే నిరాహార దీక్షలు చేయడంతో పాటు యూనివర్సిటీ, ప్రభుత్వ అధికారులను, విద్యాశాఖ మంత్రి, హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మెన్‌ను కలిసినా సమస్యలు పరిష్కారం కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో కాంట్రాక్టు అధ్యాపకులందరూ విధుల్ని బహిష్కరించి నిరవధిక సమ్మెకు వెళ్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసినట్టు యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులనూ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు డాక్టర్ మధుకర్ రావు, జరుపుల చందులాల్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రఘు వర్ధన్ రెడ్డి ఆర్‌డీ ప్రసాద్, డాక్టర్ అనిల్ కుమార్, వెంకటేశ్వర్లు,కల్పన, శ్రీలత, స్వప్న, మంజుల, రాజశ్రీ, రాజేష్ రెడ్డి, రమేష్, అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

కూలీలపై పిడుగు పాటు

- గుండాలలో ఒకరు మృతి
- తిరుమలాయపాలెంలో ఇద్దరి పరిస్థితి విషమం

నవతెలంగాణ-గుండాల /తిరుమలాయపాలెం

రోజువారి వ్యవసాయ కూలీ పనులకు వెళ్తే గాని పూట గడవని నిరుపేద కూలీలు పిడుగుపాటుకు గురి కావటంతో ఒకరు మృతి చెందగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం కొడవటంచ గ్రామానికి చెందిన రైతు గొగ్గెల రామస్వామి.. మంగళవారం సాయంత్రం తన పశువులను మేపుకొని ఇంటికి వస్తున్న క్రమంలో అకస్మాత్తుగా భారీ వర్షం కురిసింది. అదేసమయంలో రైతు సమీపంలో పిడుగు పడటంతో రైతు అక్కడికక్కడే మృతి చెందారు. మృతునికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. దాంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం గ్రామానికి చెందిన రైతు మద్ది వీరయ్య వ్యవసాయ భూమిలో మిర్చి పంటలో కలుపు తీసేందుకు మంగళవారం అదే గ్రామానికి చెందిన 8 మంది కూలీలు వెళ్లారు.

మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురవటంతో ఒక్కసారిగా కూలీలంతా దగ్గరలో ఉన్న వేప చెట్టు కిందకు వెళ్లారు. అదే సమయంలో పెద్ద శబ్దంతో పిడుగు పడటంతో కూలీలంతా సొమ్మసిల్లిపోయారు. దగ్గర్లో ఉన్న రైతులు వారిని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మద్ది వరమ్మ, గోకనపల్లి సావిత్రి ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. పిడుగుపాటుకు గురైన కూలీలకు ప్రకృతి విపత్తు కింద ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని రైతు సంఘం నాయకులు తుళ్లూరు నాగేశ్వరావు, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొమ్ము శీను ప్రభుత్వాన్ని కోరారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు

- నాగర్‌కర్నూల్ నాయకుల చేరిక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చే నాయకుల వలస కొనసాగుతూనే ఉన్నది. తాజాగా నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు హస్తం గూటికి చేరారు. మంగళవారం హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లోని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి నివాసంలో వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో వైస్ ఎంపీపీ నిర్మల, ఎంపీటీసీలు కృష్ణయ్య, శ్రీను, రాజు, మల్లయ్య, మాజీ ఎంపీటీసీలు రమణారావు, శాంతయ్య, సర్పంచ్ స్వామి, ఉప సర్పంచ్ భగవంత్‌గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్లు రామచంద్ర రావు, తిరుపతయ్య, మాజీ సర్పంచులు నర్సింహా, బుచ్చన్న, కుర్మయ్య, కౌన్సిలర్ శ్రీనివాసులు తదితరులున్నారు.

త్వరలో వజీర్ ప్రకాష్ గౌడ్ చేరిక

బీఆర్ఎస్ నేత, జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వజీర్ ప్రకాష్ గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. తాజాగా ఆయన రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జ్ మానిక్‌రావ్ ఠాక్రే, మధుయాష్కీగౌడ్‌లను మర్యాద పూర్వకంగా కలిశారు.

గవర్నర్ నిర్ణయం సరైందే..

- గణేష్ నిమజ్జన ఏర్పాట్లలో ప్రభుత్వ వైఫల్యం : బీజేపీ ఎంపీ బండి సంజయ్

నవతెలంగాణ-కరీంనగర్

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా దాసోజ్ శ్రవణ్, సత్యనారాయణ పేర్లను సూచిస్తూ ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తిరస్కరించడం ముమ్మాటికీ సరైన నిర్ణయమే అ నిబీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగడి క్రిష్ణారెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ సహా స్థానిక కార్పొరేటర్లతో కలిసి బండి సంజయ్ కరీంనగర్ టవర్ సర్కిల్‌లో వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. గవర్నర్ తన విచక్షణాధికారులను ఉపయోగించి నిర్ణయం తీసుకున్నారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం.. గవర్నర్ రబ్బర్ స్టాంప్‌గా ఉండాలను కుంటోందని, పంపిన ఫైళ్లన్నీ చూడకుండా సంతకం పెట్టాలనుకుంటోందని అన్నారు.
అలాకాకుండా గవర్నర్ రాజ్యాంగ బద్ధంగా వ్యవహరిస్తే ఆమెకు దురుద్దేశాలు ఆపాదిస్తున్నారన్నారు. గణేష్ నిమజ్జన ఏర్పాట్లలో జిల్లా అధికార యంత్రాంగం ఘోరంగా విఫలమైందని, కనీస సౌకర్యాలు కల్పించక పోవడం, కరెంట్ వైర్లు తొలగించకపోవడంతో అధికారుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అధికారులు వార్డుల్లోని గణేష్ ఉత్సవ కమిటీల వద్దకు వెళ్లి టవర్ సర్కిల్‌కు విగ్రహాలను తీసుకు రావొద్దని, నేరుగా నిమజ్జనానికి వెళ్లాలని లేనిపక్షంలో ఇబ్బంది పడతారంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. "అందరూ టవర్ సర్కిల్‌కు వస్తారు.. ఏం చేస్తారో చూస్తా.. నేను అక్కడే కూర్చుంటా.. చూద్దాం ఏం చేస్తారో.." అన్నారు.

పథకాల అక్రమ బదిలీ !?

లబ్దిదారుడు ఒక్కరే.. పంపిణీ పలువురికి

- గులాబీ మార్కు రాజకీయం
- లోపాయకారి ఒప్పందాలతో
- ఎన్నికలను గట్టేక్కే యత్నం
- దళిత, బీసీ, మైనార్టీ బంధు పథకాలకు చెదలు
- దూ(దు)రాలోచనలో సర్కారు


నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్


(ఫైల్)

రాష్ట్ర ప్రభుత్వం పథకాల అమల్లో అక్రమాలకు తెరతీస్తున్నది. నిబంధనలకు విరుద్ధంగా బదిలీచేస్తూ వచ్చే ఎన్నికలను గట్టేక్కే ప్రయత్నం చేస్తున్నది. ఎక్కువ మందికి లబ్దిచేకూర్చేందుకు తాను రూపొందించిన విధానాన్ని తానే ఉల్లంఘిస్తున్నది. జిల్లాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఇందుకు సాక్ష్యంగా నిలుస్తుండటం గమనార్హం. దళిత, బీసీ, మైనార్టీ బంధు , గృహలక్ష్మి పథకాలు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా అమలవుతున్నాయి. పథకాలకు ఎంపిక చేసిన అసలైన లబ్దిదారులతోపాటు ఇతులకూ సర్దుబాటు చేస్తున్నది. రికార్డుల్లో అధికారికంగా ఒక పేరు ఉంటే, అనధికారికంగా మరో ఇద్దరు, ముగ్గురికి పథకాన్ని వర్తింపజేసి తమ రాజకీయ ప్రయోజనాన్ని నెరవేర్చుకునే ప్రయత్నంలో ఉంది. ఇందుకు ఆయా పథకాల లబ్దిదారులు, ఇతరుల మధ్య లోపాయకారి ఒప్పందాలను కుదురుస్తున్నది. ప్రభుత్వ ఫలాలను ఎరవేయడం ద్వారా ప్రతిపక్షాలకు చెందిన చోటామోటా నాయకులు, వార్డులు, గ్రామాల్లో ప్రభావం చూపకలిగిన వ్యక్తులను వలలో వేసుకోవాలనే వ్యూహా రచనకు పూనుకుంది. అనర్హులకు సర్కారీ తాయిలాలను వర్తింపజేసి ఓట్లను కొల్లగొట్టే ప్రయత్నాలను ముమ్మురం చేసింది. ఇందుకు అధికార పార్టీ స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు పావులు కదుపుతున్నారు. ఎన్నికల్లో లబ్దిపొందే దూ(దు)రాలోచనే కారణం. ఉదాహరణకు సర్కారు దళితబంధు లబ్దిదారులకు రూ. 10 లక్షల చొప్పున ఆర్థిక సాయంతో రకరకాల యూనిట్లను అందిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇక్కడే ఒక కిటుకు అంతర్గతంగా దాగుంది. అధికారులు ఎంపిక చేసిన లబ్దిదారుడితోపాటు మరో ముగ్గురికి అనధికారికంగా అందులో భాగం పంచుతున్నారు. అధికార పార్టీ వారేకాకుండా ఇతర రాజకీయ పార్టీలకు చెందిన వారినీ ఆకర్షించి పథకాన్ని అక్రమంగా వర్తింపజేస్తున్నట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. అంటే దళితబంధులో వచ్చే రూ. 10 లక్షలను ఎంపికైన సదరు లబ్దిదారుడుకి రూ. 4 లక్షలు, మరో ఇద్దరికి రూ. 3 లక్షల చొప్పున ఇస్తున్నారు. ఇందులో లబ్దిదారుడికి రూ. లక్ష ఎక్కువన్న మాట. వాళ్ల ఎంపిక చేసుకున్న యూనిట్లను ఉమ్మడిగా పంచుతూ వచ్చే ఎన్నికల్లో మద్దతు పలకాలనీ, అండగా ఉండాలని ప్రమాణాలు సైతం చేయించుకుంటున్న దుస్థితి. అలాగే బీసీ బంధును సైతం ఇదే పద్ధతిలో అమలుచేస్తున్నారు.

ఎంపికైన లబ్దిదారుడికి వచ్చే రూ. లక్షలో లబ్దిదారుడికి రూ. 50 వేలు, మరో ఇద్దరికి రూ.25 వేల చొప్పున లోపాయకారిగా సర్దుబాటు చేస్తున్నారు. మైనార్టీ బంధునూ ఇలాగే నడిపిస్తున్నట్టు క్షేత్రస్థాయి ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో అదనంగా వచ్చే లబ్దిసంగతి పక్కనబెడితే అధికార బీఆర్ఎస్ శ్రేణుల్లోనూ తీవ్ర అసంతృప్తి నెలకొనడం గమనార్హం. వచ్చే సాయమే తక్కువైతే, దాన్ని సందట్లో సడేమియాలా ఇతరులకు పంచడం సరికాదని అంటున్నారు. ఇలాంటి లోపాయకారి ఒప్పందాలను అక్కడక్కడా లబ్దిదారులు వ్యతిరేకిస్తున్నారు కూడా. యాదాద్రి-భువనగిరి జిల్లా రామన్నపేట మండలం పల్లివాడ గ్రామంలో ఈ తరహా ప్రయోగం చేశారు.

ఇది రాష్ట్ర వ్యాప్తంగానూ లేకపోలేదనే సందేహాలూ ఉన్నాయి. ఈ గ్రామంలో ఒక లబ్దిదారుడు తనకు వచ్చిన దళితబంధును ఇతరులకు పంచడానికి నిరాకరించారు. దీంతో సంబంధిత లబ్దిదారుడిని బెదిరించి మరీ లోపాయకారి ఒప్పందానికి బలవంతంగా ఒప్పించారని తెలిసింది. ఎమ్మెల్యేలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తమ అనుకూలురుకు ప్రభుత్వ పథకాలను అందించే పేర అనర్హులకు ఫలహారంలా పంచిపెడుతున్నారు. ఇతర పార్టీల కార్యకర్తలు, నాయకులను తమవైపుకు తిప్పుకునే ప్రయత్నంలో ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. నిరుపేదల ఇండ్ల నిర్మాణానికి ఇస్తున్న రూ. 3 లక్షల పథకం గృహలక్ష్మిని సైతం ఇదే తంతు సాగుతోందనే విమర్శలూ లేకపోలేదు.



సంపాదకీయం

వాగ్దాన భంగం!

ఆనాడు రోమ్ నగరాన్ని అగ్ని దహించి వేసినట్టుగా, 'నిరుద్యోగం', ఉపాధిలేమి వంటి సమస్యలు నేడు మనదేశాన్ని దహించి వేస్తున్నాయి. చక్రవర్తి నీరోలాగే... ప్రధాని మోడీ ఫిడేల్ వాయిస్తున్నారు. అంతా ఫీల్‌గుడ్ అంటూ కొంతమంది అక్కడక్కడా తమ సొంత కాళ్లపై స్ఫూర్తిదాయకంగా నిలిచినవారిని తమ గొప్పగా చెప్పుకోవడం తప్ప మోడీ ప్రభుత్వం ఈ

దేశంలో నయా ఉదారవాద విధానాలు తీవ్రత పెరిగాక ప్రభుత్వరంగంలో ఉద్యోగాలు తగ్గనారంభించాయి. దీని ఫలితంగానే యువత నిరాశ నిస్పృహలకు లోనవుతున్నది. ఆయా రాష్ట్రాల్లో అలజడి పెరగడానికి కారణం నిరుద్యోగమే. ఉద్యోగ కల్పనలో తమ వర్గానికి రిజర్వేషన్ కల్పించాలని ఆందోళనలు జరుగుతుంటే, వీటికి పరిష్కారం చూపకుండా అగ్గికి ఆజ్యం పోసే విధంగా యువతకు ఎంతో మేలు చేశామని మోడీ చెప్పుకోవడం సిగ్గుచేటు.

కాలంలో చేసిందేమీ లేదు. ప్రతీసారి ఏవేవో సూక్తులు, భావోద్వేగ అంశాలను ముందుకు తెస్తూ నిరుద్యోగం, ఉపాధి సమస్యలు ఎన్నికల సమయంలో తెరపైకి రాకుండా కాషాయపెద్దలు జాగ్రత్తపడుతూవచ్చారు. గత ఎన్నికల్లో జాతీయ భద్రత, వైమానికదాడులు, హిందూత్వం, హిందూ మతోన్మాదం వంటి అంశాలతో మోడీ బయటపడగా.. మూడోసారి గెలిచి అధికారం చేపట్టేందుకూ వాటిపైనే ఫోకస్ పెట్టారు. అంతే తప్ప ఆర్థిక విధానాలలో ముఖ్యమైనది ఉపాధి రంగం గురించి పట్టించుకునేందుకు దృష్టి సారించడం లేదన్నది స్పష్టం.

మునుపెన్నడూ లేనంతగా రికార్డుస్థాయిలో దేశంలో నిరుద్యోగం 47ఏండ్ల గరిష్టానికి చేరింది. 18-25ఏండ్ల లోపు పట్టభద్రుల్లో నిరుద్యోగిత ఏకంగా 42శాతానికి చేరుకొన్నది. అంటే దాదాపు ప్రతి ఇద్దరిలో ఒకరు నిరుద్యోగిగానే ఉండిపోతున్నారు. వారంతా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. కొంతమందైతే ఉపాధి దొరకడం కష్టమని నిరాశ నిస్పృహలతో దరఖాస్తు చేసుకోవడానికి ఇష్టపడటం లేదు. ఇవి అజీజ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీకి చెందిన సెంటర్ ఫర్ స్టెయిన్‌బుల్ ఎంప్లాయిమెంట్ సంస్థ చేసిన సర్వేలో బయటపడిన వాస్తవాలు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) తాను విడుదల చేసిన ప్రకటనలోనూ సమస్య తీవ్రతను వెల్లడించింది.



కేంద్రంలో 2014లో మోడీ సర్కారు కొలువుతీరాక యువతకు ఉపాధి అవకాశాలు మృగ్యమయ్యాయి. మోడీ ఎన్నికలకు ముందుచేసిన అతి ముఖ్యమైన హామీ ఉద్యోగాల కల్పన, ఉపాధి సృష్టి. పదేండ్ల యూపీఏ హయాంలో యువతకు అన్యాయం చేసిందని చెప్పి గద్దెనెక్కిన మోడీ, అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాదికి రెండు కోట్ల కొత్త ఉద్యోగాలు దేవుడెరుగు... ఉన్న ఖాళీలే భర్తీ కాలేదు. మంజూరైన పోస్టులను సైతం భర్తీ చేయలేదు. పైగా ప్రభుత్వ ఉద్యోగాలకు కోతలు పెట్టింది. ఆయన చెప్పిన ప్రకారం తొమ్మిదేండ్లలో 18కోట్ల ఉద్యోగాలు నిరుద్యోగులకు కల్పించబడాలి. 389 ప్రభుత్వ రంగసంస్థల్లో 2014లో 16.9లక్షల ఉద్యోగులు ఉంటే, 2022 నాటికి ఈ సంఖ్య 14.6లక్షలకు తగ్గింది. సృష్టించబడాల్సింది పోయి శాశ్వత ఉద్యోగాలనే లేకుండా చేశారంటే కేంద్రప్రభుత్వ విధానాలు ఎవరికి ఉపయోగపడుతున్నాయనేది తెలుస్తోంది. వందసార్లు 'మన్‌కీ బాత్'లో మోడీ పాల్గొన్నా ఎన్ని కొత్త ఉద్యోగాలు కల్పించింది చెప్పడానికి సాహసం చేయలేదు. చేస్తేనే కదా లెక్కలుండేది. ప్రయివేటురంగంలో ఉద్యోగాలంటే విదేశీ, స్వదేశీ కంపెనీలు పెట్టుబడులు పెడితే వస్తాయి. వాటికోసమూ మోడీ ప్రభుత్వం చేసింది శూన్యం. ఇప్పుడు ఆ లెక్కలు కనపడకుండా దాచే ప్రయత్నం చేస్తోంది.

దేశంలో నిరుద్యోగం పెరగకుండా ఉండాలంటే ఏటా 80లక్షల చొప్పున కొత్త ఉద్యోగాలు సృష్టించాల్సిన అవసరం ఉంటుందని ప్రపంచబ్యాంకు నివేదిక గతంలోనే వెల్లడించింది. దేశంలో ప్రతినెలా 13లక్షల మంది కొత్తగా ఉద్యోగాల కోసం క్యూ కడుతున్నారు. ప్రభుత్వ, ప్రయివేటురంగాల్లో ఒక్కో పోస్టుకు వేల సంఖ్యల్లో పోటీ పడుతున్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీలను భర్తీ చేయాలని, ఉపాధి హామీ చట్టానికి నిధులు అధికంగా కేటాయించాలని నిపుణులు సూచించినా పట్టించుకున్నదెక్కడ?. అచ్చేదిన్, ఉద్దీపనలు, ఆత్మనిర్భరతా అంటూ కోట్ల రూపాయలను పారిశ్రామిక వేత్తలకు అప్పగించారు తప్ప చాంతాడులా పెరుగుతున్న నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి చేసింది శూన్యం. వాటికి కేటాయించిన నిధుల్లో సగమిచ్చినా ఎంతోమందికి ఉపాధి దొరికి ఆర్థిక వ్యవస్థ బాగుండేది. ప్రజల వద్ద డబ్బులుంటేనే ద్రవ్యోల్బణం అదుపులో ఉంటుంది. ధరలు పెరగవు. ఇది కూడా గమనంలో లేకపోతే ఎలా? ఇలాంటి అంశాలపై ఆర్‌బీఐలో పనిచేసిన మాజీ గవర్నర్లు చెప్పినా వినిపించుకోలేదు. ఏవేవో కాకిలెక్కలు, కుంటిసాకులు చెబుతూ వారి పాలనకు వారే కితాబిచ్చుకునేలా మోడీ, ఆయన భజన బృందం పని చేస్తుందనేది వాస్తవం.

దేశంలో నయా ఉదారవాద విధానాలు తీవ్రత పెరిగాక ప్రభుత్వరంగంలో ఉద్యోగాలు తగ్గనారంభించాయి. దీని ఫలితంగానే యువత నిరాశ నిస్పృహలకు లోనవుతున్నది. ఆయా రాష్ట్రాల్లో అలజడి పెరగడానికి కారణం నిరుద్యోగమే. ఉద్యోగ కల్పనలో తమ వర్గానికి రిజర్వేషన్ కల్పించాలని ఆందోళనలు జరుగుతుంటే, వీటికి పరిష్కారం చూపకుండా అగ్గికి ఆజ్యం పోసే విధంగా యువతకు ఎంతో మేలు చేశామని మోడీ చెప్పుకోవడం సిగ్గుచేటు.

దిగజారిన భారత్ - కెనడా సంబంధాలు - ఆందోళనలో పశ్చిమ దేశాలు



ఎం. కోటేశ్వరరావు
8331013288

హరదీప్ సింగ్ నిజ్జర్ అనే పంజాబ్ వేర్పాటువాద, ఉగ్రవాది హత్య ప్రస్తుతం భారత్-కెనడా మధ్య సంబంధాలు దిగజారటానికి దారితీసింది. నిజ్జర్ హత్యలో భారత్ ప్రమేయం ఉందని కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడేవ్ సెప్టెంబరు 18న పార్లమెంటులో చేసిన ఆరోపణను మనదేశం తిరస్కరించింది. దానికి ఎలాంటి ఆధారాలు లేవంది. అప్పటి నుంచి జరుగుతున్న పరిణామాలు అక్కడ విద్యాభ్యాసం, ఉపాధికోసం వెళ్లిన భారతీయుల కుటుంబాల్లో ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు ఈ వివాదం తమ చైనా వ్యతిరేక ఎత్తుగడలు, సమీకరణలకు ఎక్కడ దెబ్బతగులుతుందో అన్న భయం అమెరికా కూటమి దేశాల్లో వెల్లడి అవుతోంది. భౌగోళిక రాజకీయాల మీద చూపే ప్రభావమే కాదు, భారత్‌కు ఆగ్రహం కలిగిస్తే దాని మార్కెట్‌లో ప్రవేశించేందుకు అవకాశాలు తగ్గుతాయన్న ఆందోళన కూడా వాటిలో ఉంది. చైనా మీద ఆధారపడకుండా భారత్‌ను ప్రత్యామ్నాయ వస్తు ఎగుమతి దేశంగా మార్చేందుకు సాయం చేస్తామని, వాణిజ్య సంబంధాలు మెరుగుపరచుకుంటామని చేస్తున్న ప్రకటనలు తెలిసినవే. చేసిన ఆరోపణను కెనడా వెనక్కు తీసుకోవాలని మనదేశం డిమాండ్ చేస్తోంది. ఉగ్రవాదులకు కెనడా సురక్షిత స్వర్గంగా ఉందని వర్ణించింది. మూడునెలల పరిశోధన తరువాత భారత హస్తం ఉందని నిర్ధారించుకున్నామని కెనడా అంటోంది. ఈ ఆరోపణను ఉపసంహరించుకుంటే తప్ప మనదేశం వెనక్కు తగ్గదు, అదే జరిగితే కెనడా అభాసుపాలవుతుంది కనుక వెనక్కు తగ్గే అవకాశాలు తక్కువ. ఇది చినికి చినికి గాలివానగా మారితే జరిగే పర్యవసానాల గురించి ఆందోళన చెందుతున్న జి-7 కూటమిలో పెద్దన్న అమెరికా, ఇతర దేశాలు ఇప్పటి వరకు ఆచితూచి వ్యవహరించాయి.


ఈ ఏడాది జూన్ 18న కెనడా వాంకోవర్ సమీపంలోని సురే అనే చోట ఒక గురుద్వారా వెలుపల హత్యకు గురైన నిజ్జర్ 1977లో పంజాబ్‌లోని జలంధర్ సమీపంలోని ఒక గ్రామంలో జన్మించాడు. పంజాబ్‌లో తీవ్రవాదులపై 1995లో చర్యలను ముమ్మరం చేయటంతో 1997లో నిజ్జర్ నకిలీ పాస్‌పోర్టుతో కెనడా పారిపోయాడు. అక్కడ తప్పుడు సమాచారం వెల్లడికావటంతో కేసులు, వివాదాల తరువాత 2007లో కెనడా పౌరసత్వం ఇచ్చారు. ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ అనే ఉగ్రవాద సంస్థతో అతనికి సంబంధాలు ఉన్నాయని, ఒక వేర్పాటువాది, నేరగాడు అని అతన్ని అరెస్టు చేసి అప్పగించాలని గతంలో మనదేశం కెనడాను కోరింది. దాన్ని అది ఖాతరు చేయలేదు. స్వేచ్ఛగా తిరగనిస్తున్నది. అతడు ఒక మానవహక్కుల కార్యకర్త, శాంతియుత పద్ధతుల్లో సిక్కు దేశం ఏర్పాటుకు మద్దతు ఇచ్చినట్లు అతని మద్దతుదార్లు వాదిస్తారు. తమ దేశంలో భావ ప్రకటన స్వేచ్ఛ ఉందని అందువలన అతను మాట్లాడేదానితో తమకు సంబంధం లేదని కెనడా వాదించింది. అతను 2019లో సురే గురుద్వారా నేతగా మారాడు. 2020లో ఖలిస్తాన్ ప్రజాభిప్రాయ సేకరణలో, వేర్పాటువాదాన్ని సమర్థిస్తూ పేరు తెచ్చుకున్నాడు. అతని హత్యకేసులో ఇంతవరకు ఎవరినీ అరెస్టు చేయలేదు.

నిజ్జర్‌కు ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ అనే మిలిటెంట్ గ్రూపుతో సంబంధాలు ఉన్నాయని భారత్ చేసిన వినతి మేరకు 2014లో ఇంటర్ పోల్ అరెస్టు వారంటు జారీచేసింది. అతడు 2013-14లో పాకిస్థాన్ వెళ్లాడని అక్కడ పాక్ ఐఎస్ఐ చేర్చుకున్న బబ్బర్ ఖాల్సా అనే సంస్థకు చెందిన జగతార్‌సింగ్ తారాను కలిశాడని మన ప్రభుత్వం పేర్కొన్నది. అతని మీద నిఘా పెట్టాలని 2015లో కేంద్ర ప్రభుత్వం కోరింది. తరువాత రెండోసారి కూడా రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసింది. తన మీద భారత ప్రభుత్వం చేసిన ఆరోపణలు వాస్తవం కాదని, రాజకీయపరమైనవని నిజ్జర్ 2016లో కెనడా ప్రధానికి లేఖ రాశాడు. అతగాడు అనేక హత్యలకు కారకుడని, తమకు కావాల్సిన ముఖ్యులలో ఒకడని 2018లో కేంద్రం కెనడాకు తెలిపింది. పంజాబ్‌ను విముక్తి చేసి ఖలిస్తాన్ ఏర్పాటు చేయాలన్న ప్రచారానికి నిజ్జర్ మద్దతు తెలిపాడు. 2020లో మన ప్రభుత్వం అతడిని ఉగ్రవాదిగా ప్రకటించింది. ఆ ఏడాది మూడు సాగు చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన రైతుల ఉద్యమం వెనుక అతడు ఉన్నాడని ఆరోపించి కేసులు కూడా దాఖలు చేసింది. పంజాబ్‌లోని ఒక హిందూ పూజారిని హత్య చేసేందుకు కుట్ర పన్ని లక్ష రూపాయల బహుమతి ప్రకటించాడని 2022లో ఎన్ఐఏ పేర్కొన్నది.

కెనడా రాజకీయాల్లో సిక్కులు ఒక ప్రభావిత శక్తిగా ఉన్నారు. పంజాబ్ తరువాత ప్రపంచంలో సిక్కు సామాజిక తరగతి ఎక్కువగా ఉన్నది కెనడాలోనే, అక్కడ జనాభాలో 2.1శాతం ఉన్నారు. ముప్పై మందితో కూడిన జస్టిన్ ట్రుడేవ్ మంత్రివర్గంలో నలుగురు సిక్కులు మంత్రులుగా ఉన్నారు. ఈ కారణంగా నిజ్జర్ మరణానికి బాధ్యులను తేల్చాలన్న డిమాండ్ సహజంగానే అక్కడ ముందుకు వచ్చింది. అందువలన మరొకదారి లేని పరిస్థితిలో అంతర్జాతీయ కర్తవ్యం సంగతి తరువాత ముందు తన ప్రభుత్వం గురించి చూసుకోవాలని హత్య గురించి ట్రుడేవ్ పార్లమెంటులో మాట్లాడాల్సి వచ్చింది. జూన్ మొదటి వారంలో మన విదేశాంగ మంత్రి జై శంకర్ విలేకర్లతో మాట్లాడుతూ ఖలిస్తాన్ వేర్పాటువాదులకు కెనడా మద్దతు ఇవ్వటం రెండు దేశాల సంబంధాలకు మంచిది కాదని విమర్శించారు. ఆ తరువాత నిజ్జర్ హత్య జరిగింది. ఢిల్లీలో జరిగిన జి-20 కూటమి సమావేశాలకు జస్టిన్ ట్రుడేవ్ వచ్చినప్పటికీ ఇతర దేశాధినేతలతో మాదిరి ప్రధాని నరేంద్రమోడీ ప్రత్యేక చర్చలు జరపలేదు. అంతే కాదు కెనడాలో ఉగ్రవాదులు భారత వ్యతిరేక కార్యకలాపాలను కొనసాగిస్తున్నారని ఇటీవలి కాలంలో జరిగిన ఉదంతాల గురించి మోడీ కెనడా దృష్టికి తేగా, ప్రతిగా కెనడా కూడా మనదేశం మీద ఆరోపణలు చేసిందని వెల్లడైంది. తిరుగు ప్రయాణంలో ట్రుడేవ్ విమానంలో సాంకేతిక లోపం ఏర్పడగా ప్రత్యామ్నాయంగా విమానం ఏర్పాటు చేస్తామని మన దేశం ప్రతిపాదించినా రెండు రోజులు వేచి ఉండి తన విమానంలోనే వెళ్లిన సంగతి తెలిసిందే. రెండు దేశాల మధ్య సంబంధాలు సజావుగా లేవని ఈ ఉదంతం వెల్లడించింది. ఆ తరువాతే పార్లమెంటులో మన దేశం మీద ఆరోపణ చేశాడు. ఈ అంశాన్ని తాము భారత్‌కు ఎంతో ముందుగానే తెలిపామని ట్రుడేవ్ చెబుతుండగా ఎలాంటి సమాచారం లేదని మన అధికారులు అంటున్నారు.

ఈ వివాదంలో పశ్చిమ దేశాల వైఖరిని చూస్తే మన దేశాన్ని ఖండించలేదుగానీ విచారణ జరగాలి అని మాట్లాడుతున్నాయి. మీడియాలో వచ్చిన వార్తలను బట్టి కెనడా ప్రధాని బహిరంగంగా మన దేశం మీద ఆరోపణ చేయటానికి ముందే "ఐదు కళ్ల గూఢచార యంత్రాంగం"లో భాగస్వాములుగా ఉన్న అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ అధికారులకు కెనడా నిజ్జర్ హత్యలో మన దేశ ప్రమేయం గురించి వెల్లడించటమే గాక ఒక సంయుక్త

కెనడా - భారత్ మధ్య వివాదం ముదిరితే చైనాకు వ్యతిరేకంగా భారత్‌ను నిలపాలన్న తమ ఎత్తుగడ ఎక్కడ విఫలమవుతుందో అన్న భయమే ఎక్కువ కనిపిస్తోంది. పశ్చిమ దేశాల నుంచి వెలువడుతున్న అన్ని వ్యాఖ్యానాల్లో బహిరంగంగానే దీని గురించి ప్రస్తావిస్తున్నారు. పశ్చిమ దేశాల ఇండో-పసిఫిక్ ఎత్తుగడలో కెనడా కూడా ఒక ప్రధాన భాగస్వామే. మన దేశంలో నిరంకుశ పోకడలు, మానవహక్కులకు భంగం కలుగుతున్నదంటూ అమెరికాలోని అనేక సంస్థలు ఒకవైపు నిరంతరం ప్రచారం చేస్తూ ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచుతున్నాయి. ఇటీవల ప్రధాని నరేంద్రమోడీ అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు 75మంది ఎంపీలు మోడీ ప్రసంగాన్ని బహిష్కరించారు.




ప్రకటనలో ఖండించాలని ప్రతిపాదించగా మిగిలిన దేశాలు నష్టదాయకమంటూ తిరస్కరించినట్లు వెల్లడైంది. తమకు ముందుగానే చెప్పినట్లు కెనడాలోని అమెరికా రాయబారి డేవిడ్ కోహెన్ నిర్ధారించాడు. విదేశాల్లో హత్యలను సహించరాదని, తాము కెనడాను కేవలం సంప్రదించటం లేదని దర్యాప్తులో భాగస్వాములవుతున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ చెప్పాడు. భారత్‌కూడా దర్యాప్తులో భాగస్వామి కావాలని అమెరికా కోరింది. ఆరోపణలు ఆందోళనకరమైనవని, తాను భారతదేశం వద్ద ఈ అంశాన్ని లేవనెత్తినట్లు ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రిణి పెనీ వాంగ్ చెప్పింది. ఆరోపణలు తీవ్రమైనవని బ్రిటన్ విదేశాంగ మంత్రి జేమ్స్ క్లవర్లీ, వస్తున్న వార్తలు నిజమే అయితే తీవ్ర ఆందోళన కలిగించే అంశమని తమ భాగస్వాములతో సన్నిహితంగా పర్యవేక్షిస్తున్నట్లు న్యూజిలాండ్ విదేశాంగ మంత్రి నానియా మహుతా అన్న వ్యాఖ్యలు కెనడాకు అనుకూలంగా చేసినట్లు స్పష్టమౌతున్నాయి.

పంజాబ్, కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలలో వేర్పాటు, తీవ్రవాద దుశ్చర్యలకు పాల్పడిన అనేక మందికి అమెరికా, కెనడా, ఐరోపా ధనిక దేశాలు ఆశ్రయం ఇచ్చిన సంగతి తెలిసిందే. పక్కనే ఉన్న శ్రీలంకలో ఉగ్రవాదులు సైతం పశ్చిమ దేశాల్లోనే స్థావరాలు ఏర్పాటు చేసుకున్నారు. పాకిస్థాన్ ఉగ్రవాదుల అడ్డా, శిక్షణా కేంద్రం అన్నది వేరే చెప్పనవసరం లేదు. ఇదంతా అమెరికా, ఇతర ఐరోపా దేశాల కుట్రలో భాగంగానే జరిగింది. కెనడా ప్రధాని ఏమి చెప్పినప్పటికీ ఖలిస్తాన్ తీవ్రవాదుల అడ్డాగా ఆ దేశం మారింది. ప్రపంచంలో ఇతర దేశాల మీద దాడులు చేసేందుకు ఉగ్రవాదుల ఏరివేత అని సాకులు చెప్పే పశ్చిమ దేశాలు తమ సంరక్షణలో ఉన్నవారి గురించి పల్లెత్తు మాట మాట్లాడవు. ఇప్పుడు పశ్చిమ దేశాల ఆందోళన అంతా కెనడాలో ఆశ్రయం పొంది మన దేశానికి వ్యతిరేకంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న తీవ్రవాదుల ఏరివేత, అదుపు గురించి కాదు. కెనడా - భారత్ మధ్య వివాదం ముదిరితే చైనాకు వ్యతిరేకంగా భారత్‌ను నిలపాలన్న తమ ఎత్తుగడ ఎక్కడ విఫలమవుతుందో అన్న భయమే ఎక్కువ కనిపిస్తోంది. పశ్చిమ దేశాల నుంచి వెలువడుతున్న అన్ని వ్యాఖ్యానాల్లో బహిరంగంగానే దీని గురించి ప్రస్తావిస్తున్నారు. పశ్చిమ దేశాల ఇండో-పసిఫిక్ ఎత్తుగడలో కెనడా కూడా ఒక ప్రధాన భాగస్వామే. మన దేశంలో నిరంకుశ పోకడలు, మానవహక్కులకు భంగం కలుగుతున్నదంటూ అమెరికాలోని అనేక సంస్థలు ఒకవైపు నిరంతరం ప్రచారం చేస్తూ ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచుతున్నాయి. ఇటీవల ప్రధాని నరేంద్రమోడీ అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు 75మంది ఎంపీలు మోడీ ప్రసంగాన్ని బహిష్కరించారు. అధ్యక్షుడు జో బైడెన్ వారి ప్రచారాన్ని అనుమతించి చోద్యం చూశాడు. మౌనంగా ఉన్నాడు. చైనాకు వ్యతిరేకంగా మన దేశాన్ని నిలబెట్టాలన్న ఎత్తుగడలో భాగమే అది. అదే ఎంపీలు చైనా గురించి చేసిన ఆరోపణల మీద అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు ఎలా స్పందిస్తున్నదీ చూస్తున్నాం.


పశ్చిమ దేశాలు కట్టగట్టుకొని మౌనం పాటిస్తున్నాయని, ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నట్లు భారత్-కెనడా వివాదం గురించి చైనా మీడియా స్పందించింది. తమ వ్యూహాత్మక భాగస్వామిగా భారత్‌ను తీసుకుపోవాలని చూస్తున్నాయి గనుక కెనడా మిత్ర దేశాలు మౌనంగా ఉన్నాయి తప్ప తమ మిత్రులు కాకుంటే వెంటనే ఖండనలకు దిగేవని గ్లోబల్ టైమ్స్ పేర్కొన్నది. తమ ప్రయోజనాలు లేకపోతే పశ్చిమ దేశాలు నీతి సూత్రాలు, నిబంధనలు వల్లించి ఉండేవని, భారత మానవహక్కుల సమస్యల గురించి కళ్లు మూసుకున్నట్లు పేర్కొన్నది. అమెరికా జాతీయ భద్రతా మండలి ప్రతినిధి జాన్ కిర్బీ మాట్లాడుతూ తమకు భారత్ ఎంతో కీలకమైన దేశంగానే ఉంటుందని, అది ఒక్క దక్షిణాసియా ప్రాంతానికే కాదు, ఇండో-పసిఫిక్ ప్రాంతానికి కూడా అని చెప్పాడు. అమెరికాకు ఇది కలవరం కలిగించేదే, దానికి విశాల ప్రయోజనాలు ఉన్నాయి. ట్రుడేవ్ ఆరోపణలు గనుక నిజమే అయితే నరేంద్రమోడీ సర్కార్ ప్రజాస్వామ్యానికి కట్టుబడి లేదన్నది అర్థం, ఇదే విధానాన్ని పుతిన్ కూడా అనుసరించాడు అని కెనడాలోని టోరొంటో విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ రాబర్ట్ బోత్‌వెల్ అన్నాడు. తన శత్రువులను రష్యాలోపల, వెలుపల బ్రిటన్‌తో సహా ఇతర దేశాల్లో పుతిన్ చంపించాడని అన్నాడు. కరవ మంటే కప్పకు కోపం- విడవ మంటే పాముకు ఆగ్రహం అన్నట్లుగా ప్రస్తుతం పశ్చిమ దేశాల పరిస్థితి ఉంది. చివరకు ఈ వివాదాన్ని ఎలా ముగిస్తారో చూడాల్సి ఉంది. ◆

కవిత్వం - జీవితం ఒక్కటిగా



కవన తత్వం - జీవన తత్వం రెండూ వేర్వేరుగా ఉండరాదని విస్పష్టంగా ప్రకటించినవాడు జాషువా. కనుకనే నవయుగ కవితా చక్రవర్తిగా శోభిల్లాడు.

'నివశించుటకు చిన్న నిలయ మొకటి దక్క / గడన సేయుట కనబడను నేను / ఆలుబిడ్డలకు నై ఆస్తిపాస్తులుకూర్ప / పెడత్రోవలో పాదమిడను నేను / నేనాచరించని నీతులు బోధించి / రాని రాగము తీయలేను నేను / సంసార యాత్రకు చాలినంతకు మించి / గ్రుడ్డి గవ్వను కోరుకొనను నేను.'



కె. శాంతారావు
9959745723

ప్రజల కోసం ఏ రంగంలోనైనా పనిచేసే (రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, సేవా) స్వచ్ఛంద కార్యకర్తలకు పై పంక్తులు ఎప్పటికైనా శిరోధార్యమే. వర్తమాన పెట్టుబడిదారీ వినిమయ సంస్కృతి విలాసాలకు ఆడంబరాలకు కొట్టుకుపోయే వారిని ఈ మాటలు కొంతలో కొంత స్పీడ్ బ్రేకర్స్‌లా నిలుపుదల చేస్తాయనడంలో ఎలాంటి సందేహం ఉండదు. అదే సందర్భంలో ఏ నిబద్ధతకూ కట్టుబడక అడ్డదిడ్డంగా రాస్తూ ఏ ఎండకు ఆ గొడుగు పట్టేవారికి చెంపపెట్టుకూడా.

నేను రాస్తున్నదేంటి? చెపుతున్నదేంటి? చేస్తున్నదేంటి? ఏమైనా సంబంధం ఉన్నదా? నా నిజాయితీ ఎంత? అని ఆత్మపరిశీలన చేసుకోవడానికి జాషువా మనముందు నిలువుటద్దంలా నిలుస్తాడు. అక్కడితో ఆగడు. 'కుల మతాలు గీసుకున్న గీతల చొచ్చి / పంజరాన కట్టుబడను నేను / నిఖిల లోక మెట్లు నిర్ణయించిన నాకు / తరుగులేదు విశ్వనరుడు నేను' అని గొంతెత్తి నినదిస్తాడు. ఒక పాదం భూమిపై ఉంచి, మరోపాదాన్ని విశ్వంలోకి జొప్పించే అపర వామనుడులా ఆవిష్కృతమవుతాడు. ఇక భౌతిక ప్రపంచాన కవిగా ఆక్రమించడానికి ఏం ఉంటుంది? దృఢ విశ్వాసము, దృఢ నిశ్చయము ఏర్పడ్డాక భయం ఉండదిక. తరుగే కాదు తిరుగులేదు ఆ కవికి అంటాడు ఆరుద్ర. పైకి ఒక వాస్తవ ప్రపంచం అందరికీ కనిపిస్తూనే ఉంటుంది. కాని కవి తన ఎక్స్‌రే కళ్ళతో అంతర్గత సత్యాన్ని శోధించి విశదపరచాలి.

'వాని రెక్కల కష్టంబులేని వాడు / సస్యరమ పండి పులకింప సంశయించు /వాడు చెమటలోడ్చి ప్రపంచమునకు భోజనము బెట్టు, వానికి భుక్తిలేదు' - రైతు కష్టం లేనినాడు మానవాళి జరుగుబాటు ఉండదు సరికదా పుడమి మనుగడే కష్టసాధ్యమని ఈ చిట్టిపద్యంలో తేల్చిపారేస్తాడు.'ధర్మమున పిరికి తనము ఎప్పుడును లేదు / సత్య వాక్యమునకు చావులేదు / వెరవనేల నీకు విశ్వనాధుని మ్రోల / సృష్టికర్తతాను సృష్టినీవు' - కర్మ సిద్ధాంతం పేర నోరుకట్టేసి స్వార్థపరులు తన భుక్తిని అనుభవిస్తున్నారు. అసలు కర్మ అంటే ఏమిటి? సాటి మనిషిపై ఈ కక్ష ఎందుకు? ఆ ఈశ్వరుని చేతే రుజువు చేయించమని 'గబ్బిలానికి' విన్నవిస్తాడు.

'జీవితం నాకు ఎన్నో పాఠాలు నేర్పింది. నాకు గురువులు ఇద్దరు. ఒకటి పేదరికం. రెండు కులవివక్ష. ఒకటి నాకు సహనం నేర్పితే, రెండవది నాలో ఎదురించే శక్తిని నింపింది. కానీ నన్ను బానిసగా మాత్రం ఏదీ మార్చలేదు. అటు దారిద్ర్యాన్ని, ఇటు కులవివక్షను చీల్చి చెండాడి నన్ను నేను మనిషిగా నిరూపించుకోదలిచాను. వాటిపై కత్తికట్టాను. నాది కత్తి కవిత. కానీ నా కత్తికి సంఘంపై ద్వేషం లేదు. దాని (వ్యవస్థ) విధానంపైనే 'ద్వేషం' అంటూ కసితో ఆజన్మాంతం రగిలిపోయాడు. దుర్మార్గాలను దునుమాడాడు. అక్రమాలపై స్వైరవిహారంతో చెలరేగిపోయాడు.

'కవిత్వం బ్రాహ్మణుల సొమ్మే' అని అప్పకవి వంటివారి కరుడుగట్టిన అగ్రవర్ణ దుర్హంకారాన్ని తొలినాళ్ళల్లోనే కవిత్వంతోనే ధిక్కరించాడు. 'ఆకులందు అణగిమణగి కవిత కోయిల పలుక వలెనోయ్' అన్న మహాకవి గురజాడ వాక్కులను నిజం చేసాడు. కవికోకిలగా చరిత్ర దురగతాన్ని ప్రసిద్ధికెక్కాడు.

జాషువా కావ్యరచన ఏదైనా సరే తన సొంత గొంతుక ఒకటి చుక్కల్లో చంద్రునిలా తారాడుతూనే ఉంటుందని లాక్షణికుల పరిశీలన. నిలువెల్లా కవి గనుకనే తెలుగు పద్యానికి పునఃప్రాణ ప్రతిష్ఠ చేసాడు. పద్యానికి సానపెట్టి సామాజిక మార్పుకు సాధనం చేసాడు. ధనమూ ధాన్యమూ ఒకని పెత్తనం క్రింద ఉండనే ఉండరాదని శాసించాడు. ప్రజలందరికీ చెందాలని ఆశించాడు. పీడిత శ్రామిక జనోద్ధరణ కోసం కలం కంకణం కట్టుకున్నాడు. మానవ కల్యాణం మించిన పని మహిలో లేదన్నాడు. అనంత ఆర్ద్రత, అపార భావుకత కల పారదర్శక కవి కాగలడం తెలుగువారి అదృష్టంగా భావించాలని తెలిపారు.

వర్ణించే వస్తువుతో కవిగా జాషువా మమేకమయ్యే తీరు అనూహ్యం.

'నా కవితా వధూటి వదనంబు నెగాదిగా జూచి
చూపు రేఖా కమనీయ వైఖరులు గాంచి, భళీ భళీ
యన్నవాడే, మీ దే కులమున్న ప్రశ్న వెలయించి
చివాలున లేచిపోవుచో బాకున గ్రమ్మినట్లుగున్
ప్రార్థివ చంద్ర వచింప సిగ్గుగన్'

కరుణరస అంతర్వాహికగా వీర రసాన్ని ప్రవహింప చేసి వివక్ష కుళ్ళు ను కడిగిపారేస్తాడు.

ఆధునికత్వం అడుగడుగునా తన్నుకుంటూ వస్తుంది జాషువా కవిత్వంలో. పాత రూపాలకు కొత్త సొబగులు, కొత్త సొబగులకు కొంగ్రొత్త వెలుగుల అభివ్యక్తీకరణలు. నిబిడాశ్చర్యంగావడం పాఠక శ్రోతల వంతు.

'రాజు మరణించు ఓ తార నేలరాలు / కవియు మరణించు ఓ తార గగన మెగసె / రాజు జీవించు రాతి విగ్రహములందు / సుకవి జీవించు ప్రజల నాల్కలందు'

1895 సెప్టెంబరు 28న వినుకొండ (ఏపీ)లో జన్మించిన గుర్రం జాషువా 1971 జూలై 24న అస్తమించాడు. కులవివక్ష కారణాన చిరుప్రాయంలోనే పాఠశాల వేదికలెక్కి పద్యాలు చదవలేకపోయాడు.. నాటకాలు చూడలేకపోయాడు. ఒంటరిగా కుమిలిపోయాడు. గౌరవం కులానికా? కలానికా? అని ప్రశ్నించాడు. 'నిమ్నజాతుల కన్నీటి నీరదములు పిడుగులై దేశమును కాల్చివేయునని' హెచ్చరించాడు.

తన కాలంలో వీచిన సాంఘిక దురాచార తుఫాను గాలులను మొక్కవోని దీక్షతో 'ఢీ'కొన్న ధీశాలి జాషువా.

పిరికివారు సాకులు వెతుకుతారు. ధీమంతులు దారులు వెతుకుతారు. జీవితం పట్ల స్పష్టమైన అవగాహన కలిగిన జాషువా ఆశయాలకు - ఆచరణకు మధ్య నిత్య ఘర్షణకు లోనైనా అంతిమంగా విజయ బావుటానే ఎగురవేసాడు. కవిత్వమే జీవితంగాను జీవితమే కవిత్వంగాను మలచుకోవడం వలనే జాషువా కృషి అనితరసాధ్యం.

(రేపు గుర్రం జాషువా 128వ జయంతి)

తెలంగాణలో సమ్మె కాలం!



గీట్ల ముకుందరెడ్డి
9490098857

2014 ఎన్నికల ముందు సంవత్సరం పాటు ఒకవైపు కార్మికులు, ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు, పోరాటాలు చేశారు. కలెక్టరేట్లు ధర్నాలు, సమ్మె శిబిరాలతో నిండిపోయి ఉండేది. మరోవైపు ప్రత్యేక తెలంగాణ కోసం పోరాటాలు జరిగేవి. 2014 జూన్ 2న తెలంగాణ ఆవిర్భవించింది. కానీ కార్మికుల, ఉద్యోగుల వివిధ సెక్షన్ల ప్రజలెదుర్కొంటున్న అనేక సమస్యలు పరిష్కారం కాలేదు. తెలంగాణ ఏర్పడితే ధర్నాలే ఉండవని చెప్పిన కేసీఆర్ పాలనలోనే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లు ధర్నాలతో దద్దరిల్లు తున్నాయి. అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ 60 వేల మంది తమ డిమాండ్ల పరిష్కారం కోసం సెప్టెంబర్ 11 నుండి జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె బాట పట్టారు. చర్చల ద్వారా అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించ పోగా సమ్మెను నిర్బంధంతో అణిచి వేయాలని చూస్తోంది. ఆదిలాబాద్ అంగన్వాడీ లపై, సీఐటీయూ నాయకులపై అక్రమ కేసులు పెట్టింది. సమ్మెపట్ల అసత్య ప్రచారాలు చేస్తున్నది. అంగన్వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పెన్షన్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.10 లక్షలు, హెల్పర్లకు రూ.5 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. వేతనంలో సగం పెన్షన్ నిర్ణయించా లని అడుగుతున్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలోని అంగన్వాడీ ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లించాలి. ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, ఆరోగ్య లక్ష్మి మెనూ ఛార్జీలు పిల్లలకు రూ.1.15పై.ల నుండి రూ. 5కు, గర్భిణీ/ బాలింతలకు రూ.2.40 పై.ల నుండి రూ.10కి పెంచాలని కోరుతున్నారు. మంత్రి సత్యవతి రాథోడ్ ఆగస్టు 18న హైదరాబాద్‌లో అన్ని సంఘాలతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేశారు. కొన్నింటిపై హామీలు ఇచ్చారు. గతం కంటే వేతనాలు పెంచుతామని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ. లక్ష ఇస్తామని, అంగన్వాడి ఉద్యోగులకు సంక్షేమ పథకాలు వర్తించే విధంగా సర్క్యులర్ జారీ చేస్తామని చేస్మొ చెప్పారు. పది రోజుల్లో వేతనాలు పెంపు ప్రకటన కూడా వస్తుందని ఆమె హామీనిచ్చారు. కానీ, ఇచ్చిన హామీలకు భిన్నంగా వేతనాల పెంపు లేకపోగా అతి తక్కువ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రకటించడంతో అంగన్వాడీల్లో ఆగ్రహ జ్వాలలు వ్యక్తమ య్యాయి. సమ్మె కారణంగా మూతపడిన అంగన్వాడీ కేంద్రాల తాళాలను ఐసిడిఎస్ అధికారులు కొన్నిచోట్ల పగలగొట్టారు. సమ్మె విచ్ఛిన్నానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది.

ఆశా వర్కర్లకు పారితోషికాలను రూ.18వేలకు పెంచి ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని, ఇతర సమస్యలు పరిష్కరిం చాలని కోరుతూ సెప్టెంబర్ 25 నుండి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె ప్రారంభించారు. సమ్మెకు ముందు "చలో హెల్త్ డైరెక్ట్" హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలను ముట్టడించారు. 27 వేల మంది ఆశా వర్కర్లు గత 18 సంవత్సరాల నుండి గ్రామీణ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్నారు. అనేక ట్రైనింగ్లు పొందారు. గర్భిణీలకు, బాలింతలకు, చిన్నపిల్లలకు, ఇతర ప్రజలకు సేవలంది స్తున్నారు. బిపి, షుగర్, థైరాయిడ్ తదితర అన్నిరకాల జబ్బులను గుర్తిస్తున్నారు. ప్రభుత్వం సప్లై చేస్తున్న మందులను ప్రజలకు అందజేస్తున్నారు. తగిన జాగ్రత్తలు ఎప్పటి కప్పుడు ప్రజలకు వివరిస్తున్నారు. వీటితో పాటు రిజిస్టర్స్ రాయడం, సర్వేలు చేయడం, ఆన్లైన్ రికార్డులు నమోదు చేయడం వంటి పనులు చేస్తున్నారు. కరోనా మహమ్మారి కాలంలో ఆశా కార్యకర్తలు కీలకపాత్ర పోషించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) హెల్త్ గ్లోబల్ లీడర్స్ అని ఆశా వర్కర్లకు అవార్డును కూడా ప్రకటించింది. అన్ని



పనులు నిర్వహిస్తూ పేద ప్రజలకు సేవలందిస్తున్న ఆశాలకు నేటికీ ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయం చేయకపోవడం వలన ఆశా వర్కర్లు అన్యాయానికి గురవుతున్నారు.

తెలంగాణ రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖలో గ్రామీణ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లు, బస్తీ దవాఖానాల్లో పనిచేస్తున్న ఎఎన్ఎమ్‌లు ఐదు వేల మంది ఆగస్టు15 నుండి సెప్టెంబర్ 3 వరకు సమ్మె చేశారు. వీరి డిమాండ్ల పరిష్కారానికి ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ వేయడంతో సమ్మె విరమించారు. కమిటీ రిపోర్టు కాలయాపన చేస్తున్న నేపథ్యంలో మరోసారి పోరాటానికి సిద్ధమవుతున్నారు. డీఎస్సి ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్, మెరిట్ ప్రకారం ఎంపికై పని చేస్తున్న వీరందరినీ రెగ్యులరైజ్ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఎంపిహెచ్ఎఫ్) 1,520 పోస్టులు భర్తీ కోసం నోటిఫికేషన్ 2/2023ను జారీ చేసింది. సంవత్సరాల తరబడి సర్వీస్ అనుభవం ఉన్నప్పటికీ మళ్ళీ పరీక్ష రాయమనడం న్యాయం కాదు. వైద్య ఆరోగ్య శాఖలోని కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసుల క్రమబద్ధీకరణకు సంబంధించి విధి విధానాల విషయంలో ద్వంద్వ ప్రమా ణాలు అనుసరించడం శోచనీయం. కాంట్రాక్ట్ మెడికల్ ఆఫీసర్లను మెరిట్ ఆధారంగా సర్వీసుకు వెయిటేజి ఇచ్చి రెగ్యులర్ చేశారు. జీఓ నెం. 49 ప్రకారం 68 మంది కాంట్రాక్ట్ ఎంపిహెచ్ఎ (ఫిమేల్) లను యదావిధిగా రెగ్యులర్ చేశారు.

రాష్ట్రంలోని సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు 21 వేల మంది ఉద్యోగభద్రత, మినిమం టైం స్కేల్ ఇతర సమస్యల పరిష్కారం కోసం 21 రోజులపాటు సమ్మె చేశారు.జిల్లా కలెక్టరేట్ల ఎదుట రిలే దీక్షలు చేశారు. విద్యాశాఖ మంత్రి హామీ మేరకు సమ్మెను తాత్కాలికంగా విరమించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్ పే తదితర పద్ధతుల్లో పనిచేస్తున్న సిబ్బందినందరినీ పర్మినెంట్ చేయాలని, మున్సిపాల్టీల్లో రూ.21 వేలు, జిహెచ్ఎం.సి పరిధిలో రూ.24వేల వేతనం ఇవ్వాలని రాష్ట్ర వ్యాప్త ఆందోళన, పోరాటాలు చేస్తున్నారు. ఎమ్మెల్యేలకు, మంత్రులకు సామూ హికంగా వినతి పత్రాలు ఇచ్చారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో నిరవధిక సమ్మెకు సిద్ధమౌతున్నారు. ఇప్పటికే గ్రామపంచాయతీ కార్మికులు 54 రోజుల పాటు సమ్మె చేశారు. మరోసారి పోరాటానికి సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 2500 మంది స్కూల్ స్వీపర్లు నెలకు రూ.5200లకు పని చేస్తున్నారు. రెగ్యులరైజ్ చేయాలని లేదా కనీసవేతనం రూ.18 వేలు ఇవ్వాలని వీరు గత 76 రోజులుగా కలెక్టరేట్ల వద్ద రిలే నిరాహారదీక్షలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదు.

ఈ తొమ్మిదేండ్ల కాలంలో కేవలం 26 వేల మందిని మాత్రమే రెగ్యులరైజ్ చేశారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం, విఆర్ఏలను రెగ్యులరైజ్ చేయడం, ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఉద్యమాలు ఊపందుకున్నాయి. ఎన్నికలుంటే గాని ప్రజలు, పథకాలు కార్మికులు, ఉద్యోగులు గుర్తురాని ముఖ్యమంత్రి ఇప్పటికైనా తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఉద్యోగ, కార్మికులు కోరుతున్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేస్తామని ఉద్యమ సమయంలో మాట్లాడిన కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి, తానే ముఖ్యమంత్రి అయి 9 సంవత్సరాలు పూర్తి అయినా మాట నిలబెట్టుకో లేదు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ యూనియన్లు, అసోసియేషన్ల లెక్కల ప్రకారం రాష్ట్రంలో సుమారు 90 వేల మంది ఔట్‌సోర్సింగ్, 40 వేల మంది కాంట్రాక్ట్ మొత్తం లక్షా 30 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ తొమ్మిదేండ్ల కాలంలో కేవలం 26 వేల మందిని మాత్రమే రెగ్యులరైజ్ చేశారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం, విఆర్ఏలను రెగ్యులరైజ్ చేయడం, ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఉద్యమాలు ఊపందుకున్నాయి. ఎన్నికలుంటే గాని ప్రజలు, పథకాలు కార్మికులు, ఉద్యోగులు గుర్తురాని ముఖ్యమంత్రి ఇప్పటికైనా తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఉద్యోగ, కార్మికులు కోరుతున్నారు. •

పోలీస్ కమిషనరేట్‌లో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

నవతెలంగాణ - కరీంనగర్ క్రైం :
కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని మంగళవారం పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బరాయుడు చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీ సుబ్బరాయుడు మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప యోధురాలన్నారు. సామాజిక ఆధునిక పరిణామం కోసం నాంది పలికిన ధైర్యశాలి అని కొనియాడారు. 2022వ సంవత్సరం నుంచి తెలంగాణ ప్రభుత్వం చాకలి ఐలమ్మ జయంతిని అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు సి.రాజు(పరిపాలన), ఎ.లక్ష్మీనారాయణ (శాంతిభద్రతలు), ఏఓ మునిరామయ్య, ఏసీపీ ఏఆర్, సి.ప్రతాప్, సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్ ఇన్‌స్పెక్టర్, ఐటీ సెల్ ఇన్‌చార్జి జె.సరిలాల్, ఆర్ఐలు సురేష్, రజినీకాంత్, కుమార స్వామి, శేఖర్ బాబు, శ్రీధర్ రెడ్డి, సీపీఓ కార్యాలయ సెక్షన్స్‌కి చెందిన సూపరింటెండెంట్లు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న పోలీస్ కమిషనర్ సుబ్బరాయుడు

తెలంగాణలో రోబోటిక్ మోకాలు కీలు మార్పిడి శస్త్ర చికిత్స

నవతెలంగాణ-కరీంనగర్ :
ప్రొఫెసర్ డాక్టర్ బంగారి స్వామి ఆధ్వర్యంలో తెలంగాణాలో మొట్టమొదటి సారి (హైదరాబాద్ మినహా) రోబోటిక్ మోకాలు కీలు మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారు. ఈ శస్త్ర చికిత్సను సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి భార్య ఎల్కటురి లక్ష్మి అనే పేషంట్‌కి చేశారు. ఈ సందర్భంగా రెనే హాస్పిటల్ చైర్మెన్, సీనియర్ ఆర్థోపెడిక్, జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ ప్రొఫెసర్ డాక్టర్ బంగారి స్వామి మాట్లాడుతూ..ఇంత కాలం రోబోటిక్ సర్జరీ అంటే కేవలం హైదరాబాద్ లోనే అన్న సంప్రదాయానికి ముగింపు పలికి సామాన్యునికి కూడా అధునాతన వైద్యం అందుబాటులోకి తేవాలన్న మా లక్ష్యం నెరవేరిందన్నారు. రోబోటిక్ సర్జరీ ద్వారా పేషంట్‌కి ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఈ సర్జరీ ద్వారా తక్కువ రక్తస్రావం, చిన్న గాటు, ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశం తక్కువ, తక్కువ సమయంలో పేషంట్ రికవరీ లాంటి ఎన్నో ఉపయోగాలు ఉంటాయన్నారు. ఈ శస్త్ర చికిత్సలో డాక్టర్ బంగారి స్వామి, డాక్టర్ హర్షిత్, డాక్టర్ సుధీర్ ద్వారక నాయుడు, డాక్టర్ మునీష్, డాక్టర్ దామోదర్ రెడ్డి లు పాల్గొన్నారు. కాగా అనంతరం తొలిసారి ఇలాంటి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించిన డాక్టర్ బంగారి స్వామిని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రజనీ ప్రియదర్శిని, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్రా చారి, డాక్టర్ నిఖిల్ లక్ష్మణ్, డాక్టర్ దినకర్, డాక్టర్ దీక్షిత్ బొజ్జలు అభినందించారు.


శస్త్ర చికిత్స చేస్తున్న వైద్యులు



'ధన'నాథుడు

'పొలిటికల్' ఎంట్రీతో భారీ ఖర్చుల నడుమ గణేష్ ఉత్సవాలు

- గల్లీగల్లీకీ రెండేసీ వినాయక మండపాల ఏర్పాటుకు నేతల సహకారం
- నేడు నిమజ్జన వేడుకల ఖర్చులకూ డబ్బులిచ్చి మరీ ప్రసన్నం
- కరీంనగర్ సెగ్మెంట్‌లోని మండపాల విద్యుత్‌బిల్లులు చెల్లించిన మంత్రి గంగుల
- ఉమ్మడి జిల్లాలో విగ్రహాల కొనుగోలుకే సుమారు రూ.8కోట్ల ఖర్చు...
- నవరాత్రుల నిర్వహణ, నిమజ్జన వేడుకలకు దాదాపు రూ.30కోట్ల ఖర్చుపైమాటే

ఎన్నికలు సమీపించిన తరుణంలో గణేష్ ఉత్సవాల్లో పొలిటికల్ ఎంట్రీ.. గణనాథున్ని 'ధన' నాథున్ని చేసింది. పెద్దఎత్తున యువతను ఆకర్షించేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు, నాయకులు అడిగినవారికల్లా చందాలు ఇచ్చారు. పైగా గల్లీగల్లీకి రెండేసి విగ్రహాలు పెట్టుకునేందుకు సహకారమూ అందించారు. నవరాత్రుల నిర్వహణ, అన్నదానాలు, ఇతర కార్యక్రమాల వ్యయాన్నీ భరించారు. నేడు నిర్వహించబోయే నిమజ్జవేడుకలకు అవసరమైన డబ్బులూ అందజేశారు. కరీంనగర్ మంత్రి గంగుల కమలాకర్ ఏకంగా తన సెగ్మెంట్‌లోని మండపాల కరెంటు బిల్లు రూ.4లక్షలు చెల్లించారు. మొత్తంగా ఈఏడాది పొలిటికల్ ఎంట్రీతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విగ్రహాల కొనుగోలుకు సుమారు రూ.8కోట్లు ఖర్చవగా.. నవరాత్రుల నిర్వహణ కలుపుకుని దాదాపు రూ.30కోట్లకుపైగానే ఖర్చయిందనేది ఒక అంచనా.

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి


ట్రాన్స్‌కో ఎస్ఈకి మండపాల కరెంటు బిల్లుల కింద రూ.4లక్షల చెక్కును అందజేస్తున్న మంత్రి గంగుల

రెన్నెళ్లల్లో వచ్చే ఎన్నికల్లో సత్తా చాటేందుకు అధికార పార్టీ అభ్యర్థులు, విపక్ష పార్టీ ఆశావహులు వినాయక నవరాత్రుల్లో భాగస్వాములు అయ్యారు. సర్వ విఘ్నాలను తొలగించాలని వినాయకుడిని వేడుకునే దశలో ఉత్సవాల ఖర్చుకు ఏమాత్రమూ వెనుకాడలేదు. గణేశుడి ఆశీస్సులు తమకు మెండుగా ఉండాలని నేతలు తమ అనుచరుల ద్వారా గల్లీగల్లీకీ యువతను పోగేసి రెండు, మూడేసి విగ్రహాలు పెట్టుకునేందుకు ఆర్థికసాయం అందించారు. ఉత్సవ కమిటీలకు ఆయా మండపాల నిర్వాహకులకు అడిగినప్పుడల్లా ఆర్థిక సాయం చేశారు. కరీంనగర్ నియోజకవర్గంలో అయితే మంత్రి గంగుల కమలాకర్ ఏకంగా తన సెగ్మెంట్‌లోని అన్ని మండపాలకూ కలిపి విద్యుత్ బిల్లు కింద రూ.4లక్షల చెక్కును రెండు రోజుల క్రితం ట్రాన్స్‌కో అధికారులకు అందించారు. ఇలా తమ రాజకీయ భవిష్యత్‌కు ఎలాంటి ఆటంకమూ ఎదురుకావొద్దనే తాపత్రాయం ఆయా నేతల్లో స్పష్టంగా కనిపించడం గమనార్హం.

నిమజ్జన వేడుకులకు ఏర్పాట్లు.. ఇక జాగ్రత్తలే తదుపరి...

గణపతి నవరాత్రి వేడుకలంటే పులకరించని మనసుండదు. తొమ్మిది రోజుల వేడుక తరువాత వినాయకుని నిమజ్జనం చేసే వేడుక కీలకమే. విగ్రహాలను సాగనంపే క్రమంలో రెట్టించిన ఉత్సాహంతో కొన్ని సార్లు ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్న పరిస్థితులూ లేకపోలేదు. ఈ విషయంలో స్వీయ రక్షణే తీపి జ్ఞాపకంగా, నిర్లక్ష్యం తీరని శోకంగా మారుతుంది. నేడు జరగబోయే నిమజ్జనం వేడుకల్లో ఆయా గ్రామాలు, పట్టణాల్లో స్థానికంగా ఉన్న చెరువులు, వాగులు, వంకలు, కాలువలు, నదుల్లో చీకటి పడేవరకూ ఊరేగింపు నిర్వహించి రాత్రి సమయంలో వినాయకున్ని నీళ్లలో వేస్తుంటారు. ఇక్కడే కొందరు ప్రదర్శించే అత్యుత్సాహం ప్రమాదాలకు దారి తీస్తుంది. విద్యుద్ఘాతాలు, రోడ్డు ప్రమాదాలతోనూ ముప్పు పొంచి ఉంటుంది.తద్వారా ఇది వారి కుటుంబాల్లో తీరని వేదనగా మారుతుంది.

గణేశుడు వేరీకాస్ట్‌లీ.. ప్రతివాడకూ రెండేసి మండపాలు

గతంలో ఎన్నడూ లేనవిధంగా ఈసారి వినాయక విగ్రహాల ధరలు భారీగా పెరిగాయి. గతేడాది 1.5ఫీట్ల ఎత్తున్న విగ్రహం రూ.వెయ్యి ఉండగా.. ఇప్పుడు ఏకంగా రూ.2వేలు పకలికింది. 3 ఫీట్లు ఎత్తున్న విగ్రహానికి గతేడాది రూ.3500 ఉండగా ఈ ఏడాది రూ.5వేలకు పెరిగింది. 5ఫీట్లు, ఆపై 7 ఫీట్లు ఎత్తున్న విగ్రహాలన్నీ రూ.15వేల నుంచి రూ.30వేల వరకు ధర పలికాయి. ఇక పోతే 10ఫీట్లకుపైగా ఎత్తున్న విగ్రహాలను రూ.లక్ష నుంచి రూ.3లక్షలు.. ఆపైనే వెచ్చించి కొనుగోలు చేశారు. ఈ విగ్రహాల కొనుగోలుకు స్థానిక సంస్థల నేతలు, నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, వచ్చే ఎన్నికల్లో ఇతర పార్టీల్లో టిక్కెట్ ఆశిస్తున్న ఆశావహులు ఖర్చు భరించడంతో గల్లీగల్లీకి రెండు, మూడేసి వినాయక మండపాలు వెలిశాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 15వేల విగ్రహాలు వెలవగా వాటి కొనుగోలుకే దాదాపు రూ.8కోట్ల వరకు ఖర్చయింది. పైగా మండపాల నిర్వహణ, పూజాసామాగ్రి, ఇతర ఖర్చులకూ డబ్బులు ఇచ్చారు. నేడు జరగబోయే నిమజ్జన వేడులకు వాహనాలు, ఇతర ఖర్చులనూ భరిస్తున్నారు. మొత్తంగా ఈఏడాది గణేష్ విగ్రహాల కొనుగోలు, మండపాల నిర్వహణ, నిమజ్జనవేడులకు కలిసి సుమారుగా రూ.30కోట్ల వరకూ ఖర్చయిందంటే అతిశయోక్తికాదు.

వినాయక నిమజ్జనం.. కారాదు విషాదం



- నిమజ్జనం జరిగే చెరువులు, కాలువలు, నదులు, జలాశయాల్లో విగ్రహాన్ని దించే సమయంలో వెనుక ఉన్నవారు అత్యుత్సాహం ప్రదర్శించి ఇందులోకి దిగుతారు. ఇలాంటి ఘటనల్లో ఏటా అనేక మంది మృత్యువాత పడుతున్నారు. చిన్నపిల్లలు, ఈతరాని వారు దూరంగా ఉండటం మేలు.
- చిన్న వాహనాలపై పరిమితికి మించి బరువైన విగ్రహాన్ని పెట్టడంతోపాటు కుర్రాళ్లు అధిక సంఖ్యలో వేలాడుతుంటారు. తద్వారా వాహనం ఒరగడం, లేదా ప్రమాదవశాత్తు దీనిపై ఉన్నవారు జారి కిందపడే అవకాశం ఉంది.
- వాహనాలపై డీజేల పేరిట భారీ సౌండ్ బాక్సులు పెట్టి వీటిపై యువత కూర్చుంటారు. ఈ క్రమంలో మార్గమధ్యలో కొన్ని చోట్ల వేలాడే విద్యుత్ తీగలను గమనించకుంటే కాటేస్తుంటారు.
- కొందరైతే మద్యం తాగి వేడుకల్లో నానా హంగామా చేస్తుంటారు. ఇదీ ప్రమాదమే.
- బాణసంచాకు దూరంగా ఉంటే మంచింది. సంప్రదాయ బద్ధంగా మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించడం శ్రేయస్కరం.

చాకలి ఐలమ్మ ఇన్నాళ్లకు గుర్తొచ్చారా?

బండి సంజయ్ కుమార్

నవతెలంగాణ - కరీంనగర్ :
'ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎన్నికలొస్తేనే చాకలి ఐలమ్మ, జయశంకర్ సార్, కొండా లక్ష్మణ్ బాపూజీ లాంటి తెలంగాణ ఉద్యమకారులు గుర్తుకొస్తారు. ఎన్నికలైన తరువాత వాళ్లకు కనీసం నివాళులు అర్పించడు. ఎన్నికలొస్తున్నయనే చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నారు. చాకలి ఐలమ్మ ఇన్నాళ్లకు కేసీఆర్‌కు గుర్తుకొచ్చారా?' అంటూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ అన్నారు. చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని మంగళవారం కరీంనగర్‌లోని స్థానిక ప్రతిమ చౌరస్తాలో గల ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా 'తెలంగాణ మన రజక సంఘం' నాయకులు కలిసి రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన బండి సంజయ్ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. కేసీఆర్ ఎన్నికలైపోగానే తెలంగాణ ఉద్యమకారులను పట్టించుకోరని, ప్రజలు రాజకీయ అవకాశవాదులకు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందన్నారు.


విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీ బండి సంజయ్

పొట్టి తాటి విత్తనాలను నాటిన గౌడ సంఘం నాయకులు

నవతెలంగాణ - చొప్పదండి :
మండలంలోని కొలిమి కుంట గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు తాళ్ల పెల్లిశ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ తాళ్లపల్లి సుజాత, గ్రామ గౌడసంఘం అధ్యక్షులు పంజాల బొంది గౌడ్, ఉప సర్పంచ్ తిరుపతి నాయకులు పొట్టి తాటి విత్తనాలను నాటారు. సందర్భంగా జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గీతా కార్మికుల కోసం 50వేల పొట్టి తాటి విత్తనాలను, బీహార్ రాష్ట్రం నుండి రాష్ట్ర ప్రణాళిక సంఘం అధ్యక్షులు బోయిన్పల్లి వినోద్ కుమార్ సొంత ఖర్చుతో, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో నాటుటకు తీసుకువచ్చారని తెలిపారు. ఈ పొట్టి తాటి విత్తనాలు కేవలం 10ఫీట్లు మాత్రమే పెరుగుతాయని, గీతా కార్మికులకు ఎటువంటి ప్రమాదం జరగకుండా ఉంటుందన్నారు. వినోద్ కుమార్‌కు ఈ సందర్భంగా జిల్లా గౌడ సంఘం తరపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో సెక్రటరీ ప్రవళిక, వార్డు సభ్యులు ఆకుల సురేష్, సత్తు తిరుపతి, మాజీ సర్పంచ్ నేరుమట్ల మల్లేశం, మహేందర్ గౌడ్, రామకృష్ణ గౌడ్, తిరుపతి, నరసయ్య, రాజు, మోహన్, వెంకట్ రాజం, కనుకయ్య, పరశురాములు పాల్గొన్నారు.


పొట్టి తాటి విత్తనాలను నాటుతున్న నాయకులు

సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం ఎన్నిక

నవతెలంగాణ - సైదాపూర్ : మండల కేంద్రంలో సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వీరగోని పెంటయ్య గౌడ్, గౌరవ అధ్యక్షులు కలర్ సత్తన్న రాష్ట్ర అధ్యక్షులు సింగం సత్తన్న, జిల్లా అధ్యక్షులు శంకర్ రాష్ట్ర కార్యదర్శి మ్యాడగోని బుచ్చయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేశం, డివిజన్ అధ్యక్షులు పైడిపల్లిరవీందర్ ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. మండల అధ్యక్షుడిగా పైడిమల్ల తిరుపతి గౌడ్, మండల ప్రధాన కార్యదర్శిగా ఏరుకొండ సుధీర్ కుమార్ గౌడ్, మండల ఉపాధ్యక్షులుగా దొనికిన రమేష్, సైదాపూర్ అధ్యక్షులు కొండమల్లయ్య, జిల్లా కార్యదర్శిగా బుర్రకోటి, మండల కార్యదర్శిగా బుర్ర శ్రీనివాస్, పాకాల రమేష్‌లు ఎన్నికయ్యాకు. అనంతరం నిర్వహించిన సమావేశంలో 30వ తేదీన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పాపన్న కోటలు గుట్టలను పరిరక్షించాలని కోరుతూ హుజూరాబాద్ కోర్టు నుంచి ఆర్‌డిఓ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించారు.

పారిశుధ్య కార్మికులకు హెల్త్ క్యాంపు

నవతెలంగాణ - జమ్మికుంట :
స్వచ్ఛత హీ సేవ కార్యక్రమము లో భాగంగా మంగళవారం పాత మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు హెల్త్ క్యాంపు మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు, కమీషనర్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ దేశిని స్వప్న కోటి లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ రాజేశ్వర్ రావు మాట్లాడారు. కరోనా సమయాల్లో తమ ప్రాణాలను సైతం లెక్క చెయ్యకుండా సేవలు చేసిన వారిలో పారిశుధ్య కార్మికులు ఉన్నారని, వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వాళ్ళ ఆరోగ్యాలు బాగుంటే మన జమ్మికుంట బాగుంటుందనే ఉద్దేశంతో హెల్త్ క్యాంప్స్ నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు రావి కంటి రాజు, శ్రీహరి, బొంగోని వీరన్న, మేడిపల్లి రవీందర్, దేశిని రాధా సదానందం, మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ మహేష్, సానిటరీ ఇన్స్పెక్టర్ సదానందం,ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ శ్రీకాంత్, వైద్యులు విజయ్, సి హెచ్ వో శంకర్, హెచ్ ఎస్ స్వరూప, రాధ పాల్గొన్నారు.



మున్సిపల్ కార్మికు లను పరీక్షిస్తున్న డాక్టర్

వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

నవతెలంగాణ - జమ్మికుంట :
నేడు జరగబోయే వినాయక నిమజ్జనానికి జమ్మికుంట పట్టణంలోని నాయిని చెరువు వద్ద చేస్తున్న ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు, హుజురాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నాయిని చెరువు వద్ద లైటింగ్స్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వెహికల్ పార్కింగ్ కూడా ఏర్పాటు చేశామన్నారు. వినాయక నిమజ్జనా నికి ముందుగానే బయలుదేరి రాత్రి 8గంటలలోపు పూర్తి చేయాలని వినాయక మండవ నిర్వాహకులకు సూచించారు. నాయిని చెరువు వద్ద రెండు క్రేన్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రజినిరెడ్డి, పట్టణ సీఐ బర్పాటి రమేష్, మున్సిపల్ కమిషనర్ బి శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


ఏర్పాట్లు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, ఏసీపీ

నత్తనడక గణేష్ నిమజ్జన ఏర్పాట్లు

కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

నవతెలంగాణ - కొత్తపల్లి : గణనాథుడు నిమజ్జనానికి తరలి వెళ్తున్నందున ఏర్పాట్లు ఏమేరకు చేశారో తెలుసుకునేందుకు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి చింతకుంట కెనాల్, కొత్తపల్లి చెరువు ప్రాంతాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఏర్పాట్లు నత్త నడకన నడుస్తున్నాయని ఇంతవరకు క్రేన్ లు రాలేదని విగ్రహాల సంఖ్య పెరిగినందున క్రేన్ల సంఖ్య పెంచాలన్నారు. దారి పొడుగునా మంచి నీళ్ళ స్టాళ్ల ఏర్పాటు చేయాలని కోరారు.

రైతులకు 'ఇన్‌సెక్టిసైడ్' వారి అవగాహనా సదస్సు



నవతెలంగాణ - పెగడపల్లి
జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం వెంగళాయిపేటలో ఇన్‌సెక్టిసైడ్ ఇండియా లిమిటెడ్ వారు రైతులకు వరి సాగులో మెళకువలు, మందుల వాడకంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆ కంపెనీ సేల్స్ ఆఫీసర్ ఇటికాల సంతోష్, సేల్స్ రిప్రజెంటీవ్ పాలోజు విజయ్‌కుమార్ మాట్లాడుతూ తమ కంపెనీకి చెందిన మిషన్‌ఎస్సీ, ఈజుకి రకం మందుల వినియోగంతో వరిలో మోగిపురుగు, ఆకుచుట్టుపురుగు, అగ్గితెగులు, పొడతెగులు పూర్తి పోతుందని తెలిపారు. దిగుబడులు బాగా వస్తాయని వివరించారు. సాగులో పలు మెళకువలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ, సర్పంచ్, శ్రీకష్ణ ఫర్టిలైజర్ డీలర్, కంపెనీ సేల్స్ ట్రెయినీ ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

ఐలమ్మ స్ఫూర్తితో ఫిక్స్ వేతనం సాధించుకుంటాం

సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్



సమ్మె చేస్తున్న ఆశా కార్యకర్తలు

నవతెలంగాణ-కరీంనగర్ : చిట్యాల ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తితో ఫిక్స్ వేతనం సాధించుకుంటామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ అన్నారు. ఆశా కార్యకర్తలకు ఫిక్స్ వేతనం రూ.18వేలు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మె రెండో రోజు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి చిట్యాల ఐలమ్మ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ కరీంనగర్ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ మాట్లాడుతూ.. నాడు చిట్యాల ఐలమ్మ ఒక చేత్తో ఎర్రజెండా, మరో చేత్తో గుత్పలు అందుకొని వెట్టిచాకిరీపై తిరుగుబాటు చేసిన ఉద్యమ స్ఫూర్తితో నయాదొర దిగివచ్చే వరకు ఆశా కార్యకర్తల సమ్మె కొనసాగుతుందని స్పష్టంచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆశా కార్యకర్తలు అనేక పని ఒత్తిడి తట్టుకొని నిత్యం సేవలు అందిచటం వల్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అవార్డ్స్ పొందారని, కనీస వేతనం నిర్ణయం చేయాలని ఆందోళన చేస్తుంటే నిర్లక్ష్యం వహిస్తూ అందరిని రోడ్ల మీద పడి వేశారని అన్నారు. కనీస వేతనం రూ.18వేలు వచ్చే వరకు పోరాటం ఆపేది లేదని తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీలత, జిల్లా అధ్యక్షులు శారద, నాయకులు పద్మ, శోభ, విజయ లక్ష్మి, రాజమణి, లలిత, శైలజ, శ్యామల, పద్మ శోభ, శంకరమ్మ పరిమిత, లత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన

నవతెలంగాణ - గన్నేరువరం :
మండలంలో వివిధ గ్రామాలలో నెలకొల్పిన వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే కార్యక్రమాన్ని శాంతియుతంగా ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగకుండా నిర్వహించాలని ఎస్సై చందా నరసింహారావు మండపాల నిర్వాహకులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఊర చెరువు వద్ద నిమజ్జనం జరిగే ప్రదేశాన్ని స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.


చెరువును పరిశీలిస్తున్న ఎస్ఐ, ప్రజాప్రతినిధులు

విహార యాత్ర మానసిక ప్రేరణను పెంచుతుంది

- జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.గోపి
- అంధుల, బధిరుల విద్యార్థుల విహారయాత్రకు జెండా ఊపి ప్రారంభం
- బధిరుల ఆశ్రమ పాఠశాలలో మొక్కలు నాటిన కలెక్టర్

నవతెలంగాణ - కరీంనగర్ : విహారయాత్ర ద్వారా అన్ని వర్గాల ప్రజలకు, విద్యార్థులకు మానసిక ప్రేరణ పెంచడంతోపాటు చరిత్రపై అవగాహన కలుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.గోపి అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సెప్టెంబర్ 27 ను పురస్కరించుకొని మంగళవారం ప్రభుత్వ అంధులు, బధిరుల ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులకు జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన విహార యాత్రను జెండా ఊపి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అద్భుతమైన చారిత్రక సంపద ఉందన్నారు. ప్రతి ఒక్కరు మన చరిత్ర, సంస్కృతిని తెలుసుకోవాలన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం ఘనంగా జరుపుకోవాలని, తీరిక సమయాల్లో కుటుంబ సమేతంగా పర్యాటక ప్రదేశాలను సందర్శిస్తే మానసిక ఆరోగ్యం కూడా మెరుగవుతుందని అన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ విద్యార్థులతో ఇష్టగోష్ఠిగా మాట్లాడారు. పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. వికలాంగుల పింఛన్లు అందరికీ అందుతున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి ఆర్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ..జిల్లాలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఒక్కొక్క సందేశంతో నిర్వహించుకోవడం జరుగుతుందని, ఈ సంవత్సరం టూరిజం అండ్ గ్రీన్ ఇన్వెస్ట్‌మెంట్ అనే అంశంతో ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. విహారయాత్రలో ఎలగందల కోటను సందర్శించి, హెరిటేజ్ వాక్‌ను నిర్వహించిన అనంతరం వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి దర్శనం, కరీంనగర్‌లో బోటింగ్, ఉజ్వల పార్కులను విద్యార్థులు సందర్శిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టూరిజం శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, హెరిటేజ్ డిపార్ట్‌మెంట్ ఎస్.సాగర్, జిల్లా యువజన అవార్డు గ్రహీతలు ఏ.కిరణ్ కుమార్, గజ్జెల అశోక్, అంధుల, బదిరుల ఆశ్రమ పాఠశాలల ప్రిన్సిపాల్స్ ఏ.నాగలక్ష్మి, భాస్కర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విహార యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్ ఎదుట జీపీ కార్మికుల ధర్నా

నవతెలంగాణ - కరీంనగర్ : కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికులకు 15రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి సమ్మెను విరమింప చేసిన ప్రభుత్వం, 48 రోజులు గడుస్తున్నా కార్మికుల సమస్యలు పరిష్కరించకపోవడంతో తాత్కాలికంగా వాయిదా వేసిన సమ్మెను మళ్లీ కొనసాగిస్తామని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా జేఏసీ అధ్యక్షులు కొప్పుల శంకర్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తుందన్నారు. కార్మికుల 34 రోజులు సమ్మె చేస్తే సమ్మె విరమించి డ్యూటీలోకి జైన్ కండి మీ సమస్యలు పరిష్కారం చేస్తామని నమ్మబలికి పంచాయతీ కార్మికులను మోసం చేసిందన్నారు. ఈసారి చేపట్టే సమ్మె ఎన్ని రోజులైనా సమస్యలు పరిష్కరించే వరకు కొనసాగిస్తామన్నారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలపై దృష్టి పెట్టి, వెంటనే కార్మికులందరిని పర్మిట్ చేయాలన్నారు. ప్రస్తుత ఇస్తున్న వేతనంపై 30శాతం అదనంగా పెంచి ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా రూ.10లక్షలు కల్పించాలని, 500జనాభాతో నిమిత్తం లేకుండా పని చేసే ప్రతి కార్మికుడికి కూడా రూ.15,600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు, ఎడెల్లీ సంపత్, కూర అంజిరెడ్డి, కాశిపాక శంకర్, రవీందర్ రావు, సారయ్య, వడ్లూరి లక్ష్మీనారాయణ, లత, ఆసాల సారయ్య, లక్ష్మి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎడ్ల రమేష్

పెరిగిన మెస్‌చార్జీలు వెంటనే అమలు చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్

నవతెలంగాణ - కరీంనగర్ : పెరిగిన మెస్‌చార్జీలు వెంటనే అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ అన్నారు. మంగళవారం కరీంనగర్‌లోని స్థానిక ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఎంతో గొప్పగా సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్‌చార్జీలు పెంచామని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంతవరకు దానిని అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. కరీంనగర్ జిల్లాలో ఉన్న సంక్షేమ హాస్టల్స్ దాదాపు అద్దె భవనంలో కొనసాగుతున్నాయని, సంక్షేమ మంత్రులు ఉమ్మడి కరీంనగర్‌లోనే ఉన్నప్పటికీ ఏ ఒక్క రోజు వాటిని పట్టించుకున్న పరిస్థితి లేదన్నారు. బీసీ సంక్షేమ మంత్రి గంగుల కమలాకర్ సొంత జిల్లా అయిన కరీంనగర్ నియోజకవర్గంలో 7బీసీ కళాశాల హాస్టల్స్ ఉంటే ఏ ఒక్కటి కూడా సొంత భవనాలు లేవు, సొంత భవనాలు లేక విద్యార్థులు అరకొర వసతులతో అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉత్తర తెలంగాణకే విద్యా కేంద్రంగా కరీంనగర్ జిల్లా మారుతుందని, ఎస్ఆర్ఆర్ కళాశాలలో ఈ సంవత్సరం ఎక్కువ మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారని, వారికి హాస్టల్ లేక చాలా మంది వినుతిరిగారని తెలిపారు. ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానాన్ని కబ్జా చేసి కళాభారతి కడుతున్న నాయకులకు అందులో చదువుతున్న విద్యార్థులకు సంక్షేమ హాస్టల్ ఏర్పాటు చేయాలనే సోయి ఎందుకు లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా మంత్రులు స్పందించి సంక్షేమ హాస్టళ్లను సందర్శించకపోతే రానున్న రోజుల్లో పెద్దఎత్తున ఆందోళనలు చేసి, మంత్రి ఇల్లు ముట్టడి చేస్తామని హెచ్చరించారు. వెంటనే పెరిగిన మెస్‌చార్జీలు జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్, నాయకులు ఇషాక్, రాకేష్, శ్రీరామ్, కుమార్, నరేష్, విష్ణు, సందేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్

సమానపనికి సమాన వేతనం చెల్లించాలి
సీఐటీయూ జిల్లా కన్వీనర్ సులోచన

నవతెలంగాణ-జగిత్యాలటౌన్ :తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వం నిర్లక్ష్యాన్నీ వీడి యూనియన్లతో చర్చించి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ సులోచన డిమాండ్ చేశారు. మంగళవారం అంగన్‌వాడీల సమ్మె 16వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా కన్వీనర్ సులోచన మాట్లాడుతూ.. తమ డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు 16 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు ప్రభుత్వం వెంటనే యూనియన్ నాయకులతో చర్చించాలని సమస్యను పరిష్కరించాలని,కనీస వేతనం రూ.26 వేలు ఇస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అంగన్‌వాడీ సమ్మెకు బీఎస్పీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సరిత, స్వప్న, శారద, కళావతి, గంగజమున, జ్యోతి, సౌజన్య మమత, రజిత, పద్మలతో పాటు టీచర్లు, ఆయాలు ఉన్నారు.



హైమస్ లైట్ల ఏర్పాటుకు భూమి పూజ

నవతెలంగాణ-కథలాపూర్

మండలంలోని గంభీర్పూర్ గ్రామంలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్ద 1.25 లక్షలు, పోసానిపేట్ లోని గంగమ్మ వద్ద రూ. 1.25 లక్షతో హైమాస్ లైట్ల ఏర్పాటు కోసం లోకబాపురెడ్డి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపీపీ జవ్వాజి రేవతి గణేష్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వర్ధినేని నాగేశ్వర్‌రావు, సర్పంచులు ఫోరమ్ అధ్యక్షుడు మిట్ట పెల్లి గంగారెడ్డి, గంభీర్ పూర్ సర్పంచ్ పోతు సింధూజ రాజశేఖర్, ఎంపీటీసీ మాల్యాల రమేష్, ప్యాక్స్ చైర్మన్ దాసరి గంగాధర్, ప్యాక్స్ వైస్ చైర్మన్ శీలం మోహన్‌రెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్ క్యాతం అనంతరెడ్డి, కాల్వ సత్యనారాయణ, తుర్తి దేవేందర్, నస్యురీ భాస్కర్, ముంజ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ నాగయ్య పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న లోకబాపురెడ్డి

ప్రభుత్వ కార్యాలయాల ఎదుట స్వచ్ఛత ఏది?

నవతెలంగాణ-మేడిపల్లి

మేడిపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం, మండల విద్య వనరుల కేంద్రం, ఏపీవో కార్యాలయం, వెటర్నరీ ఆస్పత్రి, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ఎదుట స్వచ్ఛత కనిపించడం లేదు. ఆయా కార్యాల యాల ఎదుట ఏపుగా పెరిగిన మొక్కలతో అపరిశుభ్రంగా మారింది. దీంతో పందులు సైరవిహారం చేస్తున్నాయి. కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు స్వచ్ఛతా హి సేవా కార్యక్ర మాలు జరుగుతుంటే అధికారులు మాత్రం తమ కార్యాలయాల ఎదుట ఏపుగా పెరిగిన మొక్కలను పట్టించు కోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.


ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

నూతన కమిటీ నియామకం

నవతెలంగాణ-కోరుట్ల

పట్టణంలో ఆర్య పాత్యా సర్వసభ్య సమావేశం వివేక వర్ధిని పాఠశాలలో నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కమిటీ అధ్యక్షుడిగా వాసం నవీన్ కుమార్, సెక్రటరీగా కొక్కుల రాజేష్, సభ్యులుగా వాసాల రాజు, మహిపాలొ ండ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైన వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

మన ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

నవతెలంగాణ-కోరుట్ల

కోరుట్ల పట్టణంలో మన ప్రెస్‌క్లబ్ ప్రెసిడెంట్ చిలువేని లక్ష్మిరాజం ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగం అన్నదానం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ సభ్యులు పంచా మృతాలతో వినాయకునికి అభిషేకం చేసి, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సురభీ నవీన్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు చంద్ర శేకర్, మన ప్రెస్‌క్లబ్ సభ్యులు ఉరుమడ్ల శ్రీనివాస్, రాము, సాయి, శ్రీకాంత్, వనత డుపుల నాగరాజు, గంగాధర్, పాతర్ల నరేష్, రఫీ, ముక్రం, హుష్సేన్, సాయిక్రిష్ణ, శేఖర్ పాల్గొన్నారు.

ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మసిస్టగా పని చేస్తున్న చిలువేరి ఉదయ్ ప్రసాద్‌ను వైద్య అధికారి ఉదయ్ సిబ్బంది శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం రోగులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ విజయ్‌కుమార్, పిహెచ్ఎన్ హేమలత, స్టాఫ్ నర్స్ రాజేం దర్, ల్యాబ్ టెక్నీషియన్ నరేష్, ఏఎన్ఎంలు లలిత శారద పాల్గొన్నారు.


ఫార్మసిస్ట్ ఉదయ్ స్వీట్ తినిపిస్తున్న వైద్య అధికారి

ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల పట్టణ బీఆర్ఎస్ నాయకులు మాజీ కౌన్సిలర్ అనుమల్ల సూర్య ప్రకాష్ గుండె పోటుతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మంగళవారం పరామర్శించారు.

గవర్నర్ తీరు విచారకరం

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఇద్దరిని గవర్నర్ కోటలో నామినేట్ చేస్తే గవర్నర్ తమిళిసై తిరస్కరించడం విచారకరమని జైకుర్రు ఎరుకల సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షుడు శ్రీరాం భిక్షపతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతి చర్యలో జోక్యం చేసుకొంటున్న గవర్నర్ సమస్యలను వివాదా స్పదంగా మారతోందని, ఇటీవలే ఆర్టీసీ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటిస్తే ఆ ఫైల్ పై సంతకం చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహ రించారని తెలిపారు. ఎరుకల జాతిని ఇప్పటికి ఏ ప్రభుత్వం గుర్తించలేదని సీఎం కేసీఆర్ గుర్తించి కుర్ర సత్యనారాయణకు అవకాశం కల్పిస్తే గవర్నర్ నిర్ణయంతో ఎరుకల జాతికి తీవ్ర అన్యాయం జరిగిందని తెలిపారు.

రక్తదానం చేసిన యువకులు

నవతెలంగాణ-మేడిపల్లి

భీమారం గ్రామానికి చెందిన మమ్మద్ అలీకి గుండె ఆపరేషన్ కోసం రక్తం అవసరం కాగా వాట్సప్ ద్వారా తెలుసుకున్న భీమారం గ్రామానికి చెందిన ఏడుగురు యువకులు కరీంనగర్ మెడికేర్ హాస్పటిల్‌కు వెళ్లి రక్త దానం చేశారు. రక్తదానం చేసిన యు వకులు గుగ్గిల రవిగౌడ్, లింగాల దీపక్, పరమేశ్వరరావు, అప్సర్ ,రఫీ, సంయుద్దీలను పలువురు అభినందించారు.



ఈ పంచాయతీ ఆపరేటర్ల సమ్మె నోటీస్ అందజేత

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

జిల్లా ప్రాజెక్టు మేనేజర్లకు, ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు పే స్కూల్, జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ అమలు చేయాలని కోరుతూ ఎంపీపీ జాజాల భీమేశ్వర్, ఎంపీడీవో కట్యం ప్రభు, మండల పంచాయతీ అధికారి కృపాకర్‌కు మంగళవారం సమ్మె నోటిస్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంచాయతీశాఖ టెక్నికల్ వ్యవస్థలో 13 ఏండ్లుగా పని చేస్తున్న తామకి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. మహిళా ఉద్యోగులం దరికీ వేతనంలో కూడిన ప్రసూతి సెలవులు కల్పించాలని, మా ఉద్యోగులందరికీ ఆరోగ్య భీమా కల్పించాలని డిమాండ్ చేశారు.


సమ్మె నోటీసు అందజేస్తున్న ఆపరేటర్

పారదర్శకంగా ఓటర్ సవరణ చేపట్టాలి

నవతెలంగాణ-జగిత్యాల

రెండో ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు చేపట్టాలని ఓటరు జాబితా పరిశీలకులు, మున్సిపల్ పరిపాలన, పట్టణ అభివృద్ధి కార్యదర్శి సి. సుదర్శన్‌రెడ్డి అన్నారు. రెండవ ప్రత్యేక ఓటరు నమోదు 2023లో భాగంగా మంగళవారం జిల్లాలో ఆయన పర్యటించారు. తొలుత సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా, అదనపు కలెక్టర్లు బి.ఎస్.లత, దివాకర్ ఆయనకు స్వాగతం పలికారు. జిల్లాలో ఓటరు నమోదు కార్యక్రమాలు, తదితర అంశాలపై చర్చించారు. అనంతరం పట్టణంలోని 163వ పోలింగ్ కేంద్రం, బుగ్గారం మండలంలోని చిన్నపూర్ గ్రామంలోని 57వ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. వెంట ఆర్డీఓ నరసింహ మూర్తి, తహసీల్దార్లు నరేష్, మజీద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్‌భాషా

రేషన్ కార్డులకు ఈ కేవైసీ

- వేలిముద్రలు వేసిన వారికే బియ్యం
- చనిపోయిన లబ్ధిదారులను గుర్తించేందుకు ప్రణాళిక
- గల్ఫ్‌కు వెళ్లిన కార్మికుల రేషన్ కోట ఆగేనా?

నవతెలంగాణ-వెల్గటూర్

రేషన్ కార్డులో పేర్లు ఉన్న లబ్ధిదారులకే బియ్యం అందించేందుకు పౌర సరఫరాల శాఖ ప్రణాళిక సిద్ధమవుతోంది. రేషన్ దుకాణాల్లో ఈ నెల నుంచి కార్డుల పరిశీలనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కార్డు లబ్ధిదారులకు ఈ కేవైసీ చేయాలని ఇప్పటికే సంబంధిత డీలర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన నాటి నుంచి కొత్తగా రేషన్‌కార్డులు మంజూరు చేయలేదు. ఈక్రమంలో అర్హులను గుర్తించి, అనర్హుల పేర్లను తొలగించడం ద్వారా కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయవచ్చని పౌరసరఫర శాఖ భావిస్తోంది.

వేలిముద్రలు అందరూ వేయాల్సిందే..!

కుటుంబ యజమానితోపాటు కార్డులో పేర్లు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ కేవైసీ చేసుకోవాల్సిందే. అందుకు రేషన్ షాపుకు వెళ్లి ఈపాస్ యంత్రాల సాయంతో కేవైసీ పునరుద్ధరణ చేసుకోవాలని అధికారులు సూచించారు. కుటుంబ సభ్యులంతా వేలిముద్ర వేయగానే రేషన్ కార్డు నెంబర్‌తో పాటు ఆధార్ సంఖ్య కనిపిస్తుంది. ఒకవేళ ఈకేవైసీ సమయంలో మిషన్‌లో రెడ్ లైట్ వస్తే వివరాలు సరిగా లేవంటూ రిజక్ట్ అవుతంది. ఆధార్ కార్డులో పేరు ఎలా ఉందో రేషన్ కార్డులో పేరు కూడా అలానే ఉండాలి. లేకుంటే రేషన్ కార్డులో ఆ వ్యక్తి పేరు తొలగిస్తారు. ఈ కేవైసీ సమయంలో లేకపోతే నమోదు కాదు. దీంతో ఆ వ్యక్తి పేరు కార్డు నుంచి తొలగిస్తారు. చనిపోయిన వ్యక్తుల పేర్లు ఇంకా రేషన్ కార్డులో ఉండడంతో వారికి ప్రతి నెల రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం ప్రవేశ పెట్టిన ఈకేవైసీతో ఆ వ్యక్తి పేర్లు తొలగిస్తారు.



ఊర్లో లేనివారు వేలిముద్రలు పడని వారి పరిస్థితి

రేషన్ షాపుల్లో వేలిముద్రలు వేసే సమయంలో ఊర్లో లేని వారి పరిస్థితి ఏమిటి అని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. చాలామంది ఉన్నత చదువుల కోసం పట్టణాలకు వెళ్లారు. జగిత్యాల జిల్లాలో చాలా మంది ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లారు. ఆ సమయంలో రాకుంటే వారి పేర్లను రేషన్ కార్డ్ జాబితా నుంచి తొలగిస్తారని ఆందోళన ప్రజల్లో వ్యక్తం అవుతుంది. అంత కాకుండా వయసు ఎక్కువ అయినవారు చిన్న పిల్లలు ఆధార్లో బయోమెట్రిక్ చేసుకుని వారు వేలిముద్రలు ఈపాస్ మిషన్‌లో పడవు వారి పేర్లు తొలగించడమేనా...బియ్యం రావేమోనని ఆందోళన పడుతున్నారు. వారికోసం ఎలా వ్యవహరిస్తారని వినియోగదారులు పేర్కొంటున్నారు. పోర్టబులిటి ద్వారా తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడి నుండైనా బియ్యం తీసుకునేవారు అక్కడే మీకు దగ్గరలోనే రేషన్ దుకాణాల్లోనే ఈ కేవైసీ చేయించుకోవచ్చు అని అధికారులు అంటున్నారు.

గల్ఫ్ కార్మికులకు బియ్యం కోత పడేనా..

జగిత్యాల జిల్లాలో ఉపాధి నిమిత్తం బతుకు దెరువు కోసం పొరుగు రాష్ట్రాలు, గల్ఫ్ వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉంది. ప్రభుత్వం ఈ కేవైసీ పెట్టడంతో వేలి ముద్ర వేయక పోవడంతో రేషన్ కార్డు నుండి పేరు తొలగిస్తారేమోనని, బియ్యం కోత విధిస్తారేమననే ఆందోళన వారి కుటుంబల్లో వ్యక్తమవుతుంది. వారి కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి వేడుకుంటున్నారు.

రేషన్‌కార్డులో ఉన్న వారు ఈకేవైసీ చేసుకోవాలి

కుటుంబంలో ఉన్నా సభ్యులు అందరూ వీలయినంత త్వరగా ఈ కేవైసీ చేయించుకోవాలి. ఆరోగ్య శ్రీ, ఫుడ్ సెక్యూరిటీకి ఎంతో ఉపయోగపడుతుంది. గల్ఫ్‌కు వెళ్లినవారు 25శాతం ఉంటే మొత్తం 75శాతం లబ్ధిదారులు ఈ కేవైసీ అయిపోయినా అనంతరం గల్ఫ్‌కి సంబంధించిన వారికి మార్గదర్శకాలు వెలువడే అవకాశం ఉంటుంది. 8లక్షలు 85యూనిట్లు ఉండగా ఇప్పటి వరకు 96వేల మంది లబ్ధిదారుల పూర్తి అయినవి. ఈ కేవైసీ ప్రక్రియ 12 తేదీన ప్రారంభించగా అంతక ముందే రేషన్ పంపిణీ చేయడంతో తక్కువ పూర్తయ్యాయి. వచ్చే నెల మొత్తం పూర్తి అయ్యే అవకాశం ఉంది.

– వెంకటేశ్వరరావు, డీఎస్‌వో జగిత్యాల

చాకలి ఐలమ్మకు ఘన నివాళి


మేడిపల్లి: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


జగిత్యాల: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


ఇబ్రహీంపట్నంలో...

నవతెలంగాణ-మేడిపల్లి

మేడిపల్లి మండల కేంద్రంతో పాటు, పోరుమల్ల, కట్లకుంట, వెంకటరావుపేట గ్రామాల్లో చాకలి ఐలమ్మ జయంతి మంగళవారం నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ హాజరై చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు ఏనుగు రమేష్‌రెడ్డి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఉరుమల లక్ష్మణ్, చేపూరి నాగరాజు, నల్ల భూమారెడ్డి, గంగాధర్, మార్గం నరసారెడ్డి, దాసరి శంకర్, శ్రీపతిదామోదర్, గడ్డం జలంధర్‌రెడ్డి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, మాదం వినోద్, చెలిమెల గంగాధర్, రజక సంఘం అధ్యక్షుడు వేములవాడ నారాయణ, గంగరాజం, భీమరాజం, శేఖర్, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

కోరుట్ల : పట్టణంలోని చాక ఐలమ్మ విగ్రహానికి కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు పూలమాల వేసి నివాళలర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జగిత్యాలటౌన్ :జగిత్యాల జిల్లా కేంద్రంలోని చింతకుంట వద్ద చాకలి ఐలమ్మ విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మున్సిపల్ చైర్మెన్ గోలీ శ్రీనివాస్, కౌన్సిలర్ బాలే లత శంకర్, పంబాల రామ్ కుమార్, పద్మావతి పవన్, శివ కేసరి బాబు, కప్పల శ్రీకాంత్, నాయకులు సమిండ్ల శ్రీనివాస్, హరి అశోక్ కుమార్, పాల్గొన్నారు.

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ చిత్ర పటానికి ఎస్పీ ఎగ్గడి భాస్కర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రభాకర్, ఏవో అమర్నాథ్, ఆర్.ఐలు జానీమియా, వేణు, సిసిఎస్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి : మెట్‌పల్లి పట్టణంలోని ఆమె విగ్రహానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కోరుట్ల నియోజకవర్గ నాయకులు సురభి నవీన్ కుమార్, తెలంగాణ జనసమితి కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కంతి మోహన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు, కలిగొట శ్రీకాంత్, బండలింగాపూర్ శ్రీకాంత్, కోరుట్ల నియోజకవర్గ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాంబారి ప్రభాకర్,బీజేపీ పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్, జగిత్యాల జిల్లా అధికార ప్రతినిధి తిరుమల వాసు, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొనికెల నవీన్, రాష్ట్ర ఎస్సీ మోర్చ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఇందిరా గాంధీచౌక్ వద్ద చాకలి ఐలమ్మ విగ్రహానికి సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షురాలు నేమూరి లత పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నేమూరి సత్య నారాయణ, నేరెళ్ల శ్రీనివాస్, రాజేందర్, శ్రీనివాస్, రమేష్, పాల్గొన్నారు

జగిత్యాల: జిల్లా కేంద్రంలో అదనపు కలెక్టర్ బి.ఎస్ లతతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... చాకలి ఐలమ్మ పేద వర్గాల ప్రజల కోసం చేశారని కొనియడారు. ఈ కార్యక్రమంలో వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి సాయి బాబా, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి జనార్ధన్, జిల్లా పౌర సంబంధాల అధికారి ఎస్. భీమ్‌కుమార్, కలెక్టరేట్ పరిపాలన అధికారి హన్మం తురావు, సీనియర్ సిటిజన్ హరిఅశోక్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

అక్రమ కేసులు తొలగించి భూమి పట్టాలను పంపిణీ చేయాలి

నవతెలంగాణ-మల్లాపూర్

మండల కేంద్రంలోని పాటు ఓబులాపూర్ సంగం శ్రీరాంపూర్ గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ భూమిలో అర్హులైన బంజారా తండా వాసులకు భూమి పట్టాలు అందజేసి, అక్రమ కేసులు ఎత్తి వేయాలని బంజారా తండా వాసులు మంగళవారం మెట్‌పల్లి ఆర్డీవో మధుకు వినతి పత్రం అంద జేశారు. శ్రీ కనక సోమేశ్వరా బంజారా తండాలో 44 గిరిజన కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, కొన్ని రోజుల క్రితం మాల్లాపూర్ శివారులో గల సర్వే నెంబర్.1040/1/1/1లో పట్టాలు ఇప్పించాలని విన్నవించారు. గతంలో వినతి పత్రం అందజేసినా సంబంధిత అధికారులు స్పందించలేదని వాపోయారు. భూమిలో సీత్లా భవాని పండుగ చేసుకోగ భూమిని ఆక్రయించారని కేసులు నమోదు చేశారని వాపోయ్యారు. ఆ భూమికి పట్టాలు ఇప్పించాలని కోరారు. ఇక్కడ జాటోత్ సంగీత, జాటోత్ చంద్ర, ఇస్లావత్ బొంది, భూక్యా లతికా, గుగ్లవత్ శిరీష తదితరులు పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న గిరిజనులు

సధార్ హోంలో బ్యాంకెట్లు, పండ్లు పంపిణీ

నవతెలంగాణ- కరీంనగర్

కరీంనగర్ పట్టణంలోని అశోక్‌నగర్‌లో గల సధార్ హోంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కరీం నగర్ గోల్డెన్ టవర్ సభ్యులు లయన్ నూనె వీర భాస్కర్ కుమారుడు చిరంజీవ శివాన్ష్ జన్మదినం సందర్భంగా రూ.6 వేల విలువ గల సోలాపూర్ బ్యాంకెట్లు, అరటి పండ్లు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గోల్డెన్ టవర్ క్లబ్ అధ్యక్షుడు లయన్ ముమ్మాడి శ్రీనివాస చారి, సెక్రటరీ రంగు రాజు, ట్రెజరర్ కర్ర వెంకటరమణారెడ్డి, పూర్వ జడ్పీసీ లైన్ మతిన్, వైస్ ప్రెసిడెంట్ రవీందర్, సధార్ మోం ఇన్‌చార్జి వసంత పాల్గొన్నారు.



ఆశావర్కర్ల డిమాండ్లను పరిష్కరించాలి

నవతెలంగాణ-మల్లాపూర్

ఆశాకార్యకర్తల డిమాండ్లను పరిష్కరించే వరకూ పోరాటం ఆగదని ఆశాలు అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేస్తున్న రిలే నిరహార దీక్ష రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పెరుగుతున్న ధరలకనుగుణంగా ఆశాలకు ఇస్తున్న పారితోషికాలను రూ.18వేలు పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాద బీమా రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లయ, శిరీష,లావణ్య,స్వప్న, రమ, వసంత, లత,శాంత, రాజేశ్వరి,ప్రేమలత, సరిత తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి :ప్రజారోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ ఆరోగ్యవంతమైన తెలంగాణను నిర్మిస్తున్న ఆశాకార్యకర్తల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని కాంగ్రెస్ మెట్‌పల్లి పట్టణ అధ్యక్షుడు మహ్మద్ ఖుతుబోద్దీన్ పాషా అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ పార్క్ ఎదుట ఆశాకార్యకర్తలు చేపట్టిన దీక్ష కార్యక్రమాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. కేసీఆర్ కల్లబొల్లి మాటలను నమ్మకుండా రానున్న ఎన్నికల్లో కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు.


సమ్మె చేస్తున్న ఆశాలు

సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామ సర్పంచ్ కుటుంబాన్ని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు మంగళవారం పరామర్శించారు. సర్పంచ్ నవ్యశ్రీ అత్తమ్మ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సున్నం సత్యం తల్లి మల్లమ్మ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

గుంటి పెరమండ్ల ఆలయానికి రూ.10 లక్షలు మంజూరు

నవతెలంగాణ-కథలాపూర్

కథలాపూర్ మండలంలోని గుంటి పెరమళ్ళ ఆలయానికి రూ.10 లక్షల మంజూరైనందుకు కథలాపూర్ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు లోకబాపురెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కథలాపూర్ గుంటి పెరుమల్ల ఆలయాభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే రమేష్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. జడ్పీటీసీ నాగం భూమయ్య, గ్రామ అభివృద్ధి కమిటీ తిరుపతిరెడ్డి, బుచ్చయ్య, గంగారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెడ శంకర్ పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-మల్లాపూర్

నేటి తరానికి చాకలి ఐలమ్మ ధైర్య సాహసాలు ఎంతో స్పూర్తి దాయకమని కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని చిట్టాపూర్ గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నూతనంగా నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్‌ను భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటా ్లడుతూ..నాటి తెలంగాణ సాయుధ పోరాట కాలంలో చిట్యాల (చాకలి) ఐలమ్మ ప్రదర్శించిన ధైర్య సాహసాలు, చైతన్యం నేటి తరానికీ ఎంతో స్పూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సంధిరెడ్డి శ్రీనివాస్, ఎంపీపీ కాటిపల్లి సరోజన అధిరెడ్డి, గ్రామ సర్పంచ్ సాయికుమార్, ఎంపీటీసీలక్ష్మి, సింగిల్ విండో చైర్మన్ నేరెళ్ల మోహన్‌రెడ్డి, నాయకులు మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట శ్రీనివాస్, నుతుల లక్ష్మినారాయణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

ఉచిత కంటి వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-మల్లాపూర్

ఈనెల 29న మల్లాపూర్ మండలం పాత దామరాజుపల్లి గ్రామంలోని రెడ్డిస్ ఫంక్షన్ హాల్‌లో మల్లాపూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి దావఖనా సహకారంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కనుక సంజీవ్ అన్నారు. మంగళవారం పాత దామరాజుపల్లి గ్రామంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మైదాస్ శ్రీనివాస్, రీజియన్ కార్యదర్శి రుద్ర రాంప్రసాద్, కార్యదర్శి తోట రాజిరెడ్డి, సభ్యులు సుతారి రాజేందర్, దారిశెట్టి చిన్నారెడ్డి, ధనుష్, గ్రామస్తులు పాల్గొన్నారు.


కరపత్రం ఆవిష్కరిస్తున్న అధ్యక్షుడు సంజీవ్

వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ -మెట్ పల్లి

వ్యవసాయ బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మెట్‌పల్లి పట్టణంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలప్రకారం.. మెట్‌పల్లి పట్టణం సాయిరాం కాలానికి చిలుక మనోజ్(36) భార్యతో జరుగుతున్న గొడవలతో మనస్థాపం చెంది తాగుడుకు బానిసై పట్టణ శివారుని సింగపూర్ గ్రామంలోని గోదురు రోడ్డు ప్రక్కన గల మొసలి చిన్న రాజం వ్యవసాయ బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఈ కేవైసీ పేరుతో గల్ఫ్ కార్మికుల పేర్లు తొలగించే ప్రయత్నం
గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘాల ప్రతినిధి బత్తిని రాజా గౌడ్

నవతెలంగాణ-మెట్‌పల్లి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కేవైసీ పేరుతో గల్ఫ్ కార్మికుల పేర్లు తొలగించే ప్రయత్నం చేస్తుందని సామాజిక కార్యకర్త, గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘాల ప్రతినిధి బత్తిని రాజాగౌడ్ అన్నారు. పొట్టకూటి కోసం విదేశాలకు వలస వెళ్లిన కార్మికుల పేర్లు రేషన్ కార్డులో నుండి తొలగించకుండా ప్రభుత్వం వెసలుబాటు కల్పించాలిని కోరారు. స్వదేశానికి వచ్చినప్పుడు వారికి అవకాశం కల్పించాలన్నారు. రేషన్ కార్డులో నుండి పేర్లు తొలగిస్తే ప్రభుత్వ పథకాలకు గల్ఫ్ కార్మికులు దూరం అవుతారని ఆవేదన వ్యక్తం చేశారు.

కొబ్బరికాయల దుకాణ నిర్వహణకు వేలం

నవతెలంగాణ -మెట్‌పల్లి

మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ గ్రామంలోని గండి హనుమాన్ ఆలయంలో కొబ్బరికాయలు, పూజా సామగ్రి, లడ్డు, పులిహోర విక్రయించుకోవడానికి ఈనెల 29న మధ్యాహ్నం 2 గంటకు వేలం పాట నిర్వ హిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు 20వేల పూచికత్తు సమర్పించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

ఎంపీటీసీకి సన్మానం

నవతెలంగాణ -ఎండపల్లి

ఎండపల్లి మండలంలోని పలు గణేష్ మండపాలలో ఎంపీటీసీ బషీర్ ప్రత్యేక పూజలు చేశారు. కుల మతాలకు వ్యతిరేకంగా అందరూ కలిసి ఐక్యంగా ఉండాలని, పండుగలను సంతోషంగా జరుపుకోవాలన్నారు. రాజారాంపల్లి ఆదర్శయూత్ ఆధ్వర్యంలో ఎంపీటీసీని సన్మానించారు. బీజేపీ ఉమ్మడి మండల అధ్యక్షుడు. చక్రపాణి, అంబారిపేట ఎంపీటీసీ జడి సుజాత రాజేశం, తోడేటి బాలలింగు, కుసుమ రాజు, దేవి రవీందర్, బుసరపు అశోక్, కాల్వ మల్లయ్య, అనిల్ పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల ర్యాలీ



సిరిసిల్లలో ర్యాలీ చేస్తున్న ఆశా కార్యకర్తలు

నవతెలంగాణ- సిరిసిల్ల రూరల్:
ఆశ వర్కర్లు చేపట్టిన నిరవదిక సమ్మె మంగళవారంకు రెండవ రోజుకు చేరుకుంది. అంబేద్కర్ చౌక్ నుండి నేతన్న చౌక్ మీదుగా గాంధీ చౌక్ వరకు ఆశ వర్కర్లు పెద్ద ఎత్తున ర్యాలీ ప్రదర్శన చేపట్టారు. అంబేద్కర్ కూడలిలో టెంట్ లేకుండానే ఏర్పాటు చేసిన సమ్మె శిబిరం వద్ద ఎండలోనే కూర్చొని తమ సమస్యలను పరిష్కరించాలని పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మూషం రమేశ్, ఆశా వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు భారతీ లు మాట్లాడుతూ ప్రభుత్వం ఆశ వర్కర్లతో వెట్టి చాకిరీ చేయించుకుంటూ తగిన వేతనం చెల్లించడం లేదన్నారు. ఆశ వర్కర్ల న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని లేకుంటే రాబోయే రోజుల్లో సమ్మెను ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తల ప్రతినిధులు మంజుల, జయశీల, రేణుక, కస్తూరి, చంద్రకళ, లావణ్య, గాయత్రి, లత, హెప్సి, రుచిత, రాణి తదితరులు పాల్గొన్నారు.

7
నవతెలంగాణ
రాజన్న సిరిసిల్ల
బుధవారం | సెప్టెంబర్ 27, 2023 | www.navatelangana.com

మండల సమాఖ్య సమావేశం

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట:
తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ కావేరి మండల సమాఖ్య కార్యాలయం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మంగళవారం ఏపీఎం కొమురయ్య ఆధ్వర్యంలో మండల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం

ఏపీఎం మాట్లాడుతూ బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి రుణాలు ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు తీసుకొని సక్రమంగా చెల్లింపులు జరుపాలని అన్నారు. మన ఓటు మన హక్కు గురించి వివరించారు. స్వచ్ఛత సేవ కార్యక్రమంలో మానవహారం, ర్యాలీ, రాంగోలి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సఖీ కేంద్రం డి హబ్ కో ఆర్డినేటర్ రోజా, జెండర్ స్పెషలిస్ట్ దేవిక మాట్లాడుతూ మహిళలకు, పిల్లలకు చైతన్యం కల్పించుట కొరకు టోల్ ఫ్రీ నెంబర్ 181 మహిళలకు, 1098 పిల్లలకు, అంగన్‌వాడీ 155209, వయో వృద్ధులకు 14567, దివ్యంగులకు 155326, మానసిక సమస్యల కొరకు 18004253333 పై నంబర్స్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు బైరి జ్యోతి, సీసీలు, అన్ని గ్రామాల మహిళ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

నిందితుడికి ఏడాది జైలు

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్:
ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులలో నిందితునికి సంవత్సరం జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి హిమబిందు మంగళవారం తీర్పు ఇచ్చారని టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వేర్వేరు చోట్ల రెండు ద్విచక్ర వాహనాలను దొంగతన యత్నం కేసులో లక్ష్మణ్ అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కి తరలించారు. విచారణ అనంతరం విచారణ అధికారి ఎస్.ఐ తిరుపతి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా పరిశీలించిన మేజిస్ట్రేట్ నిందితుడికి సంవత్సరం సాధారణ జైలు శిక్ష విధించారని సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ తెల్పారు.

చేతివృత్తుల వారికి ఆర్థిక చేయూత

మున్సిపల్ చైర్‌పర్సన్ కళా



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ కళా

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్:
బీసీ చేతివత్తుల కులాల కుటుంబాలకు బీసీబంధు పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు రూ.లక్ష చెక్కులను మున్సిపల్ చైర్పర్సన్ కళా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్ని కులాలు, మతాలు, వర్గాలు అనే తేడా లేకుడా కుల వృత్తుల కుటుంబాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వపరంగా ఆర్థిక చేయూతనందిస్తున్నారని అన్నారు. రెండవ విడతలో పురపాలక సంఘం పరిధిలో 64 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. విడతల వారీగా త్వరలోనే పూర్తిస్థాయిలో కులవత్తులపై ఆధారపడి జీవించే లబ్ధిదారులందరికీ లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయ్యాజ్ , వైస్ ఛైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి

నవతెలంగాణ- తంగళ్ళపల్లి:
నాటిన ప్రతి మొక్క బ్రతికేలా చూడాలని డీఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మండేపల్లి గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామంలోని నర్సరీ, ఏవెన్యూ ప్లాంటేషన్, స్కూళ్లలో నాటిన మొక్కలను పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలచే నాటిన ప్రతి మొక్క సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలన్నారు. మొక్క ఎండితే చాలు చర్యలు తప్పవని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లచ్చాలు, ఏపీవో నాగరాజు, టీఎలు లక్ష్మణ్ గౌడ్, మనోహర్, సుష్మ పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణంలో వినాయకుడి నిమజ్జనం చేయాలి: సీఐ


మాట్లాడుతున్న సీఐ సదన్ కుమార్, పక్కన ఎస్ఐ సుధాకర్

నవతెలంగాణ-ఇల్లంతకుంట:
గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సిరిసిల్ల రూరల్ సీఐ.సదన్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ఇల్లంతకుంట మండల కేంద్రంలోని వైశ్య భవన్‌లో గణేష్ ఉత్సవాల సందర్భంగా మండపాల నిర్వాహకులతో సమావేశమయ్యారు. సీఐ మాట్లాడుతూ మండపాల వద్ద ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతీ వినాయక విగ్రహాన్ని జియో టాగింగ్ చేయడం జరిగిందన్నారు . గణేష్ ఉత్సవాలు సజావుగా సాగేందుకు పోలీస్ శాఖ సూచనలు పాటించి సహకరించాలన్నారు. గణేష్ ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ నిబంధనలను ఉల్లంఘిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, జావేద్ అహ్మద్, ఎంపీడీఓ మీర్జా, ఎస్ఐ సుధాకర్, వినాయక మండపాల నిర్వాహకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేటలో..


ఎల్లారెడ్డిపేటలో నిమజ్జన ఏర్పాట్లను పరిశీస్తున్న సీఐ , నాయకులు

ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం చేసుకోవాలని సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ రమాకాంత్ వినాయక మండపాల నిర్వాహకులను కోరారు. నిమజ్జనం కోసం ఎల్లారెడ్డిపేట గిద్దె చెరువును పరిశీ లించారు. స్థానిక సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి గణపతుల నిమజ్జనం కోసం క్రేన్ తెప్పించారన్నారు. లైటింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజు యాదవ్, వార్డు సభ్యులు పందిర్ల శ్రీనివాస్ గౌడ్, కానిస్టేబుల్ సతీష్, పంచాయితీ కార్యదర్శి దేవరాజు, గ్రామ పంచాయితీ హెల్పర్లు సతీష్, హబీబ్ ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు భూమి పూజ



నవతెలంగాణ-ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో మంగళవారం విద్యుత్‌లో వోల్టేజి సమస్య తీర్చడానికి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయడానికి సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, ఎంపీపీ పిల్లి రేణుక కిషన్, జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావులు కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రైతుల కోసం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలు కేసీఆర్‌ను తిరిగి మూడోసారీ గెలిపిస్తాయన్నారు. రైతుల కోసం మెరుగైన 24గంటల ఉచిత విద్యుత్తు సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని కొనియాడారు. గ్రామ శివారులోని 200 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు సరఫరా అయ్యే 11/33కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ వల్ల అంబేద్కర్ నగర్ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. త్వరలోనే కేటీఆర్ తన స్వంత డబ్బులతో హైటెన్షన్ విద్యుత్ లైన్ తొలగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ ఎలగందుల అనసూయ నర్సింలు, ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్ కుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు అందె సుభాష్, గుళ్ళపెల్లి నర్సింహరెడ్డి, కొండ రమేష్ గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ మెండె శ్రీనివాస్ యాదవ్, గంట బాలా గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ నేవూరి వెంకట్ నర్సింహరెడ్డి, మహిళా మండల అధ్యక్షురాలు అప్సరా, ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు ఎడ్ల సందీప్, నాయకులు నంది కిషన్, పందిర్ల పర్శరాములు గౌడ్, గంట వెంకటేష్ గౌడ్‌లు పాల్గొన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

సమస్యలపై గలమెత్తిన సభ్యులు

నవతెలంగాణ- తంగళ్ళపల్లి:
అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వం అందించే సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందాలని సర్పంచులు, ఎంపీటీసీలు అధికారులను నిలదీశారు. ఎంపీపీ పడగల మానస అధ్యక్షతన తంగళ్లపల్లి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల పరిషత్ సమావేశమందిరంలో సభ ప్రారంభం కావడంతోనే వివిధ శాఖల అధికారులు శాఖల వారిగా నివేదికలను చదివి వివరించారు. ప్రతి సమావేశంలో సమస్యలు, సమస్యలుగానే మిగిలిపోతున్నాయని పత్రికలలో వస్తున్న కథనాలు చర్చనీయాంసంగా మారుతున్నాయని సభ్యులు గలమెత్తారు. నెలలు తరబడి సమస్యలు పరిష్కారం కావడం లేదని అంకిరెడ్డిపల్లె ఎంపీటీసీ రాజిరెడ్డి నిలదీశారు. సమస్యలు పరిష్కారం కానప్పుడు ఈ మండల సర్వసభ్య సమావేశాలు నిర్వహించడం ఎందుకని ప్రశ్నించారు. గత సమావేశాల్లో పింఛన్ల సమస్యలు లేవనెత్తితే ఇప్పటి వరకు పరిష్కారం కాలేదన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వం ప్రకటించిన పింఛన్లు ఎందుకు మంజూరు చేయలేదన్నారు. అర్హులైన వారందరూ పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకుంటే అందులో 20 శాతం మందికి కూడా కొత్త పింఛన్లు మంజూరు చేయలేదన్నారు. ప్రభుత్వ పథకాల కోసం రేషన్ కార్డును అనుసంధానం చేసినా కూడా ఆర్హులైన నిరుపేదలకు పింఛన్లు అందక పోవడం అధికారుల నిర్లక్ష్యమేనని మండిపడ్డారు. గృహలక్ష్మి పథకం కింద లబ్ధిదారులను ఎంపిక చేయాల్సింది పోగా, గతంలో ఇళ్లను నిర్మించుకున్న పాత ఇళ్లకు గృహలక్ష్మి పథకం వర్తింపచేశారని వివరించారు. బీసీబంధు పథకాన్ని గ్రామాల్లో లబ్ధిదారులను ఎంపిక చేసేటపుడు అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియకుండా ఎలా ఎంపిక చేస్తారని సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు వేణుగోపాలరావు ప్రశ్నించారు. అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి సమన్వయంతో పని చేసినప్పుడే ప్రతి పథకం లబ్ధిదారునికి చేరుతుందన్నారు. మండలంలో కొందరు అధికారులు


మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న సెస్ చైర్మెన్ చిక్కాల రామారావు


అధికారులను నిలదీస్తున్న ఎంపీటీసీ రాజిరెడ్డి

అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. బీసీబంధు పథకం కింద ఎంతమంది ఏ ఏ గ్రామాల్లో దరఖాస్తు చేసుకున్నారో వాటి వివరాలను అందించాలని కోరారు. ఎంపీడీవోను కొందరు చిన్నచూపు చూస్తున్నారని ఎంపీటీసీ కోడి అంతయ్య అన్నారు. కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులు వచ్చిన వాటిని వెంట వెంటనే సంబంధిత అధికారులకు ఫార్వర్డ్ చేయడం జరుగుతుందని తహసీల్దార్ వెంకటలక్ష్మీ తెలిపారు. బీసీబంధు పథకం కింద మండలంలో 343 మంది దరఖాస్తు చేసుకోగా ఇప్పటివరకు 63 మందిని ఎంపిక చేయడం జరిగిందన్నారు.

వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళి


ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేస్తున్న నేతలు

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్:
తెలంగాణ బహుజన చైతన్యానికి, మహిళా శక్తికి చాకలి ఐలమ్మ ప్రతీక అని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సిరిసిల్ల సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, రాష్ట్ర పవర్ లూం, టెక్స్ టైల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ చైర్మెన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు శంకరయ్య, ఆర్డీఓలు, ఆనంద్ కుమార్, మధుసూదన్ జిల్లా రజక సంఘాల నాయకులు వీరనారి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ నాటి తెలంగాణ సాయుధ పోరాట కాలంలో చిట్యాల ఐలమ్మ ప్రదర్శించిన ధైర్య సాహసాలు, చైతన్యం నేటి తరానికీ ఎంతో స్పూర్తిదాయకమని కొనియాడారు. నాటి కాలంలోనే, తన హక్కుల సాధన కోసం న్యాయస్థానాల్లో చట్టపరమైన పోరాటం చేసిన ప్రజాస్వామికవాది, సబ్బండ వర్గాల ఆత్మగౌరవ ప్రతీక చిట్యాల ఐలమ్మ అని కొనియాడారు.నాటి వారి స్పూర్తి తెలంగాణ సాధనలోనూ అనంతర ప్రగతి ప్రస్థానంలోనూ ఇమిడి ఉన్నదని తెలిపారు. మహిళల సంక్షేమం కోసం తమ కృషి కొనసాగుతూనే ఉంటుందని కలెక్టర్ అనురాగ్ జయంతి స్పష్టం చేశారు. రాష్ట్ర పవర్ లూం, టెక్స్ టైల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ చైర్మెన్ గూడూరి ప్రవీణ్ మాట్లాడుతూ చిట్యాల ఐలమ్మ త్యాగాలకు గుర్తుగా ప్రభుత్వం ఆమె జయంతి, వర్థంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తున్నదని చెప్పారు. దేశంలో మరెక్కడాలేని విధంగా రజకుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రాఘవేంద్ర, జిల్లా పౌర సంబంధాల అధికారి మామిండ్ల దశరథం, రజక సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయములో

సిరిసిల్ల రూరల్: చిట్యాల చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యలయంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ చిత్ర పటానికి ఎస్పీ అఖిల్ మహజన్ మంగళవారం పూలమాల వేసి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూతెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, సబ్బండ వర్గాల ఆత్మగౌరవ ప్రతీక చాకలి ఐలమ్మ అని పేర్కొన్నారు. బానిసత్వాన్ని బద్దలు కొట్టి సమాజానికి చైతన్యాన్ని అందించిన వీరనారి అని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, టౌన్ సి.ఐ ఉపేందర్, ఆర్.ఐ యాదగిరి,కార్యాలయ సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

17వ పోలీస్ బెటాలియన్‌లో..

సిరిసిల్ల రూరల్:తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్పూర్తి మనందరికీ ఆదర్శప్రాయమని 17వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ యస్.శ్రీనివాస రావు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి (చిట్యాల) ఐలమ్మ జయంతి వేడుకలను సర్దాపూర్ లోని 17వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ యస్.శ్రీనివాస రావు చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ఎ.జయప్రకాశ్ నారాయణ ,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి.శైలజ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు

ముస్తాబాద్: చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ, జయంతి వేడుకలు.మండల కేంద్రంలో పాటు పలు గ్రామాలలో రజక సంఘం నాయకుల ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 128వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో సర్పంచ్ సుమతీ కష్ణమూర్తి, ప్రజా ప్రతినిధులు చాకలి ఐలమ్మకు పూలమాలలు వేసి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆవునూరు గ్రామంలో రజక సంఘం గ్రామ శాఖ ఆధ్వర్యంలో గ్రామస్థులు కలిసి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శరత్ రావు జడ్పీటీసీ నరసయ్య, విద్యుత్ సహకార సంఘం డైరెక్టర్ అంజిరెడ్డి మాజీ డైరెక్టర్ విజయ రామారావు, రజక మండల సంఘం అధ్యక్షులు నారాయణ, నక్క దాసరి రవి, రజక సంఘం నాయకులు యాదగిరి, భాను, హనుమయ్య, నరసయ్య, దేవయ్య, బాలయ్యతో పాటు వీర గ్రామాల రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: బహుజన చైతన్యానికి, మహిళా శక్తికి ప్రతీక చిట్యాల (చాకలి) ఐలమ్మ అని జడ్పీ వైస్ ఛైర్మన్ వేణు పేర్కొన్నారు. మంగళవారం జయంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముస్కు మల్లయ్య కేతిరెడ్డి అనసూయ వెంకటనర్సింహరెడ్డి, దమ్మని లక్ష్మీ లక్ష్మన్, ఉడుతల వెంకన్న, మండల ఉపసర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు సాదుల్, రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తెలంగాణ శ్రీనివాస్, నాయకులు రఘు, ర్యాగటి రమేష్, ఎడ్ల ప్రశాంత్ రెడ్డి, చొప్పరి అంజయ్య, నాంపల్లి నూతన్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి:చాకలి అయిలమ్మ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. ముందుగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రుద్రంగి:రుద్రంగి మండల కేంద్రంలో చిట్యాల ఐలమ్మ 128వ జయంతి సందర్భంగా బీఎస్పీ మండల అధ్యక్షులు పోసు తిరుపతి ఆధ్వర్యంలో ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కట్కూరి శంకర్. వేములవాడ నియోజకవర్గ కో కన్వీనర్ అనిల్ కుమార్, నాయకులు కట్కూరి రమేష్, దయ్యాల ఉదయ్, మండల ప్రధాన కార్యదర్శి దేశవేని భూమేష్, వేములవాడ నాయకులు కాదాస్ మహేందర్, నాయకులు తర్రె గణేష్, కాదసు అనిల్, లింగాల రవి, లింగాల పాల్గొన్నారు

ఎల్లారెడ్డిపేట:ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మంగళవారం చిట్యాల ఐలమ్మ 128వ జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా మండల రజక సంఘం అధ్యక్షులు కంచర్ల నర్సింలు ఐలమ్మ విగ్రహనికి పూలమాలలు వేసి ఆమె చేసిన పోరాటాల గురించి వివరించారు. ఆనాటి కాలంలోనే ప్రజలకోసం పోరాటం చేసిన గొప్ప వీరవనిత అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రజక సంఘం కార్యదర్శి బాలమల్లు, మండల రజక సంఘం గౌరవ సలహదారులు దొమ్మాటి నర్సయ్య, నాయకులు అజయ్, రాజు, చంద్రయ్య, భాస్కర్‌లు పాల్గొన్నారు.


17 బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాసరావు


ఐలమ్మకు నివాళులర్పిస్తున్న ఎస్పీ అఖిల్ మహజన్


ఇల్లంతకుంటలో జడ్పీ వైస్ చైర్మన్ వేణు నివాళ్ళు


చందుర్తిలో ఐలమ్మ కు నివాళ్ళు అర్పిస్తున్న నాయకులు


రుద్రంగిలో నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు


ముస్తాబాద్‌లో పూలమాల వేస్తున్న నాయకులు

థర్డ్ పార్టీ వ్యవస్థను రద్దు చేయాలి

అకాడమిక్ ఇన్ స్ట్రక్టర్ల ఆందోళన

నవతెలంగాణ-కోనరావుపేట:
రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న అకాడమీ ఇన్స్పెక్టర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళ వారం గిరిజన ఆశ్రమ పాఠశాల ఎదుట ఉపాధ్యాయులు ఆందోళన చేపట్టారు. థర్డ్ పార్టీ వ్యవస్థను రద్దు చేసి నేరుగా విధుల్లోకి తీసుకుని కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లకావత్ తిరుపతి, లకావత్ రవి. ఊర్మిళ. కష్ణవేణి పాల్గొన్నారు.


గిరిజన ఆశ్రమ పాఠశాల ఎదుట ఉపాధ్యాయులు ఆందోళన

చోరీల నియంత్రణకే 'నిఘానేత్రాలు'

రాజన్న సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్

నవతెలంగాణ-చందుర్తి:
చోరీలను నియంత్రించడానికే నిఘా నేత్రాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని రాజన్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్లో ఉమ్మడి మండలంలోని రుద్రాంగి,చందుర్తి ప్రధాన రహదారి వెంట ఉన్న గ్రామాలలో


కెమెరాలను ప్రారంభం చేస్తున్న ఎస్పీ

సింగరేణి కంపనీ సహకారంతో 36 నిఘా నేత్రాలను వాటిని పోలీస్ స్టేషన్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సీసీ కెమెరాలు లేకపోవడం కారణంగా వరుస చోరీలు జరుగుతున్నాయని అన్నారు. చోరీలు, దోపిడి, దొంగతనాలను నియంత్రించడానికి నిఘా నేత్రాలు ఎంతో ఉపయోగ పడతాయని తెలిపారు. అన్ని గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ కిరణ్ కుమార్, వేములవాడ రూరల్ సీఐ కష్ణ కుమార్, ఎస్సై అశోక్ ఉన్నారు.

చేతి వృత్తులకు చేయూత

జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు

నవతెలంగాణ-ఎల్లారెడ్డిపేట:
కులవృత్తులకు జీవం పోయడంతో పాటు ప్రతి కార్మికుడు యజమాని కావాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి కుటుంబానికి లక్ష రూపాయల సాయం అందిస్తున్నారని బీసీ బంధు పథకం ద్వారా అందిస్తున్న ఈ ఆర్థిక సహాయం నిరంతర ప్రక్రియ అని జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో 43 మందికి బీసీబంధు పథకం కింద 43 లక్షల చెక్కులను జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక కిషన్, ఎంపీడీవో చిరంజీవి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు కలిసి చెక్కులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, మాజీ ఏఎంసీ చైర్మన్ కొండ రమేష్‌గౌడ్, గుళ్లపెల్లి నర్సింహరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పందిర్ల నాగరాణి పర్శరాములు, ఎలగందుల అనసూయ నరసింహులు, మధు, మండల కో ఆప్షన్ సభ్యులు జబ్బర్, సింగిల్ విండో డైరెక్టర్ మెండే శ్రీనివాస్ యాదవ్. సర్పంచ్‌లు ముక్క శంకర్, భూక్య శంకర్ నాయక్, కదిరే రజిత శ్రీనివాస్ గౌడ్, అమృత, ఏఎంసీ డైరెక్టర్లు గంట బాలాగౌడ్, మండల బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు మురళీ గౌడ్, పట్టణ అధ్యక్షులు బండారి బాల్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు హసన్, ఉదయ్, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెరిగేలా కృషి చేయాలి

నవతెలంగాణ-రాయికల్
ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీపీ లావుడ్యా సంధ్యారాణి అన్నారు.మంగళవారం రాయికల్ మండలం తాట్లవాయి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించిన బోగ రమేష్ స్థానిక ఎంపీపీని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పోరండ్ల పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న బోగ రమేష్ పదోన్నతిపై తాట్లవాయిహై స్కూల్లో గెజిటెడ్ హెడ్ మాస్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఎంపీపీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు చెన్న కరుణాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించాడని ఫిర్యాదు

నవతెలంగాణ -మెట్‌పల్లి
మెట్‌పల్లి పట్టణంలోని రేగుంట వార్డుకు చెందిన బాల్క శంకర్‌రావును కలాలి రాజారెడ్డి తండ్రి చిన్ననర్సయ్య అనే వ్యక్తి బర్లమండ భూమి విషయంలో రేగుంట మెట్‌పల్లి మార్గ మధ్యలో అడ్డుకొని కులం పేరుతో దూశించాడని ఫిర్యాదు చేశాడు.బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీలో భాగంగా ఎస్ఐ దర్యాప్తు చేపట్టారు.

మేడిపల్లి ఠాణను తనిఖీ చేసిన డీఎస్పీ రవీందర్‌రెడ్డి

నవతెలంగాణ-మేడిపల్లి
మేడిపల్లి మండల కేంద్రంలోని మేడిపల్లి ఠాణను వార్షిక పరిశీలనలో భాగంగా మెట్‌పల్లి డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం మామిడి మొక్క నాటారు. అనంతరం పోలీస్ స్టేషన్ పనితీరుపై సమీక్షించారు. రికార్డుల పరిశీలన, క్రైమ్ రేటు తగ్గుదల, నిమజ్జన ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ రవీందర్, పోలీస్ సిబ్బంది అనిల్ కుమార్, స్వర్ణ పాల్గొన్నారు.



ఎగ్లాస్‌పూర్‌లో వాటర్ ప్లాంట్ ప్రారంభం

నవతెలంగాణ-కొనరావుపేట
కోనరావుపేట మండలం ఎగ్లాస్పూర్ గ్రామంలో ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్‌ను డాక్టర్ వికాస్ రావు, దీప దంపతులు మంగళవారం ప్రారంభించారు. మండలంలో ఇప్పటికే ప్రతిమ ఫౌండేషన్ ద్వారా ఆరు గ్రామాలకు వాటర్ ప్లాంట్లు, సుమారు 300 పైచిలుకు మహిళలకు కుట్టు మిషన్‌లను, రెండు అంబులెన్స్ లను అందించమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దండు ఎల్లవ్వ,ఉపసర్పంచ్ రాములు, బీజేపీ జిల్లా కార్యదర్శి సురేందర్ రావు,మండల అధ్యక్షుడు గొట్టె రామచంద్రం, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు బాలాజీ, ఓబీసీ జిల్లా కార్యదర్శి ప్రభాకర్,నాయకులు తిరుపతి, పురుషోత్తం రావు,శ్రీనివాస్ రెడ్డి, కౌశిక్,తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు మెరుగైన వేతనాలు కల్పించాలి

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు మెరుగైన వేతనాలు కల్పించాలని ఎస్సీకేఎస్ సీఐటయూ ఆర్జీ-2 అధ్యక్షుడు అయిలవేణి భూమయ్య అన్నారు. మంగళవారం ఆర్జీ-2 ఓసీపీ-3లో బ్లాస్టింగ్ కాంట్రాక్ట్ కార్మికుల వద్ద మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు అయిలవేన భూమయ్య మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గోలేటి నుంచి గోదావరిఖని వరకు కార్మికులు గోదావరిఖని కేంద్రంగా పెద్ద ఎత్తున గోదావరిఖనిలో నిరాహార దీక్షలు ధర్నాను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో



ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

ఎస్సీకేఎస్ ఆర్జీ-2 కార్యదర్శి లక్ష్మీనారాయణ, సీఐటీయూ నాయకులు ఓదెలు, జి సంతోష్, ప్రకాష్, జిదుల సురేష్, రామచందర్, డి కుమార్, బి గోపాల్, జె శ్రీనివాస్, కిరణ్, సమ్మయ్య శంకర్, రాజేష్‌లు హాజరయ్యారు.

ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

- ఐలమ్మ చిత్రపటాలకు అధికారులు, ప్రజాప్రతినిధుల నివాళులు
- జూలపల్లిలో విగ్రహావిష్కరణ

నవతెలంగాణ-పెద్దపల్లి: వీర వనిత చాకలి ఐలమ్మ ప్రదర్శించిన పోరాట స్ఫూర్తి మహిళా శక్తికి స్ఫూర్తిదాయకమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ, అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ తో కలిసి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధిశాఖ అధికారి రంగారెడ్డి, రజక సంఘ నాయకులు, రజక సంఘం సభ్యులు శ్రీనివాస్, అశోక్, శంకర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జూలపల్లి: మండలంలోని పెద్దాపురం గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి చిట్యాల ఐలమ్మ 128వ జయంతి వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్న వీరానారి చాకలి అయిలమ్మ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి, గ్రంథాలయ చైర్మన్ రఘువీర్‌సింగ్, విగ్రహదాత సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు నరసింహ యాదవ్, గ్రామ సర్పంచ్ కంకణాల భారతి-జ్యోతిబాస్, రజక సంఘం అధ్యక్షుడు పున్నం రాజయ్య, అరికోళ్ల నాగరాజు, లచ్చయ్య, స్వామి, శంకర్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

సుల్తానాబాద్: తెలంగాణ సాయుధ పోరాట వీర వనిత, చిట్యాల(చాకలి) ఐలమ్మ 128వ జయంతి సందర్భంగా మండల అధ్యక్షుడు నిట్టూరి శ్రీనివాస్ సహా పలు పార్టీల నేతలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు నిట్టూరి మైసయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నిట్టూరి ఆనంద్, మండల వైస్ ప్రెసిడెండ్ నిట్టూరి రాజేశం, ప్రధాన కార్యదర్శి నిట్టూరి దీపక్, గౌరవాధ్యక్షుడు మైలారం మదురయ్య, వైస్ ప్రెసిడెంట్ నిట్టూరి అంజయ్య, ప్రధాన కార్యదర్శి కొత్తకొండ శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముత్యం సునీత-రమేష్‌గౌడ్, కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు నిషాద్ రఫీక్, కూకట్ల గోపి, దున్నపోతుల రాజయ్య, గుర్రాల శ్రీనివాస్, కోఆప్షన్ మెంబర్ సాజిద్, మేనేజర్ అలిమోద్దీన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మంథని: చాకలి ఐలమ్మ ఆత్మగౌరపోరాట స్ఫూర్తితో జడ్పీ చైర్మన్ పుట్ట మధు, మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజలు సైతం నియోజకవర్గం బడుగు, బలహీన వర్గాల ప్రజల్లో చైతన్యం తీసుకురావటానికి కృషి చేస్తున్నారని మంథని ఎంపీపీ కొండ శంకర్, జడ్పీటీసీ తగరం సుమలత-శంకర్ లాల్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్ స్పష్టం చేశారు. చాకలి ఐలమ్మ జయంతి పురస్కరించుకొని స్థానిక ఐలమ్మ విగ్రహానికి రజక సంఘం నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంథని మండల కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ చిత్రపటాలకు, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. మంథని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో చాకలి ఐలమ్మ జయంతిని అధికారికంగా మంగళవారం నిర్వహించారు. మంథని ఆర్డీవో హనుమనాయక్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో డీఏవో తూము రవీందర్, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

గోదావరిఖని: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చిట్యాల (చాకలి) ఐలమ్మ ప్రదర్శించిన ధైర్య సాహసాలు నేటి తరానికి స్ఫూర్తి అని రామగుండం నగర మేయర్ బంగి అనిల్ కుమార్ అన్నారు. తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ జయంతి పురస్కరించుకొని మంగళవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఆమె చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నాగేశ్వర్, కార్పొరేటర్లు కల్వచర్ల కష్ణవేణి, శంకర్ నాయక్, కన్నూరి సతీష్, బాల రాజ్ కుమార్, ధాతు శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు నాయకులు, సూపరింటెండెంట్ మనోహర్ సలీం, మురళీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.


జూలపల్లి: ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే


సుల్తానాబాద్: నివాళులర్పిస్తున్న నాయకులు


మంథని: నినాదాలు చేస్తున్న నాయకులు


గోదావరిఖని: నివాళులర్పిస్తున్న మేయర్ అనిల్ కుమార్

సకాలంలో రేషన్ షాపులకు బియ్యం తరలించాలి

- అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్

నవతెలంగాణ-సుల్తానాబాద్: సకాలంలో ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి సకాలంలో రేషన్ షాపులకు బియ్యం తరలించాలని అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాధారణ తనిఖీలలో భాగంగా అదనపు కలెక్టర్ సుల్తానాబాద్ ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేశారు. ఆయన వెంట జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, డిప్యూటీ తహసీల్దార్ శంకర్ పాల్గొన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

ప్రశాంతంగా వినాయక నిమజ్జనం జరుపుకోవాలి

నవతెలంగాణ-సుల్తానాబాద్: పట్టణ పరిధిలో వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత-రమేష్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఏసీపీ ఎడ్ల మహేష్, కమిషనర్ మల్లికార్జున్‌లు పెద్ద చెరువు వద్ద వినాయక ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఐ జగదీష్ ఎస్సై విజయేందర్ కో ఆప్షన్ సభ్యులు సాజిద్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ: గణేష్ ఊరేగింపులలో డీజేలు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని గోదావరిఖని టూ టౌన్ సీఐ సూరం వేణుగోపాల్ గణేష్ మండప నిర్వాహకులను హెచ్చరించారు. మంగళవారం టూటౌన్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రత కోసం తగినంత మంది వాలంటీర్లను ఉత్సవ నిర్వాహకులు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

నవతెలంగాణ-ముత్తారం: ప్రశాంతంగా గణేష్ నిమజ్జోత్సవం నిర్వహించుకోవాలని ముత్తారం ఎస్ఐ మధుసూదన్‌రావు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని కాసార్లగడ్డ బస్‌స్టాండ్ వద్ద ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వేడుకలు జరుపకోవాలని ఆయన అవగాహనా కల్పించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా వెంటనే100 కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం తెలుపాలన్నారు.

ప్రతీ కార్యకర్తను కాపాడుకుంటా..

నవతెలంగాణ-ముత్తారం: నియోజకవర్గంలోని బీఆర్ఎస్ ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడు కుంటానని సింగిల్ విండో చైర్మన్ రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు చల్ల నారాయణరెడ్డి అన్నారు. మంథని, ముత్తారం మండలం సీతంపల్లి సర్పంచ్ పులిపాక నగేష్ అనారో గ్యంతో బాధపడుతుండగా మంగళవారం ఆయనను పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు. వారి వెంట రామగిరి ఎంపీపీ ఆరెల్లి దేవక్క-కొమురయ్యగౌడ్, దుర్గం మల్లయ్య, మల్లేష్‌యాదవ్, రాజేశం, వేణు, సారయ్య, డోలి అర్జయ్య ఉన్నారు.


ఆర్థిక సాయం చేస్తున్న నారాయణరెడ్డి

కాంగ్రెస్ నాయకుల రాస్తారోకో

నవతెలంగాణ-ముత్తారం: మండల కేంద్రంలోని అడవీ శ్రీరాంపూర్ చౌరస్తాలో రోడ్డుపై మంగళవారం రాస్తా రోకో చేపట్టారు. మండలంలో ఇసుక రవాణాతో రోడ్డు ధ్వంసం అయి ప్రజలు పడు తున్న ఇబ్బందులు జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ చేపడుతున్న పాదయాత్రలో కనబడడం లేదా అని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా జరపడంతో రోడ్లు ధ్వంసం అయ్యి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులను ముత్తారం ఎస్ఐ మధుసూదన్ రావు సముదాయించి, నిరసనను విరమింపజేశారు.


రాస్తారోకో చేస్తున్న నాయకులు

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

నవతెలంగాణ-ముత్తారం: మండల కేంద్రంలో నిర్వహించే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఎస్ఐ మధుసూదన్ రావు, కాల్వ శ్రీరాంపూర్ ఎస్ఐ టి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ముత్తారం మండల కేంద్రంలోని కాసర్ల గడ్డ ప్రధాన చౌరస్తా వద్ద మంగళవారం ప్రజలకు అవగహనా కల్పించారు. అక్టోబర్ 2న నిర్వహించనున్నట్లు తెలిపారు.

శ్రీధర్‌బాబుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం..


నవతెలంగాణ-ముత్తారం: మంథని నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ అన్నారు. ముత్తారం ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ పాదయాత్రలో భాగంగా ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు 40 ఏళ్ల రాజకీయంలో ఏం అభివృద్ధి చేయలేదని, కాంగ్రెస్ పార్టీ ఏం పనులు చేయలేదని అనడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో ముత్తారం సర్పంచ్ తూటి రజిత-రఫీ, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు గాదం శ్రీనివాస్,ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు అల్లం కుమారస్వామి,ఎస్సీ సేల్ మండల అధ్యక్షుడు ఏడవ సంపత్, మండల సోషల్ మీడియా ఇన్‌చార్జి కోల విజయ్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఖమ్మంపల్లిలో బస చేసిన జడ్పీ చైర్మన్

నవతెలంగాణ-ముత్తారం: ముత్తారం మండలం నుంచి జడ్పీ చైర్మన్, మంథని బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధూకర్ చేపట్టిన ప్రజా ఆశీర్వాద పాదయాత్రలో భాగంగా సోమవారం రాత్రి స్థానిక ఖమ్మంపల్లి పంచాయతీ పరిధిలోని బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక వసతి వద్ద నాయకులతో కలిసి బస చేపట్టారు. అనంతరం మంగళవారం ఉదయం మళ్లీ ఆయన ప్రజా ఆశీర్వాద యాత్రను కొనసాగించారు.

జాతీయస్థాయి కరాటేలో ఖని విద్యార్థి ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న స్కూల్ ప్రిన్సిపాల్ రజనీ

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్: ఈనెల 24న హైదరాబాద్ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో గోదావరిఖని నారాయణ స్కూల్ ఎనిమిది సంవత్సరాల విభాగంలో నాలుగో తరగతి విద్యార్థి కత్రోజు ధీమస్ పాల్గొని జాతీయస్థాయి కరాటేలో బంగారు పథకంతోపాటు, మెమోంటో, ప్రశంసాపత్రం అందుకున్నారు. మంగళవారం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థి దిమస్‌ను స్కూల్ ప్రిన్సిపాల్ రజనీ అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ సౌభాగ్య, తిరుమల, కరాటే ఉపాధ్యాయులు శ్రీనివాస్, పిఈటి నాగరాజు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నవతెలంగాణ-ముత్తారం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ముత్తారం మండలం అడవీ శ్రీరాంపూర్ గ్రామ సర్పంచ్ తుంగాని సమ్మయ్య అన్నారు. మంగళవారం అడవీ శ్రీరాంపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందితో ఆయన పారిశుధ్య పనులను చేయించారు. వర్షాల నేపథ్యంలో అనారోగ్యాలు, సీజనల్ వ్యాధులు దరి చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-ముత్తారం: మండలంలోని సీతంపల్లి గ్రామ యూత్ సభ్యుల ఆహ్వానం మేరకు వారు ఏర్పాటు చేసిన గణపతి మండపంలో గణనాథున్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, కాటారం పీఏసీఎస్ చైర్మన్ చల్లా నారాయణరెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులకు విరాళం అందజేశారు. కార్యక్రమంలో రామగిరి ఎంపీపీ ఆరెల్లి దేవక్క-కొమురయ్య గౌడ్, మాజీ జడ్పీటీసీ దుర్గం మల్లయ్య, యూత్ సభ్యులు తదితరులున్నారు.

సామాజిక బాధ్యతతోనే మెగా రక్తదాన శిబిరం

- సీపీ రేమారాజేశ్వరి

నవ తెలంగాణ-పెద్దపల్లి: పోలీసులు నిత్యం లాఅండ్ఆర్డర్ నిర్వహణే కాదు సామాజిక బాధ్యతను కూడా నిర్వర్తిస్తుంటారని అందులో భాగంగానే పెద్దపల్లి పట్టణంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని రామగుండం సీపీ రేమారాజేశ్వరి తెలిపారు. మంగళవారం సాయంత్రం పెద్దపల్లి డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెద్దపల్లి సబ్‌డివిజన్ పరిధిలో 6006 మంది రక్తదాతలతో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం అక్టోబరు 2న మహాత్మా గాంధీ జన్మదిన సందర్భంగా పెద్దపల్లి పట్టణంలోని ఐటీఐ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. అనంతరం మెగా రక్తదాన శిబిరం సంబంధించిన పోస్టర్లను సీపీ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డీసీపీ వైభవ్ గైక్వాడ్ ఏసీపీ ఎడ్ల మహేష్ సుల్తానాబాద్ సీఐ జగదీష్ సీఐ ఎస్ఐలు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీ

మంథని గణేష్ ఉత్సవ కమిటీ ఏర్పాటు

నవతెలంగాణ-మంథని: మంథని మండల కేంద్రంలో మంగళవారం గణేష్ ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షురాలుగా పుట్ట శైలజ, కమిటీ అధ్యక్షుడిగా మిరాల సాగర్ యాదవ్, ఉపాధ్యక్షుడిగా కొత్త శ్రీనివాస్‌గుప్తా, బెల్లంకొండ ప్రకాష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రామడుగు మారుతిరావు, కార్యదర్శిగా ఇల్లందుల కిషోర్, సహాయ కార్యదర్శిగా రేపాల ఉమాదేవి, కోశాధికారిగా పోతరవేని క్రాంతికుమార్, సహాయ కోశాధికారిగా మొదుగులపల్లి విజయ్ కుమార్, గౌరవ సలహాదారుగా మెడగొనీ రాజమౌళిగౌడ్, కార్యవర్గ సభ్యులుగా రాచకొండ నరేష్, నామని నగేష్, పందుల వివేక్, బడికెల రాజశేఖర్, ఎడ్ల శివలు నియమయమయ్యారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శంకర్

బీఎస్పీలో పలువురి చేరికలు

నవతెలంగాణ ఓదెల: మండలంలోని బీఎస్పీ పార్టీ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష సమక్షంలో పలువురు పార్టీలో చేరారు. దాదాపు 30 మంది పార్టీలో చేరినట్లు దాసరి ఉష తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ మండల నాయకులు కళ్యాణం మహేష్, రాచర్ల నవీన్, బీరం రవి, బోయ సాది, బండ నిఖిల్ కుమార్‌యాదవ్, పిట్టల శివ, దొడ్డి అశోక్ పాల్గొన్నారు.


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఉష

స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం

నవతెలంగాణ ఓదెల: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎంపీడీవో సత్తయ్య ఆధ్వర్యంలో ఓదెల గ్రామంలో స్వచ్ఛతాహీ ర్యాలీ, శ్రమదానం నిర్వహించారు. ఈ కార్యక్రమములో మండల పంచాయతీ అధికారి అబ్దుల్‌వజిద్, ఐకేపీ ఏపీఎం లతామంగేష్కరి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎండీ జావేద్, జూనియర్ కళాశాల ప్రిసిపాల్, కార్యదర్శి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బాలాజీ రావు

నవతెలంగాణ-సుల్తానా బాద్ రూరల్: ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని సుల్తానాబాద్ ఎస్సై విజేందర్ అన్నారు. సోమవారం సుల్తానాబాద్ మండలంలోని నారాయణపూర్ గ్రామంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపెల్లి సబ్ డివిజన్ పోలీస్ అధికారులు ఏర్పాటు చేయబడిన మెగా రక్తదాన శిబిరంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యువకులకు రక్తదానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలాజీరావు, ఎంపీటీసీ మండల రమేష్, టీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు గుడుగుల సతీష్, మూల హరీష్ పాల్గొన్నారు.

ఘనంగా గోమాతకు పూజలు

నవతెలంగాణ-సుల్తానాబాద్: పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌లో మంగళవారం గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. వినాయకుడిని కూరగాయలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో పూజారి పారువెల్ల రామ్మూర్తిశర్మ, ఆర్యవైశ్య సంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

నమ్మితే నట్టేట ముంచిన కాంగ్రెసోళ్లు

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్

నవతెలంగాణ-మంథని: 40 ఏళ్లుగా కాంగ్రెసోళ్లను నమ్మితే నట్టేట ముంచారని బీఆర్ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి, జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. రెండో రోజు ప్రజాఆశీర్వాద పాదయాత్రలో భాగంగా మంథని నియోజ కవర్గంలోని మల్హర్ మండలంలో కొనసాగింది. మొదటి రోజు ముత్తారం మండలం ఖమ్మంపల్లిలో రాత్రి బస చేసిన ఆయన ఉదయం మల్హర్ మండలానికి భూపాలపల్లి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జక్కు శ్రీ హర్షిని రాకేష్ తో కలసి పాదయాత్రగా బయలు దేరారు. మండలంలోని తాడిచర్ల, పెద్దతుండ్ల, గాదంపల్లి గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రజలకు స్వాగతం పలికారు. 2014 తర్వాతనే మల్హర్ మండలానికి అభివృద్ధి బాటలు పడ్డాయన్నారు. రాబోయే రోజుల్లో మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే పేదింటి ఆడబిడ్డ పెళ్లిళ్ల, ఉన్నత చదువుల కోసం వెళ్లే యువతుల చదువుల బాధ్యత తను తీసుకుంటానన్నారు. హైదరాబాద్‌లో రెండు హాస్టల్‌లు ఏర్పాటు చేసి ఉచితంగా చదివిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్

హామీలు అమలు చేయాలని కలెక్టరేట్ వద్ద ధర్నా

నవతెలంగాణ-పెద్దపల్లి 34 రోజుల గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె సందర్భంగా పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గ్రామ పంచాయతీ జేఏసీ రాష్ట్ర నాయకత్వానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ గతంలో జరిగిన 34 రోజుల సమ్మె సందర్భంగా సమ్మె విరమిస్తే వారం రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామన్నారు. 45 రోజుల దాటిన ఏ ఒక్క సమస్య పరిష్కరించకుండా పూర్తిగా నిర్లక్ష్యంగా, దాటవేసే ధోరణితో, మోసం చేస్తున్నారని అన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్యామ్‌లాల్ ప్రసాద్ గారికి వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి. ఖాజా,జిల్లా నాయకులు నాగయ్య, కూనమల్ల అశోక్, నరేష్, ముస్తఫా, బూడిది రామస్వామి, నగేష్, శారద, రాజయ్య, సమ్మయ్య, శ్రీనివాస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.


అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

రక్షణపై డీడీఎంఎస్ సమీక్ష సమావేశం

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ: ఓసీపీ-3 ప్రాజెక్టు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో పిట్ కమిటీ సభ్యులకు రక్షణపై బానోతు వెంకన్న డీడీఎంఎస్ సౌత్‌జోన్-2 సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు అధికారి మధుసూదన్, మేనేజర్ రమేష్, రక్షణ అధికారి భరత్ కుమార్, ఓసీపీ-3 ముఖ్య అధికారులు పిట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కార్మికులు వ్యక్తిగత రక్షణ కిట్ ధరించాలి

నవతెలంగాణ-గోదావరిఖని: విధి నిర్వహణలో వ్యక్తిగత రక్షణ కిట్ ధరించాలని రామగుండం నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్ పారిశుధ్య కార్మికులకు సూచించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు మంగళవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో వ్యక్తిగత రక్షణ కిట్‌లను పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సి హెచ్ నాగేశ్వర్, కార్పొరేటర్లు కల్వచర్ల కష్ణవేణి, శంకర్ నాయక్, కన్నూరి సతీష్, బాల రాజ్ కుమార్, ధాతు శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్ రావు సూపరింటెండెంట్ మనోహర్, నాయకులు సలీం, మురళీధర్ రావు, యాకయ్య సానిటరీ ఇన్స్పెక్టర్లు శ్యామ్ సుందర్, సునీల్, తదితరులు పాల్గొన్నారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించడానికి రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మంగళ వారం నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్ ప్రారంభించారు.

టీఎస్‌పీఎస్సీ బోర్డును వెంటనే ప్రక్షాళన చేయాలి


నిరసన తెలుపుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే గ్రూప్-1 పరీక్షలు రద్దు అయ్యాయని, వెంటనే టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేసి గ్రూప్-1 అభ్యర్థులందరికీ కూడా లక్ష రూపాయల నష్టపరిహారాన్ని ఇవ్వాలని భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డివైఎఫ్ఐ) జిల్లా అధ్యక్షుడు కొంటు సాగర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా టీఎస్‌పీఎస్సీ బోర్డును వెంటనే ప్రక్షాళన చేయాలని రామగుండం కార్పొరేషన్ ఈస్ట్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈస్ట్ ఏరియా కమిటీ కన్వీనర్ చంద్రగిరి కష్ణకుమార్, కో కన్వీనర్ మొగిలిచర్ల సురేష్, నాయకులు శివ కుమార్, రాజ్ కుమార్, ఉమెన్స్ కన్వినింగ్ కమిటీ సభ్యులు కల్పన, లావణ్య, హమీదా, సంధ్యారాణి, కావ్య పాల్గొన్నారు.

గణనాథులను దర్శించుకున్న మక్కాన్‌సింగ్

నవతెలంగాణ-గోదావరిఖని: రామగుండం కార్పొరేషన్ 11వ డివిజన్‌లోని పలు ఏరియాల్లో ఏర్పాటు చేసిన గణనాథులను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సంజయ్ నగర్‌లో కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్వి ప్రకాష్ ఆధ్వర్యంలో సంజయ్ యూత్ గణేష్ మండపాల్లో ప్రత్యేక పూజలు చేసి, అన్నదాత కొమురవెల్లి శ్రీనివాస్ నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఎస్సీ సెల్ కార్పొరేషన్ అధ్యక్షులు తలపల్లి యుగంధర్, డివిజన్ అధ్యక్షుడు గుడి కందుల రవి, కాంగ్రెస్ నాయకులు తిప్పారపు శ్రీను,స్వాతి, రవికిరణ్ పాల్గొన్నారు.


అన్నదానం ప్రారంభిస్తున్న మక్కాన్‌సింగ్

కార్పొరేషన్‌కు రూ.50 కోట్ల నిధులు మంజూరు

నవతెలంగాణ-గోదావరిఖని: రామగుండం కార్పొరేషన్‌కు మరో 50 కోట్ల నిధులను మాంజూరుతో మెత్తం 100 కోట్ల నిధుల మాంజూరు చేయించడంలో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సఫలీకృతం అయ్యారు. గత మే నెల 8వ తేదిన రామగుండం నవ నిర్మాణ సభకు గోదావరిఖనికి విచ్చేసిన రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌ను రామగుండం కార్పొరేషన్‌కు 100 కోట్లు నిధులు కేటాయించాలని విన్నవించారు. మంత్రి రామగుండం కార్పోరేషన్ 100 కోట్ల నిధులు మాంజూరు చేస్తానని హామి ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే చందర్ మంత్రి కేటీఆర్‌ను హైదరాబాద్‌లో కలిసి నిధుల మాంజూరు విషయమై చర్చించారు. ఈ క్రమంలో రామగుండం అభివద్ధి పనుల కోసం రాష్ట్ర పురపాలక మంత్రి కేటీఆర్ టీయుఎఫ్ఐసీడీ ద్వారా నిధులు మాంజూరు చేశారు.


మంత్రి కేటీఆర్‌తో ఎమ్మెల్యే

గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్

నవతెలంగాణ-గోదావరిఖని: సింగరేణి ఆర్‌సీఓఏ క్లబ్‌లో ఆర్జీ-1 ఏరియాలోని జడీకే-1, 2అండ్2ఎ, 11వ గనులకు, ఓసీపీ-5, తదితర గనులు, డిపార్ట్‌మెంట్‌లకు సంబంధించిన 199 మంది గైర్హాజరు ఉద్యోగులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్‌వికె.శ్రీనివాస్, ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ హాజరై కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో యస్ఓటు జీయం రాం మోహన్, ఏజీయం పర్సనల్ లక్ష్మీనారాయణ, యూనియన్ నాయకులు గండ్ర దామోదర్ రావు టీబీజీకెయస్, రంగు శ్రీను ఏఐటీయూసీ, సాగర్ ఐఎన్టీయూసీ, మెండే శ్రీనివాస్ సీఐటీయూ, ఆకుల హరిణ్ బిఎంఎస్, రవీందర్ టీఎన్టీయూసీ, రాజు ఎస్టీఎస్టీయుసీ, డీవైసీఎంఓ కిరణ్ రాజ్ కుమార్ తదితరులున్నారు.

ఓసీపీ-5ని సందర్శించిన సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్స్

నవతెలంగాణ-గోదావరిఖని: సింగరేణి ఆర్జీ-1 పరిధిలోని ఓసీపీ-5ని సంస్థ డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్‌వికె శ్రీనివాస్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రాజెక్ట్‌కు సంబందించిన వ్యు పాయింట్ దగ్గర మ్యాప్ లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-1 ఏరియా జీఎం చింతల శ్రీనివాస్, ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.చంద్రశేఖర్, ప్రాజెక్ట్ ఇంజనీర్ ఎన్వీ రావు, మెనేజర్ అనిల్ గబాలే, సర్వేయర్ అశోక్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి ఉన్నారు.

నేషనల్ సెమినార్‌ను జయప్రదం చేయండి

నవతెలంగాణ-గోదావరిఖని: ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఎఐఎల్‌యు) ఆధ్వర్యంలో అక్టోబర్ 1న హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య కళా నిలయంలో జరిగే కాన్స్టిట్యూషన్ అండ్ వి ద పీపుల్ నేషనల్ సెమినార్ సుందరయ్యను గోదావరిఖని న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి చందాల శైలజ పిలుపునిచ్చారు. ఈ మేరకు గోదావరిఖని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో ఆమె చేతుల మీదుగా మంగళవారం సెమినార్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోషిక ప్రకాష్, ఎరుకల ప్రదీప్ కుమార్, బాసా అనురాధా, రామటెంకి శ్రీనివాస్, సాన మురళీ, షానవాజ్, ప్రసన్న, రేష్మ ఉన్నారు.

మహిళా చైతన్యానికి ప్రతీక ఐలమ్మ...

జూబ్లీ నగర్‌లో చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణలో మంత్రి గంగుల




నవతెలంగాణ - కొత్తపల్లి : సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ తెలంగాణ తెగువకు నిదర్శనమని, మహిళా చైతన్యానికి ప్రతీక అని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ రూరల్ మండలంలోని జూబ్లీ నగర్ లో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ గారు ఆవిష్కరించి మాట్లాడారు. మాటల్ని తూటాలుగా మలిచి.. దోపిడీదారుల గుండెల్లో ఫిరంగిగా పేలిన తెలంగాణ రైతాంగ విప్లవాగ్ని చాకలి ఐలమ్మ జీవితం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమైందన్నారు. ఐలమ్మ జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ఆమె చేసిన పోరాటానికి నిజమైన నివాళి అన్నారు. తెలంగాణ మట్టిలోనే పోరాటం ఉందని, అందుకు చాకలి ఐలమ్మ జీవితం గొప్ప సందేశమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, పాక్స్ చైర్మన్ పెండ్యాల శ్యామ్ సుందర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, సర్పంచ్ రుద్ర భారతి- రాము, సుంకి శాల సంపత్ రావు, దబ్బేట రమణ రెడ్డి, ఎంపీటీసీ బుర్ర తిరుపతి, నందయ్య, భోగొండ ఐలయ్య, రజక సంఘం నాయకులు గంగాధర లస్మయ్య, పూసల శ్రీకాంత్, నేరెళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయము చేస్తున్న పల్లె సుజాత ప్రభాకర్ గౌడ్

నవతెలంగాణ - జమ్మికుంట : మండలంలోని కోరపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన వడ్లకొండ మల్లయ్య గౌడ్ కుటుంబానికి పిఎంకె ఫౌండేషన్ వ్యవస్థాపకులు పల్లె సుజాత ప్రభాకర్ గౌడ్ రూ.5వేలు ఆర్థిక సాయంతో పాటు 50కిలోల బియ్యాన్ని మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఎంకే ఫౌండేషన్ నిర్వాహకులు పల్లె రవి గౌడ్, గండి రంజిత్ గౌడ్, గిరవేన రాజయ్య తాటిగంటి వీరస్వామి, గిరవేన బుచ్చయ్య పాల్గొన్నారు.

అయ్యప్ప టెంపుల్‌లో సినీ నటుడు సుమన్ ప్రత్యేక పూజలు




నవతెలంగాణ - జమ్మికుంట : అమ్మ ప్రొడక్షన్ బ్యానర్‌పై చిత్ర షూటింగ్లో పాల్గొనడానికి జమ్మికుంటకు వచ్చిన సినీ నటుడు సుమన్ స్థానిక అయ్యప్ప దేవాలయంలో ప్రత్యేక పూజలు మంగళవారం నిర్వహించారు. దేవాలయ కమిటీ శాలువాతో ఆయనను ఘనంగా సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు వైస్ చైర్మన్ దేశిని స్వప్నకోటి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో పర్లపెల్లి రమేష్, సిరిమల్లె జయేందర్, సామల ప్రతాపరెడ్డి, సరిత మల్లారెడ్డి పాల్గొన్నారు.

30న 'ఆర్యవైశ్య' చలో హైదరాబాద్

నవతెలంగాణ - జమ్మికుంట : ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు చెందరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటినుండి ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో నేటికీ వెనుకబడి ఉన్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలుమార్లు ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినా నేటికీ ఆచరణ సాధ్యం కాలేదని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని ఎన్ని మార్లు ఆర్యవైశ్య మహాసభ తరపున కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరినా కనీస స్పందన కొరవడిందని తెలిపారు. అందుకే ఈనెల 30న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టి, ఇందిరాపార్క్ వద్ద ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధన దీక్ష చేపడుతున్నట్టు తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మండల వైద్యాధికారి డాక్టర్ రమాదేవి



నవతెలంగాణ - చొప్పదండి : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చొప్పదండి మండల వైద్యాధికారి డాక్టర్ రమాదేవి మున్సిపల్ సిబ్బందికి సూచించారు. చొప్పదండి పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ పి.శాంతి కుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బందికి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చొప్పదండి మండల వైద్యాధికారి డాక్టర్ రమాదేవి పారిశుధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

శానిటేషన్ వర్కర్స్ కోసం హెల్త్ క్యాంప్


హెల్త్ క్యాంప్లో పాల్గొన్న చైర్మెన్ రుద్రరాజు

నవతెలంగాణ - కొత్తపల్లి : స్వేచ్ఛ సర్వెక్షన్ 2.0 స్వచ్ఛత హీ సేవాలో భాగంగా కొత్తపల్లి మున్సిపాలిటీ ఆఫీస్‌లో మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు అధ్యక్షతన శానిటేషన్ వర్కర్స్‌కు హెల్త్ క్యాంప్ నిర్వహించి, శానిటేషన్ వర్కర్స్ యొక్క ఆరోగ్య వివరాలని నమోదు చేసి వారికి కావాల్సిన మందులని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వేణుమాధవ్, పీహెచ్‌సీ డాక్టర్ వంశీకృష్ణ, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛత తోనే స్వస్థత

- జిల్లా కలెక్టర్ డాక్టర్ బి గోపి...
- ఎలగందల ఖిల్లాలో శ్రమదానం


మొక్కలకు నీరు పోస్తున్న జిల్లా కలెక్టర్ బి. గోపి

నవతెలంగాణ - కొత్తపల్లి : స్వచ్ఛత తోనే స్వస్థత చేకూరుతుందని, అందుకే ప్రతి ఒక్కరు స్వచ్ఛతను తమ సొంతం చేసుకొని నిరంతరం పాటించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్.బి.గోపి పిలుపునిచ్చారు. స్వచ్ఛ హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొత్తపల్లి మండలంలోని ఎలగందల్ గ్రామంలోని "ఎలగందుల చారిత్రక కట్టడం" ఖిల ఆవరణలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ప్రఫుల్ దేశాయితో కలిసి శ్రమదానం, మానవహారం, ప్రతిజ్ఞ, ర్యాలీ కార్యక్రమాలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున హాజరైన మహిళలు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు, గ్రామ, మండల, జిల్లా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛత హీ సేవ లాంటి కార్యక్రమాల ద్వారా ప్రతి ఒక్కరు స్వచ్ఛతపై అవగాహన పెంచుకొని, ప్రతినిత్యం పాటించాలని సూచించారు. ఎలగందల్ లో ఆదర్శంగా చేపట్టిన బృహత్ పల్లె ప్రకృతి వనాలు, సంపద వనాలు జిల్లాకి ఆదర్శమని కొనియాడారు. పచ్చదనం పై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్, సేంద్రియ ఎరువును పరిశీలించి, పల్లె ప్రకృతి వనంలో చేసిన పనులను పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ ఖిల్లా పైకి ఎక్కి వివిధ స్థలాలను పరిశీలించారు. ఇక్కడ గతంలో ఉన్న లైటింగ్, మ్యూజిక్, వివిధ అభివృద్ధి పనులను పరిశీలించి పునరుద్ధరణకు తగు చర్యలను తీసుకుంటామన్నారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ చెత్త రహిత భారత్ సందేశంతో సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 2, గాంధీ జయంతి వరకు నిర్వహించే "స్వచ్ఛత హీ సేవలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని అన్నారు. డిఆర్‌డిఓ శ్రీలత మాట్లాడుతూ తడి, పొడి చెత్తను ఇంటి వద్దనే వేరుచేసి, గ్రామపంచాయతీ ట్రాక్టర్‌కు అందజేయాలని, చెత్తను బయట పడవేసి, మన వల్ల ఇతరులకు నష్టం జరిగేలా ఉండకూడదని సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య మాట్లాడుతూ స్వచ్ఛత మనందరి బాధ్యత అని ఇది నిరంతరం కొనసాగాలన్నారు. జడ్పీ సీఈవో పవన్ కుమార్, జిల్లా టూరిజం అధికారి వెంకటేశ్వర్‌రావు ఖిల్లా విశిష్టత వివరించారు. ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎద్దండి షర్మిల- ప్రకాష్, ఎంపీటీసీ మంద రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రోడ్డవేణి మధు, అదనపు డి ఆర్ డి ఓ లు సంధ్యారాణి, వెంకటేశ్వర్లు, డీపీఎం లు రమణ, ప్రవీణ్, శ్రీనివాస్, స్వచ్ఛభారత్ - యూనిసెఫ్ టీం సభ్యులు కిషన్ స్వామి, రమేష్, వేణు ప్రసాద్, కళ్యాణి, రవీందర్, వెంకటేష్, ఎంపీవో శ్రీనివాస్, ఉపసర్పంచ్ బోనాల నరేష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


మహిళా రిజర్వేషన్లపై మోడీ మోసం

- మహిళా రిజర్వేషన్లు వాటాను తేల్చాలి
- బీసీల జనాభా లెక్కలను వెంటనే చేపట్టాలి
- ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం
- నవంబర్ 4న కరీంనగర్ లో ప్రజాగర్జన బహిరంగసభ
- అక్టోబర్ 3న సన్నాహక సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం

నవతెలంగాణ - కరీంనగర్ : మహిళ రిజర్వేషన్ల విషయంలో ప్రధాని మోదీ మోసం చేశారని ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం ఆరోపించారు. మంగళవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కుల సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ అమలు చేయడాన్ని దేశంలోని మహిళలు హర్షిస్తున్నాప్పటికి, రిజర్వేషన్లలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళల వాటాలు తేల్చాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల స్పష్టత ఇవ్వకుండా కుట్ర పన్నుతున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్రలను బయటపెట్టడానికే ప్రజాగర్జన పేర భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చట్టసభల్లో మూడోవంతు మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద చేపట్టిన ధర్నా ఫలితంగానే బీజేపి పార్లమెంట్‌లో మహిళ రిజరేషన్లు బిల్లును అమోదించారని తెలిపారు. దేశ జనాభాలో 50శాతానికి పైగా ఉన్న బీసీల లెక్కలు ఇప్పటి వరకు బీజేపి తేల్చలేదన్నారు. బీసీల అభివృద్ధితోనే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. జనాభా లెక్కలు తీసే సమయంలోనే బీసీల కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. చట్టసభల్లో బీసీలకు సైతం యాభైశాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిన అవశ్యకత ఉందన్నారు. మహిళలకు రిజర్వేషన్లుపై స్పష్టత ఇవ్వాలని, అలాగే బీసీ జనాభా లెక్కలను తేల్చి రిజర్వేషన్లు అమలు చేయలన్నారు. లేనిపక్షంలో బహిరంగ సభ అనంతరం ఛలో ఢిల్లీ కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. అక్టోబర్ 3న ప్రజాగర్జన పేర నిర్వహించే బహిరంగ సభ సన్నాహక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబర్ 4న నిర్వహించే ప్రజాగర్జన సభకు దేశంలోని మహిళా ఎంపీలు, మహిళా నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఉమ్మడిజిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీకుల ప్రతినిధులు పెద్దఎత్తున జనాన్ని సమీకరించి బహిరంగ సభను జయప్రదం చేయలన్నారు. ఈ సమావేశంలో పలు సంఘాల నాయకులు జీఎస్ ఆనంద్, సముద్రాల అజయ్, శ్రీనివాసరెడ్డి, జక్కుల నర్సయ్య, లత, జయరాజ్, కేదాసి మల్లయ్య, చిందం మల్లయ్య, కుతాడి శివరాజ్, గొర్రె రాజయ్య పాల్గొన్నారు.

తెలంగాణ వీరనారి
చాకలి ఐలమ్మ జయంతి



నవతెలంగాణ - గన్నేరువరం : ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కషి చేయాలని తహసీల్దార్ మామిడాల బిక్షపతి అన్నారు. మండల కేంద్రంతోపాటు ఖాసిం పేట గ్రామంలో చిట్యాల ఐలమ్మ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక రజక సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి కేకు కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పుల్లెల లక్ష్మీ లక్ష్మణ్ , తహసిల్దార్ మామిడాల బిక్షపతి, ఎస్సై చందా నరసింహారావు, వైస్ ఎంపీపీ న్యాత స్వప్న సుధాకర్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు గంప వెంకన్న, ఉప సర్పంచ్ బూర వెంకటేశ్వర్, రజక సంఘం మండల గ్రామ శాఖ అధ్యక్షులు మునిగంటి, నాగరాజు, మల్లయ్య, సలహా దారు మునిగంటి మొండయ్య మండల ప్రదాన కార్యదర్శి ఓరుగంటి సంపత్, మునిగంటి కనుకయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కొట్టే భూమయ్య, జాలి లింగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


గన్నేరువరం: కేకు కోస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు


శంకరపట్నంలో...


చొప్పదండి : పూలమాలలు వేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ


మానకొండూర్: నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

నవతెలంగాణ - సైదాపూర్ : మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా పూల మాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. సింగి ల్ విండో చైర్మన్ కొత్త తిరుప తి రెడ్డి, బీఆర్ ఎస్ మండల ప్రెసిడెంట్ రాజయ్య, సింగిల్ విండో డైరెక్టర్ బొమ్మగాని రాజు, నవీన్ గౌడ్, బిఆర్ ఎస్ గ్రామ అధ్యక్షులు పూసాల అశోక్, మాజీ ఉపసర్పంచ్ రాజు పాల్గొన్నారు.

నవతెలంగాణ - శంకరపట్నం : చాకలి ఐలమ్మను మహిళా లోకం, యువత స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని శంకరపట్నం జెడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం శంకరపట్నం మండల కేంద్రంలోని వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను రజక సంఘం మండల అధ్యక్షుడు తాడిచర్ల తిరుపతి అధ్యక్షతన, కేశవపట్నం బస్టాండ్ ఎదురుగా ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. మొలంగూర్ క్రాస్ రోడ్డు కేశవపట్నం శివారులో గల శ్రీ మల్లేశ్వర కమ్యూనిటీ భవనం, దేవాలయం వద్ద మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కోండ్ర రాజయ్య, దాసారాపు భద్రయ్య, ఎంపీటీసీ జంగిలి సంపత్, హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చౌడమల్ల వీరస్వామి, నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - చొప్పదండి : చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను చొప్పదండి పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ, మండలంలోని కొలిమికుంట గ్రామంలోని మడేలయ్య గుడి వద్ద బూత్కూరి కిరణ్ ఆధ్వర్యంలో సర్పంచ్ తాళ్లపల్లి సుజాత శ్రీనివాస్ గౌడ్‌లు ఆమె చిత్రపటానికి పూలమాల ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి శాంతి కుమార్, కౌన్సిలర్లు మాడురి శ్రీనివాస్, కొత్తూరి మహేష్, మేనేజర్ డి ప్రశాంత్ కుమార్, జూనియర్ అసిస్టెంట్‌లు శ్రీధర్ రెడ్డి, సుధాకర్, రాజయ్య లలిత, శివాని, మల్లేశం, కృష్ణ, సెక్రటరీ ప్రవళిక, పాల్గొన్నారు.

నవతెలంగాణ - మానకొండూర్ : చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం మండల కమిటీ అధ్వర్యంలో మానకొండూర్ మండలకేంద్రంలో మంగళ వారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆ సంఘం మానకొండూరు మండల అధ్యక్షులు ముక్కెర సతీష్ కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శులు నడి గొట్టు శంకర్, బొడ్డు నరేష్, బొడ్డు ఐలయ్య, కోశాధికారి వేల్పుగొండ సంపత్, ప్రధాన కార్యదర్శి తిరుపతి, చేర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నవతెలంగాణ - ఇల్లందకుంట : ఇల్లందకుంట మండల కేంద్రంలో రజక సంఘం నాయకులు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ పాడి కౌశిక్ రెడ్డి సతీమణి శాలిని రెడ్డి పాల్గొని ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి, కేక్ కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ సారిగొమ్ముల పావని వెంకటేష్, రజక సంఘం మండల అధ్యక్షులు రావు ఎల్లయ్య, రజక సంఘం నాయకులు, టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ తిమ్మాపూర్ : తిమ్మాపూర్ మండలం 8వ డివిజన్ అల్గునూర్‌లో గ్రామ అధ్యక్షులు తోర్తి సతయ్య ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ సింగిరెడ్డి స్వామి రెడ్డి, బి.ఆర్.ఎస్ నాయకులు సల్ల రవీందర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు లక్ష్మి నారాయణ రెడ్డి, గోపు మల్లారెడ్డి, కాల్వ మల్లేశం, పున్నం అశోక్, తోర్తి భగవాన్, తోర్తి సంతోష్, తోర్తి అరవింద్, తొర్తి శ్రీనివాస్, పున్నం రాజశేఖర్, అంజనేయులు పాల్గొన్నారు. మన్నేంపల్లి గ్రామ రజక సంఘం అధ్యక్షులు పోతుగంటి సంపత్ అధ్యర్వంలో ఐలమ్మ జయంతి నిర్వహించారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పొన్నం అనిల్ గౌడ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - కొత్తపల్లి : కొత్తపల్లి పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో చాకలి ఐలమ్మ జయంతిలి ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు ఐలమ్మ రాజుచిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కట్ల వేణుమాధవ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, రజక సంఘం నాయకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-హుజురాబాద్ : ఐలమ్మ ధీరత్వాన్ని యువతరం స్ఫూర్తిగా తీసుకోవాలని హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గంధ రాధిక అన్నారు. మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఐలమ్మ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జయంత్యుత్సవ కమిటీ కో కన్వీనర్ నిమ్మటూరు సాయి కృష్ణ మున్సిపల్ వాయిస్ చైర్ పర్సన్ కొలపాక నిర్మల, తహసీల్దార్ విజయ్ కుమార్, పట్టణ సీఐ బొల్లం రమేష్, కౌన్సిలర్లు పాల్గొన్నారు


ఇల్లందకుంట: కేక్ కట్ చేస్తున్న రజక సంఘం నాయకులు


తిమ్మాపూర్ : నివాళులర్పిస్తున్న నాయకులు


కొత్తపల్లి : నివాళి అర్పిస్తున్న చైర్మెన్ రుద్రరాజు


హుజురాబాద్‌లో....


బాలల హక్కులకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ ధనలక్ష్మి


మాట్లాడుతున్న ధనలక్ష్మి

నవతెలంగాణ - తిమ్మాపూర్ : చిన్నపిల్లలతో పనులు చేయించడం, వారిని పట్టుకొని బిక్షాటన చేయడం లాంటి పనులు చేయిస్తూ బాలల హక్కులకు భంగం కలిగించే వారిపై చట్ట రిత్యా కఠిన చర్యలుంటాయాని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ శ్రీరామోజు ధనలక్ష్మి జిల్లా సంక్షేమ సరస్వతితో కలిసి పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రామక్రిష్ణకాలనీకి చెందిన బేడబుడగ జంగాల కుటుంబాలకు చెందిన వారు బతుకుదెరువు కోసం కలకత్తాకు వెళ్తుంటారు. ఈ క్రమంలో కలకత్తా నగరంలో చంకలో పిల్లలతో బిక్షాటన చేస్తుండగా అక్కడి చైల్డ్ వెల్ఫేర్ అధికారులు వారిని రెస్క్యూ హోమ్‌కు తరలించగా విషయం తెలుసుకున్న వారి సంబంధీకులు రామక్రిష్ణకాలనీలోని న్యాయవాది సుగుర్తి జగదీశ్వరాచారిని కలవగా పిల్లల విషయంపై కరీంనగర్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయంపై 1098 కో-ఆర్డినేటర్ ఆవుల సంపత్ ద్వారా గ్రామంలో ఆయా పిల్లల తల్లిదండ్రుల వివరాలు సేకరించి కలకత్తా అధికారులకు వివరించి వారిని విడుదల చేయించారు. కాగా మంగళవారం వారంతా కరీంనగర్‌లోని కార్యాలయానికి చేరుకోగా జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డీసీపీఓ శాంత, కమిటీ సభ్యులు రెండ్ల కళింగ శేఖర్, బొల్లం రాధ, అర్చనరెడ్డి వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. మరొక్కసారి ఇలా జరిగితే కఠిన చర్యలుంటాయాని వారితో పాటుగా వచ్చిన సంఘం పెద్దమనుషులు రెవెల్లి సమ్మయ్య, బోడపుర్తి సమ్మయ్య కిన్నెర ముత్తిలింగం, కిన్నెర అంజి,పస్తం రాజుల సమక్షంలో పిల్లల తల్లిదండ్రులను హెచ్చరించారు.

8వ రోజుకు మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె


నిరసన తెలుపుతున్న కార్మికులు

నవతెలంగాణ - సైదాపూర్ : మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెలో 8వ రోజుకు చేరింది. మంగళవారం మండల కేంద్రం లోని మండల రిసోర్స్ సెంటర్ ఎదుట శిబిరంలో కార్మికులు పాల్గొని నిరసన తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సమ్మయ్య, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి లచ్చవ్వ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేదంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీలత, తిప్పని నిర్మల,కండే రాజవ్వ, తిరుమల, యశోద, కనకవ్వ, సరోజన పాల్గొన్నారు.

చొప్పదండి సింగిల్ విండోకు అవార్డు


అవార్డును అందుకుంటున్న చొప్పదండి సింగిల్ విండోచైర్మన్, సీఈవో, మల్లా రెడ్డి, తిరుపతి రెడ్డిలు

నవతెలంగాణ - చొప్పదండి : దేశంలోని 95వేలకు పైగా ఉన్న సహకార సంఘాలలో కెల్లా 2021-22 సంవత్సరానికి గాను నాఫ్‌స్కాబ్ శుభాష్ యాదవ్ బెస్ట్ పెర్ఫామెన్స్ అవార్డుకు చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎంపికైంది. రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో ఆశ్రంమార్గ్ జిల్లాలోని జైపూర్ మర్రియోట్ హొటల్లో మంగళవారం జరిగిన సమావేశంలో జాతీయస్థాయిలో నాఫ్‌స్కాబ్ సుభాష్ యాదవ్ బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డును రాజస్థాన్ ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రటరీ శ్రేయ గుహ ఐఎఎస్ చేతుల మీదుగా, చొప్పదండి సింగిల్ విండో నుంచి సింగిల్ విండో చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, సీఈవో కళ్లెం తిరుపతిరెడ్డి అందుకున్నారు. కార్యక్రమంలో రాజస్థాన్ స్టేట్ కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్, నాఫ్‌స్కాబ్ చైర్మెన్ కొండూరి రవీందర్ రావు, మంగీలాల్ దాగా సీనియర్ కో ఆపరేటర్, లాల్ చం చంద్ కటారియా మినిస్ట్రీ అగ్రికల్చర్ కేడీసీసీ సీఈవో సత్యనారాయణ రావు, కేడీసీసీ బ్యాంకు ఉపాధ్యక్షులు పింగళి రమేష్ పాల్గొన్నారు.


యాదవ సంఘం పాత కమిటీలు కొనసాగుతాయి

అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ యాదవ్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు

నవతెలంగాణ - ఇల్లందకుంట : అఖిలభారత యాదవ మహాసభ హుజురాబాద్ నియోజకవర్గస్థాయి సమావేశం ఇల్లందకుంట మండల కేంద్రం లోని సీతారామ కళ్యాణ మండపంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షులు నగరపు సత్యనారాయణ యాదవ్ సీతారామ చంద్రస్వామి ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పాత్రికేయుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి భాష బోయిన మల్లేష్ యాదవ్, ఇల్లందకుంట మండల అధ్యక్షులు గడ్డి రాములు యాదవ్, హుజురాబాద్ మండల అధ్యక్షులు బద్దుల రాజకుమార్ యాదవ్, జమ్మికుంట మండల అధ్యక్షులు గిరవేణి శ్రీనివాస్ యాదవ్, వీరవంక మండల అధ్యక్షులు మర్రి స్వామి యాదవ్, యాదవ సంఘం నాయకులు బెల్లి రాజయ్య, నన్నే బోయినరవి యాదవ్ పాల్గొన్నారు.


కరాటేలో అక్షర స్కూల్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో ఎస్ఐ తోట తిరుపతి

నవతెలంగాణ - రామడుగు : కరాటేలో అక్షర స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు స్కూల్ కరస్పాండెంట్ మినుకుల మునిందర్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీన సిద్దిపేటలో జరిగిన నేషనల్ షోటోఖాన్ కరాటే టీ.హెచ్.ఆర్.కప్ 2023 పోటీల్లో భాగంగా వెపన్ కటాస్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆరు రాష్ట్రాలనుండి సుమారుగా 1200మంది విద్యార్థులు పాల్గొన్నారు. కాగా మండలంలోని గుండి గోపాలరావుపేటలోని అక్షర ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి పథకాలు సాధించారు. వెపన్ కటా(నాన్చాక్)అండర్ 14విభాగంలో పి.లాస్యపి.శివచరణ్ లు గోల్డ్ మెడల్ సాధించారు.ఇ.హర్షిత, ఎల్ శ్రీమాన్ తేజ, వి.వివేక్, హర్షవర్ధన్‌లు సొల్వర్ మెడల్ సాధించారు.కటా అండర్ 14విభాగంలో జి.వెన్నెల, టి.సాత్విక, శివకుమార్, శశివర్ధన్, సౌమ్య గోల్ మెడల్ సాధించారు. పి.నవ్య, శివబందు, వర్షిత సిల్వర్ మెడల్ సాధించారు. స్నేహిక, మల్లికార్జున్‌లు బ్రోంజ్ మెడల్ సాధించారు. పథకాలు సాధించిన విద్యార్థులు జనవరి 24నుండి28వరకు గోవాలో జరిగే జపనీస్ ఇంటర్నేషనల్ ట్రైనింగ్ ఈవెంట్ పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు.ఈ మేరకు కరాటేలో గెలుపొందిన విద్యార్థులకు స్థానిక ఎస్ఐ తోట తిరుపతి చేతుల మీదుగా ట్రోఫీ,మెడల్స్ ను అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మినుకుల రాధ,కరాటే మాస్టర్ సుంకె రాం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలు పోషక ఆహారాన్ని తీసుకోవాలి

- చొప్పదండి మున్సిపల్ కమిషనర్ పి.శాంతి కుమార్


ఆర్పీలకు సూచిస్తున్న మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్

నవతెలంగాణ-చొప్పదండి : మహిళలు అన్ని రకాల పోషకాలతో కూడిన మంచి ఆహారాన్ని తీసుకోవాలని చొప్పదండి మున్సిపల్ కమిషనర్ పి.శాంతి కుమార్ సూచించారు. చొప్పదండి పట్టణంలో పురపాలక సంఘం కార్యాలయంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ దుర్గ భవాని పట్టణ సమైక్య ఆధ్వర్యంలో మెప్మా డిఎంసీ శ్రీవాణి, ఏడీఎంసీ మానసలు, మహిళలకు పోషణ్ మహా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.శాంతి కుమార్ పాల్గొని మాట్లాడుతూ పౌష్టికాహారం, ఆకుకూరలు, ప్రోటీన్లు తదితర ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు. అంతకుముందు స్వచ్ఛతాహి సేవ పరిసరాల పరిశుభ్రతపై మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ క్లీనింగ్ కార్యక్రమాన్ని నాలుగో వార్డ్ లో నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రశాంత్ కుమార్, అధికారి గట్టయ్య, ప్రసాద్, సూపర్వైజర్ సులోచన, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శివాని, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

నవతెలంగాణ - హుజురాబాద్ : నేడు హుజురాబాద్ పట్టణంలో నిర్వహించే వినాయక నిమజ్జన కార్యక్రమ ఏర్పాట్లను మంగళవారం హుజురాబాద్ పట్టణంలోని ఎస్సారెస్పీ కెనాల్ వద్ద అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా హుజురాబాద్ ఏసీపీ ఎల్ జీవన్ రెడ్డి నిమజ్జన ప్రదేశాన్ని నిమజ్జనం కోసం జరుగుతున్న ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకుని పలు సలహాలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక వైస్ చైర్పర్సన్ కొలిపాక నిర్మల, హుజురాబాద్ తహసీల్దార్ కె.విజయ్ కుమార్, పట్టణ సీఐ బొల్లం రమేష్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

బిజినెస్

ఖాతాదారుల అవసరాలే ముఖ్యం

- బ్యాంక్ ఉద్యోగుల తొలి కర్తవ్యం అదే..
- లక్ష్యాలు కాదు : ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ వెల్లడి



ముంబయి : ఖాతాదారుల ఆర్థిక అవసరాలను తీర్చడమే బ్యాంక్ ఉద్యోగుల ప్రాథమిక బాధ్యత అని ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్ జె అన్నారు. ఆ తర్వాతే లక్ష్యాలపై దృష్టి సారించాలన్నారు. ఖాతాదారుల ఫిర్యాదులపై మంగళవారం ప్రధాన బ్యాంక్‌ల ఉన్నతాధికారులతో స్వామినాథన్ మాట్లాడుతూ.. ఉత్పత్తి అనుకూలతపై బ్యాంక్‌లు ఓ విధానాన్ని కలిగి ఉండాలని సూచించారు. 'బ్యాంకులు వాణిజ్య సంస్థలు అయినందున లక్ష్యంతో నడపబడటంలో తప్పు లేదు. కానీ.. ఖాతాదారుల ఆర్థిక అవసరాలను తీర్చడమే తమ ప్రాథమిక బాధ్యత అని ఉద్యోగులు అర్థం చేసుకోవాలి. కేవలం అమ్మకాలు చేయడం కంటే నాణ్యమైన ఆర్థిక సలహాలు, సేవలను అందించినందుకు ఉద్యోగులకు రివార్డ్‌లు ఇచ్చే స్పష్టమైన, పారదర్శక ప్రోత్సాహక నిర్మాణం ఉండాలి. ఇందుకోసం ప్రతీ ఆర్థిక సంస్థ ఒక ప్రత్యేక విధానాన్ని కలిగి ఉండాలి. ఫిన్‌టెక్ భాగస్వామ్యంతో ఏదైనా ఉత్పత్తి లేదా సేవను అందించినప్పుడల్లా బ్యాంకులు తగిన పర్యవేక్షణ కలిగి ఉండాలి. బ్యాంకులు ఫిన్‌టెక్‌ని ఒక అవకాశంగా చూడాలి తప్పా ముప్పుగా భావించకూడదు." అని స్వామినాథన్ అన్నారు. సమస్యలు, పిర్యాధుల పరిష్కారంలో బ్యాంక్‌లు విఫలమైతే.. లేదా నిజాలను దాచి పెడితే ఆర్బీఐ కఠిన చర్యలు తీసుకుంటుందని ఆయన హెచ్చరించారు. ఫిర్యాదు మూలకారణాన్ని పరిష్కరించడం, ఫిర్యాదులను బాధ్యతాయుతంగా నిర్వహించడం, సైబర్ క్రైమ్‌ను ఎదుర్కోవడం వంటి కీలక రంగాలపై బ్యాంకులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్వామినాథన్ అన్నారు బ్యాంకు ఉద్యోగులు దురుసుగా ప్రవర్తించకుండా జాగ్రత్త వహించాలన్నారు.

రూ.150 తగ్గిన బంగారం

న్యూఢిల్లీ : అంతర్జాతీయ పరిణామాలతో బంగారం ధరల్లో స్వల్ప తగ్గుదల చోటు చేసుకుంది. మంగళవారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.150 పెరిగి రూ.59,900గా నమోదయ్యింది. కిలో వెండిపై రూ.850 తగ్గి రూ.74,500గా పలికిందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ వెల్లడించింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక్క ఔన్స్ పసిడి ధర 1,912 డాలర్లుగా, వెండి ధర 23.05 డాలర్లుగా చోటు చేసుకుంది.

బంధన్ ఎంఎఫ్ నుంచి రిటైర్మెంట్ ఫండ్

హైదరాబాద్ : పదవీ విరమణ అనంతరం వ్యయాల లక్ష్యాలను చేరుకోవడంలో సహాయపడటానికి బంధన్ రిటైర్మెంట్ ఫండ్‌ను ప్రారంభించినట్టు బంధన్ మ్యూచువల్ ఫండ్ వెల్లడించింది. ఈ కొత్త ఫండ్ 2023 సెప్టెంబర్ 28న తెరవబడి.. అక్టోబర్ 12న ముగుస్తుందని ఆ సంస్థ సీఈఓ విశాల్ కపూర్ తెలిపారు. "అధిక ఆయుర్దాయం, పెరుగుతున్న జీవన వ్యయం, ఆరోగ్య సంరక్షణ, ద్రవ్యోల్బణం పెట్టుబడిదారుల పొదుపులను తగ్గించగలవు. పదవీ విరమణ తర్వాత అదే జీవన ప్రమాణాన్ని కొనసాగించడం తప్పనిసరి. వీటిని అధిగమించడానికి రిటైర్మెంట్ ఫండ్‌ను ఆవిష్కరించాం. పదవీ విరమణ తర్వాత ఓ పద్దతిలో నగదు ఉపసంహరణకు ఇది వీలు కల్పిస్తుంది." అని విశాల్ పేర్కొన్నారు.

సలాసర్ టెక్నో కొత్త జింక్ గాల్వనైజేషన్ ప్లాంట్ ఏర్పాటు

హైదరాబాద్ : ఇంజినీరింగ్, డిజైనింగ్ కంపెనీ సలాసర్ టెక్నో ఇంజినీరింగ్ లిమిటెడ్ 96వేల మెట్రిక్ టన్నుల వార్షిక సామర్థ్యంతో కొత్త జింక్ గాల్వనైజేషన్ ప్లాంట్‌ను విజయవంతంగా ఇన్‌స్టాల్ చేసినట్టు తెలిపింది. ఉత్తరప్రదేశ్‌లోని దౌలానాలో దీన్ని ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. "మా కొత్త జింక్ గాల్వనైజేషన్ ప్లాంట్‌ని విజయవంతంగా ఇన్‌స్టాల్ చేయడం మా ఆవిష్కరణల నిబద్ధతకు నిదర్శనం. గాల్వనైజ్డ్ ఉత్పత్తుల కోసం ఎప్పటికప్పుడు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చగల శక్తి ఉంది." అని సలాసర్ టెక్నో ఇంజినీరింగ్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శశాంక్ అగర్వాల్ పేర్కొన్నారు.


ఉజ్జీవన్ ఎస్‌ఎఫ్‌బీతో ఎస్ఎంసీ గ్లోబల్ జట్టు

న్యూఢిల్లీ : ఎస్ఎంసీ గ్లోబల్ సెక్యూరిటీస్ లిమిటెడ్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తెలిపింది. దీంతో తమ వినియోగదారులకు 3-ఇన్-1 ఖాతాలు అందించనున్నామన్నారు. తమ బ్యాంక్ వినియోగదారులకు ఆన్‌లైన్‌లో సేవింగ్స్, డీమ్యాట్, ట్రేడింగ్ సేవలు అందించనున్నామని పేర్కొంది. ప్రస్తుతం తమ బ్యాంక్‌కు 76 లక్షల మంది పైగా వినియోగదారులున్నారని వెల్లడించింది.

కిర్లోస్కర్ నుంచి కొత్త జెన్‌సెట్‌లు

పూణె : విద్యుత్ ఉపకరణాల సంస్థ కిర్లోస్కర్ ఆయిల్ ఇంజిన్స్ (కెఓఇఎల్) కొత్తగా సిపిసిబి4 ప్రమాణాలతో కూడిన జెన్‌సెట్‌లను విడుదల చేసినట్లు ప్రకటించింది. వీటితో స్థిరమైన విద్యుత్ ఉత్పత్తి, పర్యావరణ నిర్వహణ నిబద్ధతను ప్రదర్శిస్తాయని పేర్కొంది. ఇవి డీజిల్, సహజ వాయువు, బయోగ్యాస్ తదితర బహుళ ఇంధనాలతో పని చేసేలా రూపొందించబడ్డాయని ఆ సంస్థ ఎండి గౌరీ కిర్లోస్కర్ పేర్కొన్నారు. ఇవి ఐఓటి ఆధారంగా పని చేస్తాయన్నారు.

చౌమాన్ 32వ అవుట్‌లెట్ ప్రారంభం..



హైదరాబాద్: చైనీస్ రుచులను అందించే చౌమాన్ హైదరాబాద్‌లో తన తొలి అవుట్‌లెట్‌ను ప్రారంభించింది. సాంప్రదాయ చైనిస్, థాయ్ వంటకాల శ్రేణిని కలిగి ఉన్న అత్యుత్తమ ఓరియంటల్ వంటకాలతో తమ సంస్థ నూతన శిఖరాలకు చేరుకుందన్నారు. కూకట్‌పల్లిలో ఏర్పాటు చేసిన ఈ కొత్త స్టోర్‌తో దేశంలో 32వ అవుట్‌లెట్‌లకు విస్తరించినట్లయ్యిందని చౌమాన్ హాస్పిటాలిటీ ఎండి దేబాదిత్యా చౌదరీ అన్నారు. తమ సంస్థకు కోల్‌కత్తా, బెంగళూరు, ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో అవుట్‌లెట్‌లు ఉన్నాయని.. తాజాగా హైదరాబాద్‌కు విస్తరించామన్నారు.

మంజీరా మాల్ ఇక లూలూ మాల్

- నేడు ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్




హైదరాబాద్ : యూఏఈకి చెందిన ప్రముఖ రిటైలర్ లూలూ గ్రూప్ హైదరాబాద్‌లో తన తొలి మాల్‌ను ప్రారంభిస్తోంది. కూకట్‌పల్లిలోని మంజీర మాల్‌ను ఆసంస్థ కొనుగోలు చేసింది. దీన్ని రీబ్రాండింగ్ చేసింది. బుధవారం జరగనున్న ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ , లూలూ గ్రూప్ ఎండీ, చైర్మెన్ యూసుఫ్ అలీ ఎంఎ హాజరు కానున్నారు. మంజీరామాల్‌ను రూ.300 కోట్లు పెట్టుబడితో లూలూ మాల్‌గా రీబ్రాండ్ చేస్తోంది. 5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అధునాతన సదుపాయాలతో హైదరాబాద్ వాసులకు అంతర్జాతీయ షాపింగ్ అనుభవన్ని అందించనున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. ఈ మాల్‌లో వరల్డ్ క్లాస్ లూలూ హైపర్ మార్కెట్ ఉంటుంది. 75 లోకల్, ఇంటర్నేషనల్ బ్రాండ్ల స్టోర్లు ఉంటాయి. అలాగే 5 స్క్రీన్లలో సినిమాలు కూడా ప్రదర్శించనున్నారు. ఈ మాల్ ద్వారా 2,000 మందికి ఉపాధి లభించనుందని నిర్వాహక వర్గాలు పేర్కొంటున్నాయి.



ఉప్పును తినేస్తున్నారు!

దేశంలో డబ్ల్యూహెచ్ఓ సిఫారసు కంటే అధికంగా వినియోగం



న్యూఢిల్లీ: భారతీయులలో ఉప్పు వినియోగం అధికంగా ఉంటోంది. ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సిఫారసు చేసిన దాని కంటే చాలా ఎక్కువ. భారతీయ వైద్య పరిశోధనా మండలి ఇటీవల జరిపిన సర్వే ఈ విషయాన్ని బయటపెట్టింది. రోజుకు ఐదు గ్రాముల కంటే ఎక్కువ ఉప్పును వినియోగించకూడదని డబ్ల్యూహెచ్ఓ సిఫారసు చేయగా భారతీయులు ఎనిమిది గ్రాములు తీసుకుంటున్నారు. అదనపు ఉప్పు వినియోగం పురుషులలో అధికంగా ఉంటోంది. గ్రామీణ ప్రాంతాలలో దీని వాడకం మరీ ఎక్కువ. అధిక బరువున్న వారు, ఊబకాయులు ఉప్పును ఎక్కువగా వాడుతున్నారని సర్వే తెలిపింది.

ఉప్పును అధికంగా వాడడం వల్ల కలిగే అనర్థాలు, తక్కువగా వినియోగించడం వల్ల ఒనగూడే ప్రయోజనాల విషయంలో ప్రజలకు పెద్దగా అవగాహన ఉండడం లేదు. ఆహారంలో ఉప్పు వినియోగాన్ని నియంత్రించేందుకు ప్రణాళికలు రూపొందించుకొని, అమలు చేయాలని సర్వే సూచించింది. ప్రాసెస్ చేసిన ఆహారాన్ని, ఇంటి వెలుపల వండిన వంటకాల వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరం ఉంది. ఈ సర్వేలో 18-69 సంవత్సరాల మధ్య వయస్కులైన 10,659 మంది పాల్గొన్నారని అధ్యయన రచయిత, ఐసీఎంఆర్ డైరెక్టర్ ప్రశాంత్ మాథుర్ చెప్పారు.

ఉప్పు వినియోగం తగ్గిస్తే...



ఉప్పు వినియోగం ఉద్యోగులలో (8.6 గ్రాములు), పొగాకు వినియోగదారులలో (8.3 గ్రాములు) అధికంగా ఉంటోంది. అధిక రక్తపోటు ఉన్న వారు రోజుకు 8.5 గ్రాముల ఉప్పు తీసుకుంటున్నారు. ఉప్పును తగ్గించి వాడితే రక్తపోటును 25% నియంత్రించవచ్చునని, 2025 నాటికి ఉప్పును అధికంగా వాడుతున్న వారి సంఖ్యను 30% తగ్గించవచ్చునని సర్వే తెలిపింది. సర్వేలో పాల్గొన్న వారిలో సగం మంది కంటే తక్కువ మంది మాత్రమే ఆహారంలో ఉప్పు వాడకాన్ని తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

గుండె జబ్బులతో మరణాలు అధికం..

దేశంలో సంభవిస్తున్న మరణాలలో 28.1% మరణాలకు గుండె జబ్బులే కారణం. 1990లో అధిక రక్తపోటు కారణంగా 0.78 మిలియన్ల మంది చనిపోగా ఆ సంఖ్య 2016 నాటికి 1.63 మిలియన్లకు పెరిగింది. సోడియంను అధికంగా వినియోగించడం వల్ల రక్తపోటు పెరుగుతోందని, అది గుండె జబ్బులకు దారితీస్తోందని సర్వే తెలిపింది.

ఉపాధికి పెరిగిన డిమాండ్

గతేడాదితో పోలిస్తే 25.8 శాతం పెరుగుదల



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఉపాధి హామీ డిమాండ్‌లో పెరుగుదల కొనసాగుతోంది. ఆగస్టులో గత సంవత్సరంతో పోలిస్తే 25.8 శాతం పెరుగుదల నమోదు చేసుకుంది. ఏప్రిల్‌లో 2 కోట్లకు, మేలో 2.56 కోట్లకు, జూన్‌లో 3.05 కోట్లకు, జూలైలో 2.09 కోట్లకు చేరుకోవడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఐదు నెలల్లో ఉపాధి హామీ కింద పని కోసం డిమాండ్ పెరిగింది.

2022-23లో డిమాండ్ తగ్గిన తర్వాత, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) కింద 2023 ఆగస్టులో 1.73 కోట్ల కుటుంబాలు ఈ పథకాన్ని పొందడంతో మళ్లీ సంఖ్య పెరిగింది. ఉపాధి హామీ పథకం పోర్టల్‌లో అందుబాటులో ఉన్న డేటా ప్రకారం, ఈ సంవత్సరం ఆగస్టులో గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పొందిన కుటుంబాల సంఖ్య గత ఏడాది ఇదే నెలలో 1.37 కోట్లతో పోలిస్తే 25.85 శాతం ఎక్కువగా ఉంది.

కోవిడ్ మహమ్మారి సమయంలో ఈ సంఖ్య 2020 ఆగస్టులో 2 కోట్లు, 2021 ఆగస్టులో 2.11 కోట్లుగా ఉంది. అయితే, కోవిడ్-19 మహమ్మారి వ్యాప్తి చెందడానికి ముందు, ఇది చాలా తక్కువ స్థాయిలో (2019 ఆగస్టులో 1.22 కోట్లు) ఉంది. ఆగస్టు 2023లో పశ్చిమ బెంగాల్‌లో ఈ పథకం కొనసాగితే ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద పనిచేసిన కుటుంబాల సంఖ్య మరింత ఎక్కువగా ఉండేది. కేంద్రం పశ్చిమ బెంగాల్‌కు నిధుల విడుదలను నిలిపివేసింది. ఫలితంగా ఆ రాష్ట్రంలో ఉపాధి హామీ పని లేదు.

పశ్చిమ బెంగాల్ ఆగస్టు 2023లో గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేవలం 10 కుటుంబాలు మాత్రమే పొందుతున్నట్లు నివేదించింది. వాస్తవానికి, ఎన్‌ఆర్ఇజిఎస్ కింద పని కోసం డిమాండ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఐదు నెలల్లో ఎలివేట్‌గా ఉంది. ఎందుకంటే ఈ పథకాన్ని పొందుతున్న కుటుంబాల సంఖ్య ఏప్రిల్‌లో 2 కోట్లకు, మేలో 2.56 కోట్లకు, జూన్‌లో 3.05 కోట్లు, జుల్కై నెలలో 2.09 కోట్లకు చేరుకుంది.

ఉపాధి హామీ ప్రతి గ్రామీణ కుటుంబానికి ఒక ఆర్థిక సంవత్సరంలో 100 రోజుల వేతన ఉపాధికి హామీ ఇస్తుంది. కోవిడ్ -19 మహమ్మారి నేపథ్యంలో తమ గ్రామాలకు తిరిగి వచ్చిన పేద, వలస కార్మికులకు ఈ పథకం ఒక భద్రతా వలయంగా ఉద్భవించింది. 2020-21లో కోవిడ్-19 వ్యాప్తి చెందడం, ఆ తర్వాత దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ ఏర్పడడంతో, ఈ పథకాన్ని పొందుతున్న కుటుంబాల వార్షిక సంఖ్య 7.5 కోట్లకు చేరుకుంది. ఇది తరువాతి రెండేళ్లలో తగ్గింది. 2021-22లో 7.25 కోట్లు, 2022-23లో 6.18 కోట్లుగా నమోదు అయింది. అయితే, 2023-24 ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి మళ్లీ పెరగడం ప్రారంభించింది.

డ్రోన్ల ద్వారా ఉపాధి పనుల పర్యవేక్షణ సరిగాదు

- చట్టానికి నిధుల కోత, ఆన్‌లైన్ హాజరు నమోదు దుర్మార్గం : మంత్రి ఎర్రబెల్లికి వ్యవసాయ కార్మిక సంఘం నేతల వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉపాధి హామీ పనులను డ్రోన్ల ద్వారా పర్యవేక్షించాలనే గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్ణయం సరిగాదనీ, దాన్ని అమల్లోకి తీసుకురావడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు ఆ సంఘం ప్రతినిధులతో కలిసి వారు వినతిపత్రాన్ని అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి ఏటేటా నిధుల్లో కోత పెడుతూ పోతున్నదనీ, పనిప్రదేశంలో రెండు సార్లు ఫొటో క్యాప్చర్ ద్వారా ఆన్‌లైన హాజరు తీసుకుంటుందని తెలిపారు. ఆన్‌లైన్ హాజరు, ఆధార్ ప్రాతిపదికన వేతనాలు ఇవ్వడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కూలీలకు సకాలంలో కూలి అందటం లేదని తెలిపారు. ఉన్న జాబ్‌కార్డులను తొలగిస్తూ కొత్త కార్డులను ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పనులను డ్రోన్ల ద్వారా పర్యవేక్షించాలనే నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఉపాధి హామీ చట్టం రక్షణ రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. రాష్ట్ర పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

కవితకు తాత్కాలిక ఊరట

- నవంబర్ 20 వరకు ఎలాంటి సమన్లు ఇవ్వొద్దు : ఈడీకి సుప్రీం కీలక ఆదేశాలు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు లిక్కర్ స్కామ్ ఈడీ సమన్ల వ్యవహారంలో సుప్రీం కోర్టులో తాత్కాలికంగా ఊరట లభించింది. కవిత పిటిషన్ పై విచారణను నవంబర్ 20కి సర్వోన్నత న్యాయస్థానం వాయిదా వేసింది. దీంతో ఆ లోపు ఆమెకు ఎలాంటి నోటీసులు జారీ చేయొద్దని ఈడీని ఆదేశించింది. ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్ ను మంగళవారం జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఈడీ దర్యాప్తు తీరును తప్పుబడుతూ కవిత పిటిషన్ దాఖలు చేశారు. ఈడీపై గతంలో దాఖలైన అభిషేక్ బెనర్జీ, నళిని చిదంబరం కేసుతో ట్యాగ్ చేసి విచారణ కొనసాగించాలని కోరారు. గత విచారణలో ఈడీ సమన్లను కూడా కవిత తప్పుబట్టారు. సుప్రీంకోర్టులో కేసు విచారణలో ఉండగా సమన్లు జారీ చేయడం తగదన్నారు. నళిని చిదంబరానికి ఇచ్చినట్టే తనకు కూడా వెసులుబాటు ఇవ్వాలని కోరారు.

అయితే మహిళను విచారణకే పిలవకూడదంటే ఎలా? అని సుప్రీం ప్రశ్నించింది. మహిళలను విచారణకు పిలవొచ్చు కాకపోతే రక్షణ ఉండాలని తెలిపింది. అన్నిటికీ ఒకే ఆర్డర్‌ను అప్లై చేయలేమన్న ధర్మాసనం తేల్చి చెప్పింది.10 రోజుల పాటు సమన్లు వాయిదా వేయడానికి ఈడీ అంగీకరించింది. కాగా.. కవిత పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు నవంబర్ 20కి వాయిదా వేసింది. ఈ నేపథ్యంలోనే నవంబర్ 20 వరకూ ఆమెకు సమన్లు ఇవ్వొద్దని ఈడీకి సుప్రీం ఆదేశాలు జారీ చేసింది.కాగా ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ కవితకు తమ ఎదుట విచారణకు హాజరు కావాలని మరోసారి నోటీసులు పంపిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో.. ఈడీ ఇచ్చిన సమన్లు రద్దు చేయాలని సుప్రీంను కవిత ఆశ్రయించారు. లిక్కర్ కేసులో గతంలోనూ ఈడీ నోటీసులు అందుకున్న కవిత.. ఈడీ కార్యాలయంలో విచారణకు హాజయ్యారు. అయితే.. ఈడీ కార్యాలయంలో మహిళల విచారణ సీఆర్పీసీకి విరుద్ధం అంటూ ఆమె మొదటి నుంచి వాదిస్తున్నారు.

బీజేపీ తప్పుడు కథనాల సృష్టి

- పార్లమెంట్ పవిత్రతకు హాని కలిగించే ఒక్క మాట అనలేః బీఎస్పీ ఎంపీ దానిష్ అలీ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటు పవిత్రతకు హాని కలిగించే ఒక్క మాట కూడా తాను మాట్లాడలేదని, కానీ బీజేపీ తనకు వ్యతిరేకంగా "తప్పుడు కథనం"లను సృష్టించేందుకు తన శాయశక్తులా ప్రయత్నిస్తోందని బిఎస్పీ లోక్‌సభ ఎంపి దానిష్ అలీ అన్నారు. బీజేపీ ఎంపీ రమేష్ బిధూరి తనపై లోక్‌సభలో అవమానకరమైన వ్యాఖ్యలు చేశారన్న వివాదం నడుమ, బీఎస్పీకి చెందిన దానిష్ అలీ మంగళవారం స్పందించారు. గత గురువారం చంద్రయాన్-3 మిషన్ విజయంపై లోక్‌సభలో చర్చ సందర్భంగా దానిష్ అలీని లక్ష్యంగా చేసుకుని బీజేపీ ఎంపీ రమేష్ బిధూరి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. బీజేపీ ఎంపీపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష నాయకులు డిమాండ్ చేశారు. దానిష్ అలీ ట్విట్టర్ (ఎక్స్)లో 30 సెకన్ల వీడియో క్లిప్‌లో మాట్లాడుతూ బీజేపీ ఎంపీ రమేష్ బిధూరి వ్యాఖ్యలను నిరసిస్తూ, ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. "ప్రజాస్వామ్య దేవాలయం పార్లమెంట్ పవిత్రతకు హాని కలి గించే ఒక్క మాట కూడా నేను మాట్లాడలేదు.

నా గురించి, నా కులం గురించి రమేష్ బిధూరి చేసిన దూషణలు, వివరీతమైన తీరులో రెచ్చగొట్టే వ్యాఖ్యలు నేను పునరావృతం చేయదలుచుకోలేదు" అని పేర్కొన్నారు. అయినప్పటికీ బీజేపీ తప్పు డు కథనాలను సృష్టించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తోందని అలీ విమర్శిం చారు. అధికార పార్టీ నాయకుడిపై చర్య తీసుకోవడంలో "ఆలస్యం" గురించి ప్రశ్నించారు. ఆయన చుట్టూ కథనాన్ని నిర్మించడానికి బీజేపీ అగ్ర నాయకత్వం ఈ వ్యాఖ్యలను ఆమోదించినట్లుగా ఉందని ఆరోపించారు. సంఘటన జరిగిన ఆ రోజు నుంచి తనకు వ్యతిరేకంగా సాక్ష్యాలు తవ్వి తీస్తున్నారని అలీ పేర్కొన్నారు.లోక్‌సభలో బీఎస్పీ ఎంపీ దానిష్ అలీ ప్రవర్తనపై కూడా విచారణ జరిపించాలని పలువురు బీజేపీ ఎంపీలు స్పీకర్ ఓం బిర్లాను కోరారు. శుక్రవారం లోక్‌సభ స్పీకర్ బిర్లాకు డానిష్ అలీ లేఖ రాస్తూ, సభా వేదికపై బిధూరి దుర్భాషను ఉపయోగించిన అంశాన్ని ప్రివిలేజెస్ కమిటీకి సూచించాలని డిమాండ్ చేశారు. దీనిపై తక్షణమే విచారణ జరిపించాలని కోరారు. బీజేపీ ఎంపీ వ్యాఖ్యలను ప్రతిపక్షాలు ఖండించాయి. అలీకి మద్దతుగా నిలిచాయి. బీజేపీ ఎంపీ బిధూరిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు కాంగ్రెస్, టీఎంసీ, ఎన్సీపీ సభ్యులు బిర్లాకు లేఖ రాశారు. డానిష్ అలీని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కరత్, సుభాషిణి అలీ కలిసి మద్దతు తెలిపారు.

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా కలిసి మద్దతు తెలిపారు. అయితే బిధూరిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్య తీసుకోకపోవడంపై కాంగ్రెస్ మీడియా విభాగం హెడ్ పవన్ ఖేరా మాట్లాడుతూ, "ఏదైనా చర్య తీసుకుంటారని మీరు అనుకుంటున్నారా? బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఏదైనా చర్య తీసుకున్నారా? వారిపై బీజేపీ నుంచి ఎందుకు చర్య తీసుకుంటారు?. సొంత ఎంపీ?" అని అన్నారు. "మంత్రులపై అవినీతి ఆరోపణలు రుజువు కాకపోయినా.. వారిని తక్షణమే తొలగించడం ఈ దేశం చూసింది. ఇది మేము చూపించిన సున్నితత్వం, వారిపై ఎటువంటి రుజువు లేకుండా మా స్వంత పార్టీ నేతలను శిక్షించాము" అని ఖేరా అన్నారు. "ఇదిగో బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ అనే వ్యక్తి ఉన్నాడు. ఆయన ఇప్పటికీ అక్కడే ఉన్నాడు. ఇప్పుడు రమేష్ బిధూరి..... మీకు ప్రగ్యా సింగ్ ఠాకూర్ గుర్తున్నారా? మీకు సాధ్వి నిరంజన్ జ్యోతి గుర్తున్నారా? ఇలా బీజేపీ క్షమించిన నేరస్తుల జాబితాను నేను మీకు ఇవ్వగలను. ఆ స్థిరమైన ఇంటర్వ్యూలలో ఒకదానిలో ప్రధానమంత్రి 'మై ఉన్‌కో మన్ సే మాఫ్ నహీ కరుంగా (నా హృదయం నుంచి వారిని క్షమించను) అని అన్నారు. ఇది తప్ప మరేమీ జరగదు" అని ఖేరా అన్నారు.

సైలెంట్ మోడ్






ఎన్నికల వేళ చడీచప్పుడు లేని బీజేపీ

- కరీంనగర్‌లో రెండు చోట్ల పోటీకి ఎంపీ సంజయ్ సిద్ధం..?
- ప్రచార రథాన్ని ప్రారంభించిన బండి
- ఒక్కొక్కరుగా కారెక్కుతున్న కమలదళం
- ఎక్కడా కనపడని ఉత్సాహం

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

కరీంనగర్ జిల్లాలో కమలం పార్టీ సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయింది. బీఆర్ఎస్ అభ్యర్థులు, కాంగ్రెస్ ఆశావహులు ప్రచార ప్రయత్నాల్లో మునిగిపోగా కమలం పార్టీలో చడీచప్పుడు లేదు. జిల్లాలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో దరఖాస్తు చేసుకున్న ఆశావహులు సైతం జనంలో లేరు. కరీంనగర్ ఎంపీ సంజయ్ ఈసారి అసెంబ్లీకి రెండు చోట్ల పోటీ చేసేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. కరీంనగర్‌లో మైనార్టీ ఓట్లు కీలకం కావడంతో గెలుపు కోసం ముథోల్ సెగ్మెంట్‌ను ఎంచుకుంటున్నారని ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో ఇక్కడి పార్టీ పరిస్థితులనుగానీ, శ్రేణుల కప్పదాట్లనుగానీ ఏమాత్రమూ పట్టించుకోకుండా రెండ్రోజుల కిందట సాదాసీదాగా ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఇదే సమయంలో పార్టీలో భరోసా, నాయకత్వంపై నమ్మకం లేక కమలం శ్రేణులన్నీ అధికారపార్టీలోకి బాటపట్టాయి.

నాయకత్వలేమి..



కరీంనగర్ ఎంపీగా గెలుపు అనంతరం, రాష్ట్ర పార్టీ చీఫ్‌గా బాధ్యతల్లో ఉన్నప్పుడు ఏనాడూ పార్లమెంట్ సెగ్మెంట్‌పై 'బండి' దృష్టిసారించలేదు. కరీంనగర్ నగరపాలక సంస్థ ఎన్నికల్లో 60 డివిజన్లలో 13 మంది కమలం గుర్తుపై గెలిచినా వారి సమస్యలను ఏనాడూ పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. దీంతో కొన్నాళ్లకే ముగ్గురు కార్పొరేటర్లు 'కారెక్కారు'. మిగిలిన సభ్యులతో అయినా కార్పొరేషన్‌లో ఫ్లోర్‌లీడర్‌ను ఎన్నుకోలేదు. పార్టీ నిర్మాణంలో భాగంగా కరీంనగర్‌ను నాలుగు జోన్‌లుగా విభజించి వేసిన కమిటీలు, అనుబంధ సంఘాల అధ్యక్షుల మార్పుచేర్పులు అంతర్గత కుమ్ములాటకు దారితీశాయి. పదవుల్లో భంగపాటుకు గురైన వారు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. మరోవైపు తమ డివిజన్‌లో అభివృద్ధి లేక, ప్రజల్లో చరిష్మా కోల్పోలేక మరికొందరు కమలం కార్పొరేటర్లు కారెక్కేందుకు మంత్రి గంగులకు సంకేతాలు ఇచ్చారు. ఇంకోవైపు నగరం, రూరల్ ప్రాంతాల్లో బీజేపీ, దాని అనుబంధ సంఘాల యువతనూ గులాబీ పార్టీ ఆకర్షి స్తోంది. ఇలాంటి పరిస్థితుల్లోనూ పార్టీని, శ్రేణుల కప్ప దాట్లను పట్టించుకోకుండా రెండ్రోజుల కిందట ఎంపీ బండి సంజయ్ సాదాసీదాగా ప్రచార రథాన్ని ప్రారంభించారు.

చొప్పదండిలో తగ్గిన మాజీ ఎమ్మెల్యే శోభ గ్రాఫ్


బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా 2014లో గెలుపొందిన బొడిగే శోభ సొంత నేతలతో వివాదంతో ఆ పార్టీకి రాజీనామా చేశారు. 2018 ఎన్నికల ముందు ఆమె బీజేపీలో చేరారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఈసారీ చొప్పదండి నుంచి బీజేపీ టిక్కెట్ ఆశిస్తున్నారు కానీ, కనీసం నియోజకవర్గంలో తాను ఉన్నానన్న సంకేతాలు కూడా ఇవ్వడం లేదు. పైగా ఆమె పార్టీ మారుతారన్న ప్రచారమూ సాగుతోంది. దీంతో ఓ మాజీ ఎమ్మెల్యే బీజేపీలో ఉన్నా. అక్కడ పార్టీ ఎదగకపోగా ఉన్న గ్రాఫ్ కూడా పడిపోతోంది.

మానకొండూర్, హుజూరాబాద్‌లోనూ అంతంతే..


హుజూరాబాద్‌లో ఏ ఎన్నికల్లోనూ 2వేలకు మించి ఓట్లు సంపాదించలేని బీజేపీకి .. ఈటల రాజేందర్ రాకతో కొంత బలం చేకూరినట్టయింది. ఆయన ఎమ్మెల్యేగా ఉన్న హుజూరాబాద్‌లోనూ ఏమాత్రమూ సందడి లేదు. అక్కడ బీఆర్ఎస్ అభ్యర్థి అయిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి ఈటల అనుచర వర్గం, ఆయన సన్నిహితులపై దృష్టిసారించి గులాబీ పార్టీలోకి లాగుతున్నారు. ఇంకోవైపు మాన కొండూర్‌లో పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. ఇక్కడ గతం నుంచి పోటీ చేస్తున్న గడ్డం నాగరాజు కూడా ఎన్నికల వాతావరణం ప్రారంభమైనప్పటికీ పెద్దగా జనంలో ఉండటం లేదు. టిక్కెట్ విషయంలో భంగపాటు ఏర్పడుతుందనే ఆందోళనలో ఆయన ఉన్నారు. మరోవైపు బీఆర్ఎస్‌ను వీడిన ఆరెపల్లి ఇప్పుడు బీజేపీవైపు చూస్తున్నట్టు వార్తలు వస్తున్నా.. ఆ పార్టీ సందడి ఏమాత్రమూ కనిపించడం లేదు.

నవతెలంగాణ మానవి
www.navatelangana.com
కరీంనగర్ 11
బుధవారం
27 సెప్టెంబర్ 2023

ఆమె జీవితం ఆసక్తి కలిగించింది



సుజాత మాస్సే... బ్రిటీష్ సామ్రాజ్యంలో మొదటి మహిళా న్యాయవాది ప్రేరణతో 'పర్వీన్ మిస్త్రీ' రచించారు. ఈ నవలకుగాను ఎన్నో అవార్డులను గెలుచుకున్నారు. ఆ కాలపు సామాజిక నిర్మాణాలను ఇందులో ఆమె అందంగా పునఃసృష్టించారు. 1920లలో బొంబాయిలో ఏకైక మహిళా న్యాయవాది అయిన పెర్వీన్ తన తండ్రి న్యాయ సంస్థలో పనిచేస్తున్నప్పుడు పితృస్వామ్య వ్యవస్థ, లింగవివక్షలను ప్రశ్నించారు. రాజకీయాల్లోనూ భాగం పంచుకున్నారు. అలాంటి వ్యక్తి జీవితాన్ని ప్రపంచం ముందుకు తీసుకొచ్చిన ఆమె తన రచన గురించి మనతో ఇలా పంచుకుంటున్నారు...



పర్వీన్ మిస్త్రీ జీవితంలో మీకు ప్రేరణగా నిలిచిన సంఘటన ఏమిటి?

2013లో వచ్చిన 'ది సిటీ ఆఫ్ ప్యాలెస్' నవల కోసం చివరి వలసరాజ్యాల భారతదేశ చరిత్రను పరిశోధిస్తున్నప్పుడు, బ్రిటిష్ సామ్రాజ్యంలో మొదటి మహిళా న్యాయవాది కార్నెలియా సొరాబ్జీ గురించి తెలుసుకున్నాను. కార్నెలియా ఆక్స్‌ఫర్డ్‌లో చదువుకుంది. ఆ తర్వాత ఆమె ఫ్యామిలీ లా ప్రాక్టీస్ చేశారు. అలాగే మహారాజుల కోర్టుల్లో, వలస ప్రభుత్వానికి తాత్కాలిక ఏజెంట్‌గా పని చేయడానికి భారతదేశానికి తిరిగి రావడం నాకు ఆసక్తి కలిగించింది. ఆమెను 1920లలో బాంబే బార్ గుర్తించింది. విడాకుల హక్కులతో పాటు మహిళల హక్కులను రక్షించే చట్టాల కోసం ఆమె తీవ్ర కృషి చేశారు. ఇవన్నీ నాకెంతో ప్రేరణగా నిలిచాయి.

స్వాతంత్ర్యానికి పూర్వం నాటి ఆమె వ్యక్తిత్వాన్ని, స్వభావాన్ని మీరెలా తెలుసుకోగలిగారు?

ఆమె తన వివాహ జీవితం నుండి తిరిగి వచ్చి తన తల్లిదండ్రులతో కలిసి జీవించేది. తండ్రి సంస్థలో ఆశ్రయం పొందడంతో పాటు అక్కడే ఉద్యోగంలో చేరింది. న్యాయవాదిగా డబ్బు సంపాదించేది. అది ఆమెకు ఒక ప్రత్యేకమైన స్వేచ్ఛను, విశ్వాసాన్ని ఇచ్చింది. ఆలిస్ హాబ్సన్-జోన్స్, కోలిన్ సాండ్రింగ్‌హామ్ అనే ఇద్దరు బ్రిటీష్ వ్యక్తులతో ఆమె సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. స్నేహితులతో, ప్రజలతో ఆమెకు మంచి సంబంధాలు ఉన్నాయని చెప్పడానికి ఇదొక చక్కటి ఉదాహరణ. అయితే అన్ని విషయాల్లో ధైర్యంగా ఉంటూ తన చుట్టూ ఉన్న వారిలో కూడా ఆమె ధైర్యాన్ని నింపేది.

మీరు రాసేటప్పుడు ఎలాంటి పాఠకులను దృష్టిలో పెట్టుకుంటారు?

నా పాఠకుల్లో అన్ని వయసుల వారు, అనేక దేశాల వారు ఉంటారు. అంటే వీరిలో చాలా మందికి భారతదేశం, దాని చరిత్ర గురించి ముందస్తు జ్ఞానం ఉండదు. నా రచన ఉపన్యాసంలా ఉంటే నాకు నచ్చదు. సంభాషణల రూపంలో సమాచారాన్ని అందిస్తాను. పర్వీన్ ఆలిస్ తాజ్ వద్ద భోజనం చేస్తున్నప్పుడు ఒక సంఘటన జరుగుతుంది. బాంబే డక్ అంటే దానికి ఒక సరదా ఉదాహరణ. బ్రిటిష్-ఇండియన్ యాస, వంటకాలు, ఆచారాల చరిత్ర నాకు ఆసక్తిని కలిగిస్తుంది. అలాగే అన్ని అధ్యాయాలను సస్పెన్స్‌తో ముగించడం మరొక లక్ష్యం.

రాసే మధ్యలో విరామం కోసం ఏం చేస్తారు?

ఆరుబయట నడుస్తుంటాను. అలాగే మ్యూజియంలు, సినిమాలకు వెళ్లడం నాకు ఇష్టం. థియేటర్లకు వెళ్ళడానికి నా ప్రాధాన్యం. ఇతర వ్యక్తుల సృజనాత్మకతను ఆస్వాదిస్తూ నా సృజనాత్మకతను అభివృద్ధి చేసుకుంటాను. అవసరమైన వివరాలను సేకరించడం కోసం ప్రతి పుస్తకంతో భారతదేశాన్ని సందర్శించడానికి ప్రయత్నిస్తాను. ఈ సుందరమైన పర్యటనా సమయంలో నా తదుపరి పుస్తకం కోసం ఆలోచన వస్తుంది. ప్రస్తుతం నేను సిరీస్‌లో ఐదు పుస్తకాలపై పని చేస్తున్నాను.

ఎప్పుడైనా విశ్రాంతి తీసుకోవాలనిపిస్తే?

నా భర్తతో కలిసి ప్రయాణం చేస్తాను, స్నేహితులతో కలిసి భోజనం చేస్తాను, తోట పని చేస్తాను. అలాగే నాకు రోజూ ఏదైనా మంచి వంట చేయడం అంటే చాలా ఇష్టం.

ప్రస్తుతం మీరు చదువుతున్న పుస్తకాలు?


నెవ్ మార్చ్ రచించిన ది స్పానిష్ డిప్లొమాట్, 2023 పతనం కోసం రాబోయే మిస్టరీ నవల, మేరీ స్టీవర్ట్ రచించిన 1955 సస్పెన్స్ నవల మేడమ్ విల్ యు టాక్.

మీపై ముద్ర వేసిన రచయిత?

1920-1940ల బ్రిటన్‌లో నివసిస్తున్న మహిళా పరిశోధకురాలు-మనస్తత్వవేత్త గురించి మైసీ డాబ్స్ సిరీస్‌ను రూపొందించిన బ్రిటిష్ రచయిత జాక్వెలిన్ విన్స్పియర్ రచన, వ్యక్తిగత ప్రయాణాన్ని నేను ఎంతో అభిమానిస్తాను. అందులో సన్నివేశాలను సెట్ చేయడం, వ్యక్తులను వివరించడం, సంభాషణలు నాకెంతో నచ్చాయి.

పుస్తకాన్ని తీసుకున్న పాఠకులకు మీ సందేశం ఏమిటి?

హృదయాన్ని కదిలించే రహస్యానికి సిద్ధంగా ఉండమని నేను చెబుతాను. ఒక యువతిని అన్యాయంగా అరెస్టు చేయడం, ఆమెకు సహాయం చేయడానికి పర్వీన్ చేసిన ప్రయత్నాల వల్ల తలెత్తిన క్లిష్ట పరిస్థితిని చూసి నేను చాలాసార్లు కన్నీళ్లు పెట్టుకున్నాను. ఇది కూడా ఒక పాప వచ్చినప్పుడు ఇంట్లో జరిగే మార్పులు మరింత బాధగా ఉంటాయి. పెర్వీన్ రిస్క్ తీసుకోవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. తన ప్రయత్నాలకు ఎదురు దెబ్బలు తగిలితే మరో మార్గం కోసం వెతుకుతుంది.







పోషకాల శెనగలు



శెనగలతో గుగ్గిళ్లు (గుడాలు) చేసుకోవడం చాలా మందికి అలవాటు.. ఎక్కువ మంది రుచి కోసమో, సాయంత్రం ఏదొక స్నాక్‌లా కావాలని చేసుకున్నప్పటికీ అందులో అనేక పోషకాలు ఉంటాయి. ఉడికించడం లేదా వేయించుకోవడమే కాకుండా వీటితో ఇంకా వెరైటీలు చేసుకోవచ్చు. ఏదెలా ఉన్నా, స్నాక్‌లా మాత్రం మంచి ఆహారమనే చెప్పవచ్చు.

శెనగల్ని నానబెట్టి నీళ్లు ఒంపేసి వుంచితే ఒక రోజులో మొలకలు వస్తాయి. అప్పుడు వాటిని ఉడికించి ఓ గిన్నెలోకి తీసుకోవాలి. వీటికి టొమాటో ముక్కలు, సన్నగా తరిగిన కీర, పచ్చిమిర్చి, పుదీనా.. తగినంత ఉప్పు, ఇష్టం ఉన్న వారు చాట్ మసాలా కూడా వేసి నిమ్మకాయ పిండితే నోరూరించే సలాడ్ సిద్ధమైనట్టే..!

- వీటితో పిల్లల కోసం టిక్కీలు కూడా ప్రయత్నించవచ్చు. అలాగే క్యాబేజీ, క్యాలీ ఫ్లవర్ లాంటి కూరల్లో బఠాణీలకు బదులు వీటిని వేసుకున్నా రుచిగా ఉంటుంది. ఇవేవీ కాదనుకుంటే ఏకంగా వాటితోనే కూర చేసుకోవచ్చు. ఎలా తిన్నా వీటి నుంచి పోషకాలు అందుతాయి.
- శెనగల్లో పీచు పదార్థం సమృద్ధిగా ఉంటుంది. అదే సమయంలో కొలెస్ట్రాల్ తక్కువ. కాబట్టి వీటిని కొద్దిగా తిన్నా పొట్ట నిండినట్లు అనిపిస్తుంది. జీర్ణక్రియ పనితీరు కూడా మెరుగువుతుంది. అంతేకాదు రక్తంలో చక్కెరస్థాయిలు కూడా అదుపులో ఉంటాయి.
- వీటిలో ఫొలేట్, మెగ్నీషియం స్థాయిలూ ఎక్కువే. ఫొలేట్ హోమోసి స్టీన్ అనే అమినోయాసిడ్ ప్రభావాన్ని తగ్గిస్తుంది. దానివల్ల గుండెలోని రక్తనాళాలు మూసుకుపోయే ప్రమాదం తగ్గుతుంది. ఫోలేట్ వల్ల కొత్త కణాల ఉత్పత్తి పెరుగుతుంది.
- మహిళలకు మేలుచేసే పదార్థాల్లో శెనగలు ఒకటి. వీటిల్లో ఉండే ఫైటోకెమికల్స్ యాంటీ ఆక్సిడెంట్లలా పని చేస్తాయి. ఇవి ఆస్టియోపోరోసిస్ రాకుండా కాపాడతాయి. రొమ్ముక్యాన్సర్ ప్రభావాన్నీ, మెనోపాజ్ తరువాత వచ్చే సమస్యల్నీ కొంతవరకూ అదుపులో ఉంచుతాయి.
- రోజులో శరీరానికి అవసరమైన ఇనుములో చాలాశాతం శెనగల నుంచి పొందవచ్చు. వీటి వల్ల రక్తహీనత, అలసట, నిద్రలేమి, జుట్టురాలడం, తలనొప్పి వంటి వాటి బారిన పడకుండా ఉండొచ్చు.

కాబట్టి వీలైనంత వరకూ కనీసం వారంలో ఒకసారైనా శెనగలను స్నాక్ రూపంలో తీసుకోవడం ఆరోగ్యానికి చాలా మంచిది.

కొబ్బరి పాలతో...



పొడిబారిన జుట్టుకి కొబ్బరిపాలను పట్టిస్తే, అవి జుట్టుకు తిరిగి ప్రాణం వచ్చేలా చేస్తాయి. జుట్టు సాఫ్ట్‌గా మారుతుంది. కుదుళ్లు గట్టిపడతాయి. వెంట్రుకలు చిట్లిపోయే సమస్య తొలగిపోతుంది.

- తాజా కొబ్బరి పాలను జుట్టు కుదుళ్లపై పోసుకొని మసాజ్ చేసుకోవాలి. ఇలా జుట్టు మొత్తం తగిలేలా చెయ్యాలి. ఓ అరగంట పాటూ అలా వదిలేయాలి. ఓ టవల్‌ని గోరు వెచ్చటి నీటిలో ముంచి తీసి నీటిని పిండేసి దాన్ని ఐదు నిమిషాల పాటు తలకు చుట్టుకోవాలి. టవల్ తీసి మళ్లీ గోరువెచ్చటి నీటిలో ముంచి నీటిని పిండేసి తలకు చుట్టుకోవాలి. ఇలా నాలుగైదు సార్లు చెయ్యాలి. తర్వాత జుట్టును కడిగేసుకోవాలి. ఫలితంగా సాఫ్ట్ అండ్ సిల్కీ హెయిర్ మీ సొంతం అవుతుంది. జుట్టులోని చుండ్రు దూరం అవుతుంది.
- షాంపూతో తల స్నానం చేశాక, కొద్దిగా కొబ్బరి పాలను జుట్టుకి పట్టించాలి. రెండు నిమిషాలు అలా వదిలెయ్యాలి. తర్వాత నీటితో కడిగేసుకోవాలి. కండీషనర్‌లా కూడా కొబ్బరి పాలు ఉపయోగపడతాయి.
- రెండు టీస్పూన్ల కొబ్బరి నూనె, ఓ టీస్పూన్ కొబ్బరి పాలను కలిపి మొహంపై నెమ్మదిగా మసాజ్ చేసుకోవాలి. కొన్ని నిమిషాల తర్వాత దూదితో తుడిచేసుకోవాలి. మీ చర్మం జిడ్డుగా, మచ్చలు, మొటిమలతో ఉంటే మీరు కూడా కొబ్బరి పాలను వాడవచ్చు. ఇందులో బ్యాక్టీరియాను చంపే గుణం ఉంటుంది.
- ముసలితనం రాకుండా, ముడతలు రాకుండా, ఏజ్ స్పాట్స్ కనిపించకుండా చెయ్యడంలో కొబ్బరి పాలు బాగా ఉపయోగపడతాయి. అందువల్లే ఫేస్ మాస్క్‌లా కొబ్బరి పాలను వాడుతున్నారు. బాదం పొడి, కొబ్బరి పాలు, తేనె కలిపి ముఖానికి పేస్టులా పట్టించవచ్చు. కండ్లు, పెదవులకు మాత్రం అవసరం లేదు. 20 నిమిషాల తర్వాత నీటితో కడిగేసుకుంటే ముఖం కళకళలాడుతుంది.
- నొప్పి, మంటలు ఉన్న చర్మంపై కొబ్బరి పాలు రాసుకుంటే ఎంతో హాయిని ఇస్తుంది.

మణిపూర్‌లో మరో దారుణం

(మొదటిపేజి తరువాయి)

తెలిపింది. సీబీఐ దర్యాప్తు చేస్తున్న 11 కేసుల్లో ఇదీ ఒకటి. ఫోటోలు వైరలైన వెంటనే కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్‌తో మాట్లాడినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి.

ఇద్దరు విద్యార్థులను కొంతమంది సాయుధులు కిడ్నాప్ చేసి హత్య చేసినట్టు తెలుస్తోంది. ఒక అటవీ ప్రాంతంలో విద్యార్థులను బంధించినట్టు ఒక ఫొటోలో ఉండగా.. వారి వెనుక ఇద్దరు దుండుగులు కన్పించారు. పొదల మధ్యలో విద్యార్థుల మృతదేహాలను పడేసిన మరో ఫొటో కూడా వైరల్ అయ్యింది.

ఈ ఫొటోలపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఓ ప్రకటన విడుదల చేసింది. హత్యకు గురైన విద్యార్థులు.. మొయితీ వర్గానికి చెందిన 17 ఏండ్ల విద్యార్థిని, 20 ఏండ్ల విద్యార్థిగా గుర్తించినట్టు తెలిపింది. జులై 6 నుంచి వీరిద్దరూ అదృశ్యమయ్యారు. జులై 19న తన కుమార్తె అదృశ్యమైనట్టు విద్యార్థిని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. లాంఫెల్ పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. జులై 6వ తేదీన ఆంక్షలు సడలించడంతో విద్యార్థిని కోచింగ్ కోసం వెళ్లింది. అనంతరం తన స్నేహితుడితో బైక్‌పై వెళ్లినట్టు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. విద్యార్థిని క్లాసుకు హాజరైనట్టు టీచర్ కూడా వెల్లడించారు. చివరిసారిగా వారిద్దరు బిష్ణుపూర్‌లో కనిపించినట్టు సీసీటీవీ ఫుటేజీలో నిక్షిప్తమైంది. వారి ఫోన్లు స్విచ్ఛాఫ్ అయ్యాయి. వారు ఇంఫాల్‌కు సమీపంలోని నంబోల్ వైపు వెళ్లినట్టు సీసీటీవీ కెమెరాల్లో రికార్డ్ అయ్యిందని పోలీసులు గతంలో వెల్లడించారు. ఆ తర్వాత వారు అదృశ్యమయ్యారు. ఈ ఘటనపై ఇప్పటికే సీబీఐ దర్యాప్తు చేపట్టినట్లు మణిపుర్ ప్రభుత్వం ఆ ప్రకటనలో వెల్లడించింది. హత్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చింది.

దసరా నుంచి సీఎం అల్పాహార పథకం

(మొదటిపేజి తరువాయి)

పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన, విద్యాశాఖ అధికారులు, అక్షయపాత్ర ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు దసరా పండుగ రోజు నుంచి "ముఖ్యమంత్రి అల్పాహార పథకం" ప్రారంభించనున్నట్టు మంత్రి తెలిపారు. ఇందుకు సంబంధించిన మెనూను త్వరితగతిన నిర్ణయించి అందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఈ పథకానికి సంబంధించి విధి, విధానాలను రూపొందించాలని అధికారులకు సూచించారు. దేశంలోనే పాఠశాలల్లో అల్పాహారం అందిస్తున్న రెండో రాష్ట్రంగా తెలంగాణ నిలిచిపోనుందని మంత్రి పేర్కొన్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతోపాటు వారికి చదువు పట్ల ఏకాగ్రతను పెంచే దిశగా చేపట్టిన ఈ పథకంలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చూడాలని అధికారులను కోరారు. ఈ పథకం అమలును జిల్లా స్థాయిలో పర్యవేక్షించే బాధ్యతను అదనపు కలెక్టర్లకు అప్పగించనున్నామని తెలిపారు. నాణ్యమైన విద్యతోపాటు మంచి పోషకాహారం అందించే దిశగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం విజయవంతం అయ్యేందుకు ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి అవసరమైన వంట పాత్రలను సమకూర్చే ఏర్పాట్లు ప్రారంభించాలని తెలిపారు. ఈ పథకం అమలుచేయడం ద్వారా 27,147 పాఠశాలల్లోని దాదాపు 23 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కలగనుందని వివరించారు. ఇప్పటికే మధ్యాహ్న భోజన పథకంలో సన్న బియ్యాన్ని, విద్యార్థులకు గుడ్లు పంపిణీ చేస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని మంత్రి గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై అధిక భారం పడుతున్నా తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని తెలిపారు.

ఆలేరు ఎమ్మెల్యే సునీతకు రూ.10వేల జరిమానా

నవతెలంగాణ-హైదరాబాద్

ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతకి హైకోర్ట్ రూ.10 వేల జరిమానా విధించింది. 2018లో ఎమ్మెల్యేగా గెలవడాన్ని సవాల్ చేస్తూ సతీష్‌రెడ్డి పిటిషన్ వేశారు. తర్వాత చనిపోవడంతో మరో కాంగ్రెస్ నేత బి.అయోధ్యరెడ్డి ఇంప్లీడ్ పిటిషన్ వేశారు. ఈ కేసులో సునీత కౌంటర్ పిటిషన్ దాఖలు చేయకపోవడంతో హైకోర్టు ఫైన్ విధించింది. విచారణను అక్టోబర్ మూడో తేదీకి వాయిదా వేసింది. ఈసారి కౌంటర్ వేయకపోతే తాము తగిన నిర్ణయం తీసుకుంటామని హెచ్చరించింది.

సైన్యంలో రాజకీయాలు

(మొదటిపేజి తరువాయి)

తన దళాలకు యుద్ధ శిక్షణ కొనసాగించింది. ఉగ్రవాదులు యథేచ్ఛగా మన దేశంలో చొరబడడానికి, కార్యకలాపాలు సాగించడానికి ఆస్కారం ఏర్పడింది.

2014 అక్టోబర్‌లో సైనిక దళాల కమాండర్ల సమావేశాన్ని ఉద్దేశించి మోడీ ప్రసంగిస్తూ పాకిస్తాన్ నుండి ఎదురవుతున్న ప్రమాదాన్ని ప్రస్తావించారు. అయితే ప్రమాదాన్ని గుర్తించగలిగినా శత్రువును గుర్తించడం కష్టంగా ఉందని చెప్పారు. శత్రువులు అంటే ఆయన దృష్టిలో ఉగ్రవాదులు. ఆయన ప్రసంగంతో ఉత్తేజితులైన సైనికులు జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలపై దృష్టి సారించారు. జమ్మూకాశ్మీర్‌లో పాకిస్తాన్ సీమాంతర ఉగ్రవాద చర్యలకు పాల్పడుతుంటే దానిని మోడీ ప్రభుత్వం రాజకీయ అంశంగా మార్చేసింది. సీమాంతర ఉగ్రవాదానికి పాకిస్తాన్ స్వస్తి చెప్పనంత వరకూ ఆ దేశంతో చర్చలు జరపడం సాధ్యం కాదని తెగేసి చెప్పింది. తద్వారా పాక్‌తో చర్చల ప్రక్రియకు తలుపులు మూసింది. సీమాంతర ఉగ్రవాదం అనేది బలమైన శత్రువుతో పోరాడేందుకు సైనికులు అవలంబించే వ్యూహం. ఉదాహరణకు భారత సైనిక బలంతో పోలిస్తే పాక్ బలం చాలా తక్కువ. అందుకే అది ఉగ్రవాదులను భారత్ పైకి ప్రయోగిస్తోంది.

పాకిస్తాన్ సీమాంతర ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి రెండు మార్గాలు ఉన్నాయి. ఒకటి పాక్‌తో అర్థవంతమైన చర్చలు ప్రారంభించడం. చర్చలు మొదలైతే కాశ్మీర్‌లో ఉగ్రవాదుల ప్రవేశాన్ని పాకిస్తాన్ నియంత్రిస్తుంది. రెండోది...పాకిస్తాన్ దుందుడుకు చర్యలకు అడ్డుకట్ట వేయడానికి భారత్ తన సైనిక యుద్ధ సామర్థ్యాన్ని పెంచుకోవడం. అయితే దురదృష్టవశాత్తూ గత 33 సంవత్సరాలుగా మన సైన్యాధికారులు ఇందుకోసం ఎలాంటి ప్రయత్నం చేయలేదు. పైగా పాక్ ఆగడాల కారణంగా అనేక మంది సైనికులు వీర మరణం పొందుతూనే ఉన్నారు. వారికి శ్రద్ధాంజలి ఘటించడం, ఉగ్రవాద దుశ్చర్యలను సహించబోమని గంభీరమైన ఉపన్యాసాలు ఇవ్వడం మినహా ప్రభుత్వ పెద్దలు, సైనికాధికారులు చేస్తున్నదేమీ లేదు. ఈ విషయంలో ప్రభుత్వాన్ని విమర్శించే వారి నోళ్లను జాతీయవాదం, దేశభక్తి ముసుగులో మూసేయడం పరిపాటిగా మారింది. ఇందుకోసం ప్రభుత్వం తనకు అనుకూల మీడియాను వాడుకుంటోంది. ప్రభుత్వాన్ని విమర్శించడం దేశ వ్యతిరేక చర్య అనే స్థాయిలో ప్రచారం జరుగుతోంది.

ప్రస్తుతం భారత సైన్యం ఎదుర్కొంటున్న సవాళ్లు స్వయంకృతాపరాధాలేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఉగ్రవాద నిరోధక చర్యలలో అనుభవం గడించామని చెప్పుకుంటున్న కొందరు రిటైర్డ్ సైనికాధికారులు కూడా ఈ దుస్థితికి కారణమే. అధికార పార్టీకి వంత పాడుతూ సైనిక దళాలలో స్థైర్యాన్ని దెబ్బ తీయడానికి వీరు నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నారు.

29న ఎన్నికల క్యాబినెట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అక్టోబరు మొదటి వారంలో శాసనసభ ఎన్నికల నోటిఫికేషన్ రానుందనే వార్తల నేపథ్యంలో అధికార బీఆర్ఎస్ అందుకనుగుణంగా స్పీడు పెంచుతోంది. ఎలక్షన్ తాయిలాల్లో భాగంగా సీఎం కేసీఆర్ ఓటర్లకు మరిన్ని హామీలివ్వనున్నారు. ఈ హామీలు, తాయిలాలపై చర్చించేందుకోసం ఈనెల 29న రాష్ట్ర మంత్రివర్గం ప్రత్యేకంగా భేటీ కానుంది. ప్రస్తుత సర్కారుకు దాదాపు ఇదే ఆఖరి క్యాబినెట్ కానుంది. నామినేటెడ్ కోటాలో ఎమ్మెల్సీలుగా గతంలో మంత్రివర్గం సిఫారసు చేసిన దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందర రాజన్ తిరస్కరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మరోసారి క్యాబినెట్ వారి పేర్లను ఆమోదించి, గవర్నర్‌కు తిరిగి సిఫారసు చేయనుందని సమాచారం.

ప్రతిపక్ష కాంగ్రెస్ ఇటీవల ఆరు గ్యారెంటీలను ప్రకటించటంతో గులాబీ పార్టీ ఉక్కిరిబిక్కిరవుతోంది. వాటికి ధీటుగా బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను రూపొందించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. గత ఎన్నికల్లో పింఛన్‌దారులు, రైతులు కారు పార్టీని భుజాన వేసుకుని గెలిపించారు. ఈసారి కూడా వారే తమ పార్టీని ఆదుకుంటారని కేసీఆర్ భావిస్తున్నారు. అందువల్ల ఆసరా పింఛన్ల పెంపు, రైతు బంధు కింద ఇచ్చే ఆర్థిక సాయం పెంపు తదితరాంశాలను ఎన్నికల ప్రణాళికలో ఆయన చేర్చనున్నారు. వీటితోపాటు ఉద్యోగుల డీఏ పెంపు, వారికి సంబంధించిన ఇతర ప్రధానాంశాలు ఎన్నికల ప్రణాళికలో ఉండబోతున్నాయి. 2018లో ముందస్తు ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ 'నిరుద్యోగ భృతి'ని ఇస్తామంటూ ప్రకటించింది. కానీ ఇప్పటి వరకూ దానికి అతీగతీ లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని నిరుద్యోగుల కోసం ఏదైనా ఒక పథకాన్ని ప్రవేశపెట్టే అవకాశముంది. దళిత బంధు, బీసీ, మైనారిటీ బంధు పథకాలు తమకు రాజకీయంగా లబ్ది చేకూరుస్తాయని భావిస్తున్న సీఎం కేసీఆర్... వాటి తరహాలోనే మహిళా బంధు పథకానికి రూపకల్పన చేయబోతున్నారని అధికార పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వీటన్నింటిపై మంత్రివర్గంలో చర్చించనున్నారు. ఈ రీత్యా 29న నిర్వహించబోయే క్యాబినెట్ భేటీ అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది.

కారులో చదరంగం

(మొదటిపేజి తరువాయి)

సన్నిహితుల వద్ద వాపోతున్నట్టు వినికిడి. అందువల్ల వారు కచ్చితంగా ఎన్నికల్లో పోటీ చేస్తారనేది విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇక త్వరలో కారెక్కనున్న మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామికి పెద్దపల్లి లోక్‌సభ స్థానాన్ని కేటాయించనున్నారని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. ఆ హామీ మేరకే ఆయన గులాబీ తీర్థం పుచ్చుకున్నారని ఆయా వర్గాలు తెలిపాయి. అయితే ప్రస్తుతం అక్కడి నుంచి ఎంపీగా ఉన్న నేతగాని వెంకటేశ్‌కు ముున్ముందు ఏ పదవిని కట్టబెడతారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇక జహీరాబాద్ అసెంబ్లీ టిక్కెట్‌ను ఆశించిన ఏర్పుల నరోత్తమ్‌కు రాష్ట్ర ఎస్సీ కులాల సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ పదవిని కట్టబెట్టిన సంగతి తెలిసిందే. త్వరలో బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరతారంటూ ప్రచారం జరుగుతున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి కూడా... తనకు చేవెళ్ల ఎంపీ టిక్కెట్ ఇచ్చేందుకు అంగీకరిస్తేనే పార్టీ మారతాననే సంకేతాలు ఇస్తుండటం గమనార్హం. కానీ అక్కడ ప్రస్తుతం బీఆర్ఎస్ నుంచే గడ్డం రంజిత్‌రెడ్డి సిట్టింగ్ ఎంపీగా ఉండటం గమనార్హం.

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

(మొదటిపేజి తరువాయి)

కొనియాడారు. ఆ స్ఫూర్తితోనే రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. బీసీల అభ్యున్నతికి కృషి చేస్తున్నామన్నారు.

గవర్నర్ బీసీలకు వ్యతిరేకం-ఎమ్మెల్సీ కవిత



గవర్నర్ తమిళసై సౌందరరాజన్ బీసీలకు వ్యతిరేకమని తేలిపోయిందని ఎమ్మెల్సీ కే కవిత విమర్శించారు. అందుకే ప్రభుత్వం పంపిన ఎమ్మెల్సీన జాబితాను తిప్పి పంపారన్నారు. దేశంలో భారత రాజ్యాంగం నడుస్తుందో, బీజేపీ రాజ్యాంగం నడుస్తుందో అర్థం కావట్లేదని ఎద్దేవా చేశారు. గవర్నర్ వైఖరి ఫెడరల్ స్ఫూర్తికి పూర్తి విరుద్ధమని విమర్శించారు. మంగళవారం శాసనమండలిలో జరిగిన చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ మీడియాతో ప్రత్యేకంగా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పేర్లను గవర్నర్ ఆమోదించే సంప్రదాయం ఉందనీ, దాన్ని విస్మరించి బీసీ వర్గాలకు నష్టం చేయడం విచారకరమన్నారు.

సీజనల్ వ్యాధుల కట్టడికి చర్యలు తీసుకోండి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీజనల్ వ్యాధులు, వైరల్ ఫీవర్స్ కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. వాటి తీవ్రత ఎక్కువున్న జిల్లాల్లో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాలకు ప్రత్యేక వైద్య బృందాలను వెంటనే పంపాలని సూచించారు. సంచార వైద్యశాలలు, వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనీ, అవసరమైన టెస్టులను ఉచితంగా చేయించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు వెంటనే దోమ తెరలను అందించాలని కోరారు. మంగళవారం ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు ఆయన లేఖ రాశారు. 'ఇటీవల కురిసిన వర్షాలు, వాతావరణ మార్పుల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు, జ్వరాలు వేగంగా ప్రబలుతున్నాయి. డయేరియా, టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, అతిసార వంటి వాటికి గురై ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఆదిలాబాద్, మంచిర్యాల, ములుగు, నిర్మల్, భూపాలపల్లి వంటి జిల్లాల్లో ప్రజలు జ్వరాలతో అల్లాడుతున్నారు. ములుగు జిల్లాలో ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట, వాజేడు, వెంకటాపురం మండలాల్లో ఊర్లకు ఊర్లే జ్వరాలు, వ్యాధులతో మగ్గుతున్నాయి. మంచిర్యాల జిల్లాలో కోటపల్లి, జన్నారం, బెల్లంపల్లి, మంచిర్యాల మండలాల్లో మా పార్టీ ప్రతినిధుల బృందాలు బాధిత ప్రాంతాలను సందర్శించి అక్కడి పరిస్థితిని తెలుసుకున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు ఎక్కువ మంచాన పడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రజలు స్థానిక ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఇప్పటికే కొన్ని జిల్లాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశాం. మెడికల్ టెస్టులు చేయించుకోవాలంటే సుదూరంగా ఉన్న వరంగల్ ఎంజీఎం, తదితర ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. జ్వర తీవ్రత ఎక్కువై ఆస్పత్రికి చేరేలోపే కొందరు చనిపోతున్నారు. స్థానిక పీహెచ్‌సీలు, ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత, సౌకర్యాల లేమి వల్ల వైద్యం సరిగ్గా అందని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రయివేటు ఆస్పత్రుల వైపు వెళ్లాల్సి వస్తున్నది. జ్వర బాధితులు వైద్యం కోసం రూ.5 వేల నుంచి రూ.20 వేల దాకా అప్పు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి' అని లేఖలో తమ్మినేని పేర్కొన్నారు.

మహిళా రిజర్వేషన్లలో వాస్తవాలివే..

న్యూఢిల్లీ : చట్టసభల్లో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్లు కల్పించే విషయంలో నరేంద్ర మోడీ ప్రభుత్వ డొల్లతనాన్ని ఎండగట్టేందుకు కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. మరో పది సంవత్సరాలు గడిచినా ఈ రిజర్వేషన్లు అమలులోకి రావని స్పష్టం చేసింది. మహిళా బిల్లును మోడీ ఎలా అపహాస్యం చేస్తున్నారో, తాను చేయని పనికి ప్రయోజనం పొందేందుకు ఎలా ప్రయత్నిస్తున్నారో ప్రజలకు వివరిస్తూ రాష్ట్ర రాజధానుల్లో 21 పత్రికా సమావేశాలు నిర్వహించింది. ఈ సమావేశాలను ఉద్దేశించి మహిళా నేతలే ప్రసంగించడం విశేషం. ప్రజల ఖాతాలో రూ.15 లక్షల రూపాయలు వేశామని చెప్పడం ఎంత నిజమో, ప్రతి సంవత్సరం రెండు కోట్ల మందికి ఉద్యోగాలు ఇచ్చామని చెప్పడం ఎంత నిజమో, బులెట్ రైలు నడిపామని చెప్పడం ఎంత నిజమో మహిళా రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పడంలో కూడా అంతే నిజముందని ఎద్దేవా చేశారు.

మహిళా రిజర్వేషన్లకు జనగణన, నియోజకవర్గాల పునర్విభజన పేరుతో అనవసరమైన షరతులు విధించారని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. మహిళలకు సాధికారత కల్పించడం ఆర్ఎస్ఎస్-బీజేపీలకు ఇష్టం లేదని, అందుకే రిజర్వేషన్ల అమలును ఆలస్యం చేసేందుకు మోడీ ఈ ఎత్తుగడ వేశారని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండే మహిళలకు ఓటింగ్ హక్కులు కల్పించడం ద్వారా లింగ సమానత్వం కోసం కాంగ్రెస్ కృషి చేసిందని, పంచాయతీరాజ్ సంస్థలలో మహిళలకు 33శాతం సీట్లు కేటాయించిందని గుర్తు చేశారు. బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదని, అయితే దానిని ఆమోదించే ప్రక్రియలో రాజకీయ ప్రతిఘటనను మోడీ ప్రభుత్వం అణచివేసిందని విమర్శించారు. మహిళలకు తక్షణమే రిజర్వేషన్లు ఇవ్వడం బీజేపీ నాయకులకు ఇష్టం లేదని అంటూ మహిళలకు ఆర్ఎస్ఎస్ వ్యతిరేకమని, ఈ కీలకమైన సంస్కరణను కేవలం ఎన్నికల ఎత్తుగడగా వాడుకోవాలని మాత్రమే వారు కోరుకున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు.

భారత రేసు గుర్రాలు పసిడి పట్టాయి. ఈక్వెస్ట్రియన్ (గుర్రపుస్వారీ)లో భారత జట్టు చారిత్రక విజయం సాధించింది. చివరగా 1982 ఆసియా క్రీడల్లో ఈక్వెస్ట్రియన్‌లో భారత్ గోల్డ్ మెడల్ నెగ్గగా.. తాజాగా హాంగ్జౌలోనే మళ్లీ పసిడి దక్కింది. డ్రెస్సేజ్ ఈవెంట్‌లో అదరగొట్టిన మనోళ్లు.. మూడో రోజు హైలైట్‌గా నిలిచారు. సెయిలింగ్‌లో నేహా ఠాకూర్ సిల్వర్ సాధించగా, ఎబాద్ అలీ కాంస్య పతకం నెగ్గాడు. తొలి రోజు ఐదు, రెండో రోజు ఆరు పతకాలు సాధించిన టీమ్ ఇండియా.. హాంగ్జౌలో మూడో రోజు మూడు పతకాలతో సరిపెట్టుకుంది.

పసిడి గుర్రాలు!



- ఈక్వెస్ట్రియన్‌లో చారిత్రక పసిడి
- 41 ఏండ్ల తర్వాత గుర్రపుస్వారీలో గోల్డ్
- సెయింగ్‌లో నేహా ఠాకూర్‌కు సిల్వర్
- సెయిలర్ ఎబాడ్ అలీకి కాంస్యం

నవతెలంగాణ-హాంగ్జౌ

ఆసియా క్రీడల్లో ఈక్వెస్ట్రియన్ క్రీడను తొలుత 1982 ఆసియా క్రీడల్లో ప్రవేశపెట్టగా.. ఆతిథ్య భారత్ ఏకంగా మూడు పసిడి పతకాలు కొల్లగొట్టింది. కానీ ఆ తర్వాత 41 ఏండ్ల పాటు ఈ విభాగంలో టీమ్ ఇండియాకు బంగారం దక్కలేదు. హాంగ్జౌ ఆసియా క్రీడల్లో భారత యువ జట్టు గుర్రపుస్వారీలో పసిడి దాహం తీర్చారు. డ్రెస్సేజ్ విభాగంలో స్వర్ణం సాధించిన సుదీప్తి హజెల, దివ్య కృతి సింగ్, అనుశ్ అగర్వాల, హృదయ్ విపుల్ సరికొత్త చరిత్ర సృష్టించారు. 1982లో ఈక్వెస్ట్రియన్ ఈవెంటింగ్‌లో పసిడి పతకాలు సాధించగా.. ఇప్పుడు డ్రెస్సేజ్ విభాగంలో గోల్డ్ దక్కింది.



రేసు అదిరింది

ఈక్వెస్ట్రియన్ డ్రెస్సేజ్ పోటీలో భారత రేసర్లు, గుర్రాలు అద్భుతం చేశాయి. సుదీప్తి, దివ్యకృతి, హృదయ్, అనుశ్‌లు వరుసగా చిన్‌స్కి, ఫిర్‌ఫోడ్, చెమ్‌ప్రో ఎమరాల్డ్, ఎట్రో గుర్రాలను రైడ్ చేశారు. ఈ విభాగంలో డిఫెండింగ్ జపాన్, మల్టీపుల్ మెడలిస్ట్ దక్షిణ కొరియాలు బరిలో నిలిచినా.. భారత జట్టు అదరగొట్టింది. డ్రెస్సేజ్ ఈవెంట్‌లో నలుగురు రైడర్లు, గుర్రాలకు ముందుగానే నిర్ణయించిన మూమెంట్స్‌ను ప్రదర్శించాలి. బ్యాక్‌గ్రౌండ్‌లో మ్యూజిక్‌కు వినిపిస్తుండగా.. గుర్రం నడుస్తూ, లయబద్ధంగా పరుగెడుతూ, ఒక కాలు మాత్రమే భూమిపై ఉంచి చేసే విన్యాసాలను ప్రదర్శించాలి. ఈ పోటీలను 20 (60) మీటర్ల ప్యాచ్ ఆఫ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తారు. ప్రత్యేకించి ఈ పోటీల్లో గుర్రానికి, రేసర్‌కు గొప్ప సమన్వయం అవసరం. భారత రేసర్లు, గుర్రాలు 209.205 పాయింట్లతో అగ్రస్థానంలో నిలువగా.. చైనా 204.882 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించింది. హాంగ్‌కాంగ్ 204.852 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం దక్కించుకుంది. ఇక ఈక్వెస్ట్రియన్ డ్రెస్సేజ్ వ్యక్తిగత విభాగంలోనూ మనోళ్లు పతక రేసులో ఉన్నారు. ఇప్పటికే పలు రౌండ్ల పోటీలు ముగియగా.. నేడు పతక పోటీలు ఉండనున్నాయి.

> '2018లో భారత్‌కు డ్రెస్సేజ్ జట్టే లేదు. పోటీపడేందుకు కనీసం ముగ్గురు రైడర్లూ లేరు. కానీ ఈసారి పోటీలకు రావటమే కాదు చారిత్రక స్వర్ణం సాధించటం ఎంతో గర్వంగా ఉంది. ఈక్వెస్ట్రియన్‌లో భారత్‌లో పెద్ద సదుపాయాలు లేవు. కుటుంబాలకు దూరంగా ఉంటూ ఎక్కువగా విదేశాల్లోనే సాధన చేశాం. పారిస్ ఒలింపిక్స్‌లో పోటీపడేందుకు సైతం భారత్‌కు ఇప్పుడో జట్టు ఉందని చెప్పగలను. 23 ఏండ్ల వయసులో స్వర్ణం సాధించటం మాటల్లో చెప్పలేని అనుభూతి'
> - అనుశ్ అగర్వాల, ఈక్వెస్ట్రియన్ రైడర్

నేహా ఠాకూర్‌కు సిల్వర్

రోయింగ్‌లో ఐదు పతకాలతో సత్తా చాటిన టీమ్ ఇండియా.. మంగళవారం సెయిలింగ్‌లో పతకాల వేట మొదలెట్టింది. మహిళల ఐఎల్‌సీఏ4 విభాగంలో నేహా ఠాకూర్ రెండో స్థానంలో నిలిచి రజత పతకం సాధించింది. 17 ఏండ్ల నేహా ఠాకూర్..11 రేసుల్లో 27 పాయింట్లు



సాధించింది. థాయ్‌లాండ్ సెయిలర్ 16 పాయింట్లతో పసిడి నెగ్గగా, సింగపూర్ సెయిలర్ 28 పాయింట్లతో కాంస్యం సాధించింది. ఐఎల్‌సీఏ4 విభాగంలో ఓవరాల్‌గా 11 రేసులు ఉంటాయి. ప్రతి రేసు అనంతరం పాయింట్లు కేటాయిస్తారు. రేసులో అగ్రస్థానంలో నిలిచిన సెయిలర్‌కు ఒక పాయింట్, ఎనిమిదో స్థానంలో నిలిచిన సెయిలర్‌కు 8 పాయింట్లు ఇస్తారు. ఇలా 11 రేసుల అనంతరం ఎవరైతే తక్కువ పాయింట్లు సాధిస్తారో వారే విజేతలుగా నిలుస్తారు. 11 రేసులలో ఒక చెత్త రేసును గణాంకాల్లోకి తీసుకోకుండా.. ఫైనల్ జాబితా సిద్ధం చేస్తారు. ' నేను సముద్రం చూడలేదు. కానీ నా కూతురు ఈ రోజు యావత్ భారత దేశం గర్వపడే ప్రదర్శన చేసింది. దేశానికి సిల్వర్ మెడల్ సాధించింది' అని నేహా ఠాకూర్ తల్లి సంతోషం వ్యక్తం చేసింది. సెయిలింగ్‌లోనే మరో పతకం లభించింది. ఎబాడ్ అలీ కాంస్య పతకం అందుకున్నాడు. మెన్స్ విండ్‌సర్ఫర్ ఆర్ఎస్:ఎక్స్ విభాగంలో అలీ నెట్ స్కోరు 52 సాధించాడు. దక్షిణ కొరియా (13), థాయ్‌లాండ్ (29) సెయిలర్లు వరుసగా పసిడి, రజత పతకాలు దక్కించుకున్నారు.

చాంపియన్ల కార్ఖానా స్పోర్ట్స్ అకాడమీలు

శాట్స్ చైర్మెన్ ఆంజనేయ గౌడ్



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) ఆధ్వర్యంలోని స్పోర్ట్స్ అకాడమీలు చాంపియన్ల కార్ఖానాగా నిలుస్తున్నాయని శాట్స్ చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ అన్నారు. స్పోర్ట్స్ అకాడమీ స్టూడెంట్స్ ఇటు క్రీడల్లో, అటు చదువుల్లో మేటిగా రాణిస్తున్నారు. అకాడమీలో ప్రతి స్టూడెంట్‌పై ప్రత్యేక శ్రద్ధ, నైపుణ్య అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు. ఆ ఫలితాలే ఇప్పుడు పతకాల రూపంలో ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు. ఇటీవల హన్మకొండలో జరిగిన 67వ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని సైక్లింగ్ వెలోడ్రమ్ రెజ్లింగ్ అకాడమీ రెజ్లర్లు ఆకాశ్ (51 కేజీలు విభాగం), శివ సంపత్ (110 కేజీల విభాగం), ఎన్. సతీశ్ (65 కేజీల విభాగం) బంగారు పతకాలు సాధించగా.. మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో వర్ధమాన రెజ్లర్లను శాట్స్ చైర్మెన్ అభినందించి, ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శాట్స్ డీడీలు చంద్రారెడ్డి, ధనలక్ష్మి, రవీందర్, ఓఎస్‌డి నర్సయ్య, స్టేడియం అడ్మినిస్ట్రేటర్ గోకుల్ యాదవ్, కోచ్‌లు జైపాల్, విజయ్ భాస్కర్, నిర్మల్‌సింగ్ సహా రెజ్లింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు హైదరాబాద్‌కు పాక్ జట్టు

హైదరాబాద్ : ఐసీసీ 2023 వన్డే వరల్డ్‌కప్ సందడి మొదలైంది. రెండు వార్మప్ సహా మూడు ప్రధాన మ్యాచులకు ఆతిథ్యం ఇవ్వనున్న ఉప్పల్ స్టేడియం ఇప్పటికే మెగా ఈవెంట్‌కు ముస్తాబు కాగా.. సెప్టెంబర్ 29న వార్మప్ మ్యాచ్ కోసం పాకిస్థాన్, న్యూజిలాండ్ జట్లు నేడు హైదరాబాద్‌కు చేరుకోనున్నాయి. బుధవారం ఉదయం కరాచీ నుంచి దుబాయ్ చేరుకోనున్న పాక్ క్రికెటర్లు అక్కడ్నుంచి నేరుగా హైదరాబాద్‌కు రానున్నారు.

క్లీన్‌స్వీప్ కొడతారా?

- ఊరిస్తోన్న 3-0 విజయం
- భారత్, ఆసీస్ మూడో వన్డే నేడు
- మ॥1.30 నుంచి స్పోర్ట్స్18లో..

ఆస్ట్రేలియాపై అరుదైన రికార్డుకు టీమ్ ఇండియా అడుగు దూరంలో నిలిచింది. వన్డే ఫార్మాట్‌లో ఆసీస్ ఇప్పటి వరకు భారత్ చేతిలో వైట్‌వాష్‌కు గురి కాలేదు. నేడు చివరి వన్డేలో నెగ్గితే.. ఆసీస్‌పై వన్డే సిరీస్‌ను రోహిత్‌సేన క్లీన్‌స్వీప్ చేయనుంది. విరాట్, రోహిత్, కుల్దీప్ రాకతో క్లీన్‌స్వీప్‌పై టీమ్ ఇండియా కన్నేయగా.. మాక్స్‌వెల్, కమిన్స్, స్టోయినిస్ రాకతో ఆసీస్ ఊరట విజయం ఆశిస్తోంది. భారత్, ఆస్ట్రేలియా మూడో వన్డే నేడు.

నవతెలంగాణ-రాజ్‌కోట్

అక్టోబర్ 8న చెపాక్‌లో భారత్, ఆస్ట్రేలియా ప్రపంచ కప్ వేట షురూ చేయనున్నాయి. అంతకుముందు, నేడు రాజ్‌కోట్ వేదికగా ఈ రెండు జట్లు డ్రెస్ రిహార్సల్‌కు సిద్ధమయ్యాయి. భారత్, ఆసీస్ శిబిరాల్లో కీలక ఆటగాళ్లు జట్టులోకి తిరిగి రావటంతో.. వరల్డ్‌కప్ ప్రణాళికలు పూర్తి స్థాయిలో ఇక్కడి నుంచే ఆరంభం కానున్నాయి. ఇక వరుసగా ఐదు మ్యాచుల పరాజయాలకు ఆసీస్ బ్రేక్ వేయాలని చూస్తుండగా.. కంగారూలపై తొలి క్లీన్‌స్వీప్ సిరీస్ సాధించాలని టీమ్ ఇండియా భావిస్తుంది. అభిమానులకు మరోసారి భారీ స్కోర్ల థ్రిల్లర్ ఎదురు చూస్తుండగా.. భారత్, ఆస్ట్రేలియా చివరి వన్డే పోరు నేడు.



ఆ నలుగురు దూరం

రాజ్‌కోట్ వన్డేకు నలుగురు ఆటగాళ్లు దూరమయ్యారు. ఓపెనర్ శుభ్‌మన్ గిల్, హార్దిక్ పాండ్య, శార్దుల్ ఠాకూర్ సహా అక్షర్ పటేల్ నేటి మ్యాచ్ సెలక్షన్‌కు అందుబాటులో లేరు. ఎడమ కాలు తొడ కండరం గాయంతో బాధపడుతున్న అక్షర్ పటేల్ పూర్తిగా కోలుకోలేదు. తొలి రెండు వన్డేలకు దూరంగా ఉన్న రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, కుల్దీప్ యాదవ్‌లు నేడు బరిలోకి దిగనున్నారు. గిల్ లేకపోవటంతో రోహిత్‌తో కలిసి ఇషాన్ కిషన్ ఓపెనింగ్ చేయనున్నాడు. జడేజా, అశ్విన్, కుల్దీప్ స్పిన్ త్రయం ఆసీస్ బ్యాటర్లపై మాయ చేయనుండగా.. బుమ్రా, సిరాజ్‌లు పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు. శ్రేయస్ అయ్యర్, కెఎల్ రాహుల్, సూర్య కుమార్ యాదవ్ ఫామ్‌లో ఉండగా.. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలు నేడు తమదైన ఇన్నింగ్స్‌లు ఆడాలని చూస్తున్నారు. ఇక తొలి రెండు వన్డేల్లో మెప్పించిన అశ్విన్.. గత ఆరేండ్లలో రెండు వన్డేల్లోనే ఆడాడు. అయినా, స్వదేశంలో మెగా ఈవెంట్ ముంగిట అశ్విన్‌ను జట్టు మేనేజ్‌మెంట్ కోరుకుంటుంది. అక్షర్ పటేల్ ఫిట్‌నెస్ సాధించకపోతే.. అశ్విన్ నేరుగా ప్రపంచకప్ జట్టులోకి రానున్నాడు.

బౌలింగే సమస్య

ఆస్ట్రేలియా చివరి ఐదు వన్డేల్లో పరాజయం పాలైంది. దక్షిణాఫ్రికా మూడు, భారత్ రెండు మ్యాచుల్లో ఓడించాయి. ఈ ఐదు మ్యాచుల్లో నాలుగు సార్లు ఆసీస్ భారీగా పరుగులు సమర్పించుకుంది. 338, 416, 315, 399 స్కోర్లు నమోదయ్యాయి. భారత్ చేతిలో వైట్‌వాష్ ప్రమాదం నుంచి తప్పించుకోవాలంటే మెరుగైన బౌలింగ్ ప్రదర్శనే శరణ్యం. డెత్ ఓవర్లలోనూ ఆసీస్ బౌలింగ్ ఆశాజనకంగా లేదు. 9.48 ఎకానమీతో కంగారూ బౌలర్లు తడబడుతున్నారు. ఈ ఓవర్లలో వికెట్ల వేటలోనూ ఆసీస్ వెనుకంజలోనే నిలిచింది. ఆ జట్టు స్ట్రయిక్‌రేట్ 20.60 మాత్రమే. మిచెల్ స్టార్క్, పాట్ కమిన్స్‌లు తుది జట్టులోకి రావటంతో నేడు పరిస్థితుల్లో మార్పు ఉంటుందని ఆసీస్ ఆశిస్తోంది. గ్లెన్ మాక్స్‌వెల్, మార్కస్ స్టోయినిస్ సైతం నేటి మ్యాచ్‌కు అందుబాటులో ఉన్నారు. టాప్ ఆర్డర్‌లో డెవిడ్ వార్నర్ ఒక్కడే ఫామ్‌లో ఉండగా.. స్మిత్, లబుషేన్ వేగం అందుకోవాల్సి ఉంది. కీలక ఆటగాళ్ల రాకతో ఇటు బ్యాట్‌తో, అటు బంతితో ఆస్ట్రేలియా మెరుగైన ప్రదర్శన చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంది.



పిచ్, వాతావరణం

రాజ్‌కోట్‌లో పరుగుల వర్షం కురువనుంది. ఇక్కడ జరిగిన మూడు వన్డేల్లోనూ భారీ స్కోర్లు నమోదయ్యాయి. చివరగా 2020లో ఆసీస్‌పై భారత్ 340/6 పరుగులు చేయగా.. ఆసీస్ 304 పరుగులు చేసింది. నేటి మ్యాచ్‌లోనూ అదే తరహాలో భారీ స్కోర్లకు అవకాశం ఉంది. వాతావరణం కాస్త మేఘావృతమై ఉన్నప్పటికీ.. ఎటువంటి వర్షం సూచనలు లేవు.

తుది జట్లు (అంచనా)

భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), ఇషాన్ కిషన్, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కెఎల్ రాహుల్ (వికెట్ కీపర్), సూర్యకుమార్ యాదవ్, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, జశ్‌ప్రీత్ బుమ్రా.

ఆస్ట్రేలియా : మిచెల్ మార్ష్, డెవిడ్ వార్నర్, స్టీవ్ స్మిత్, మార్నస్ లబుషేన్, అలెక్స్ కేరీ (వికెట్ కీపర్), గ్లెన్ మాక్స్‌వెల్, మార్కస్ స్టోయినిస్, మిచెల్ స్టార్క్, పాట్ కమిన్స్ (కెప్టెన్), ఆడం జంపా, జోశ్ హాజిల్‌వుడ్.

నవచిత్రం

వారందరికీ ఈ అవార్డు అంకితం



వహీదా రెహ్మాన్

వెండితెరను ఐదు దశాబ్దాలు ఏలిన అలనాటి మేటి నటి వహీదా రెహ్మాన్‌కు మరో అరుదైన గౌరవం లభించింది. సినిమా రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే దాదా సాహెబ్ ఫాల్కే లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డు ఆమెను వరించింది. భారతీయ సినీ పరిశ్రమకు గత ఐదు దశాబ్దాలుగా సేవలు అందించినందుకు గాను ఈ ఏడాది 'దాదా సాహెబ్ ఫాల్కే' పురస్కారానికి వహీదా రెహ్మాన్ ఎంపికైనట్టు కేంద్ర సమాచార, ప్రసార శాఖా మంత్రి అనురాగ్ ఠాకూర్ మంగళవారం ప్రకటించారు. 1955లో తెరకెక్కిన 'రోజులు మారాయి' తెలుగు చిత్రంతో వహీదా రెహ్మాన్ సినీ రంగ ప్రవేశం చేశారు. ఈ సినిమాలోని 'ఏరువాక సాగారో రన్నో..' పాట అప్పట్లో ఓ ఊపు ఊపేసింది. 1956లో సిఐడి చిత్రంతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. 'ప్యాసా', 'కాగజ్ కే ఫూల్', 'సాహిబ్ బీబీ ఔర్ గులామ్', 'గైడ్', 'రామ్ ఔర్ శ్యామ్', 'రేష్మా ఔర్ షేరా' వంటి తదితర ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించి ప్రేక్షకుల్ని అలరించారు. తెలుగులో మొదలై, హిందీలో ఓ వెలుగు వెలిగిన తారగా వాహీదా విశేష ప్రేక్షకాదరణతోపాటు జాతీయ ఉత్తమనటి, పద్మశ్రీ, పద్మభూషణ్ వంటి ప్రతిష్టాత్మక పురస్కారాలు దక్కించుకున్నారు.

> నా నటనకు మరొక గుర్తింపు దక్కినందుకు ఆనందంగా ఉంది. ఎవరైనా అంకిత భావం, నిజాయితీతో పని చేస్తే తప్పకుండా దానికి తగిన ఫలితం ఉంటుంది. ఈ అవార్డును నా తోటి నటీనటులకు, అలాగే సినీ రంగంలోని అందరికీ అంకితం చేయాలనుకుంటున్నా. ఇదంతా వారి వల్లనే సాధ్యం. ఈ పరిశ్రమలో సమష్టి కృషితోనే విజయం వరిస్తుంది.
> - వహీదా రెహ్మాన్

అలాంటి.. అరుదైన సినిమా

విరాట్ కర్ణ హీరోగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో రూపొందిన న్యూ ఏజ్ పొలిటికల్ థ్రిల్లర్ 'పెదకాపు-1'. 'అఖండ'తో బ్లాక్‌బస్టర్‌ను అందించిన ద్వారకా క్రియేషన్స్‌పై మిర్యాల రవీందర్ రెడ్డి ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మించారు.
ఈనెల 29న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తున్న సందర్భంగా నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డి మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలు..



మిర్యాల రవీందర్ రెడ్డి

- టీజర్, ట్రైలర్‌తో సినిమాపై చాలా పెద్ద బజ్ క్రియేట్ అవ్వడం చాలా ఆనందంగా ఉంది. పెద్ద సినిమా అవుతుందనే నమ్మకంతోనే మొదటి నుంచి పెద్దగానే చేశాం. కొత్తవాళ్ళతో ఇంతపెద్ద సినిమా చేయడం సాహసం అనిపించలేదా? అని చాలా మంది అడుగుతున్నారు. ఇది సాహసం కాదండీ. కొత్తవాళ్లతోనే వర్క్ అవుట్ అయ్యే కథ ఇది. ఈ కథకు ఒక సామాన్యుడు కావాలి. కొత్తవాడైతేనే దానికి సహజత్వం వస్తుంది.
- తెలుగు చిత్ర పరిశ్రమలో చెప్పుకోదగ్గ సినిమాలు అరుదుగా ఉంటాయి. అలాంటి అరుదైన చిత్రంగా ఈ సినిమా నిలుస్తుంది. ఈ సినిమా తర్వాత మా ద్వారకా బ్యానర్ జర్నీ మారుతుంది.
- ప్రతి కథలో బలవంతుడు బలహీనుడు మధ్య పోరాటం ఉంటుంది. ఇందులోకి వచ్చేసరికి నేటివిటీ తోడైంది. ఈ కథ తెరపై చూస్తున్నప్పుడు ఒక సినిమాలా కాకుండా నిజ జీవితాన్నే తెరపై చూస్తున్న అనుభూతి కలుగుతుంది. దర్శకుడు శ్రీకాంత్ రాసిన మాటలు గుచ్చుకుంటాయి. సినిమా చూస్తున్నప్పుడు జీవితంలో నెగ్గాలంటే ఒక సామాన్యుడు ఇంత పోరాటం చేయాలా అనిపిస్తుంది. సినిమా చూసి బయటికి వెళ్తున్నప్పుడు నిజమే కదా.. మనం ఎందుకు పోరాటం చేయకూడదనిపిస్తుంది. అందుకే శ్రీకాంత్ అడ్డాలని వెట్రిమారన్‌తో పోల్చాను.
- ఈ సినిమాని రెండు పార్టులుగా తీయడం రిస్క్ అనిపించలేదు. ఎందుకంటే ఇదొక చరిత్ర. ఒక సామాన్యుడు, అసామాన్యుడు కావడం ఒక పూటలో జరగదు. ఈ పోరాటంలో చాలా సవాళ్ళు ఉంటాయి.
- మా ఇంటి వాడని విరాట్‌ని హీరో చేయలేదు. విరాట్‌కి సినిమాలపై ఆసక్తి ఉంది. తను హీరో మెటీరియల్. స్క్రీన్ పై చూస్తున్నపుడు ఒక పెద్ద హీరోని చూసిన అనుభూతే కలిగింది. ఇక సినిమా చూసినప్పుడు దర్శకుడు శ్రీకాంత్ నటన చూసి మీరు చాలా సర్‌ప్రైజ్ అవుతారు. అలాగే ఇందులో అనసూయ, తనికెళ్ళ భరణి, రావు రమేష్ పాత్రలు కూడా బలంగా ఉంటాయి. 294 మంది కొత్తవారు ప్రేక్షకులకు పరిచయం అవుతున్నారు. మిక్కీజే మేయర్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు.
- 80నాటి పరిస్థితుల నేపథ్యంలో ఉండే కథ ఇది. ఒక కొత్త పార్టీ వస్తుందంటే రాష్ట్రంలోగాని, దేశంలో గాని ముందు ఎట్రాక్ట్ అయ్యేది యువతనే. అలా వచ్చిన పార్టీ వీరికి ఎలాంటి చేయూతనిచ్చిందనేది ఒక అంశంగా ఉంటుంది. సెన్సార్ నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. మంచి సినిమా అని సెన్సార్ బృందం అభినందించింది. 'అఖండ 2' ఎప్పుడనేది చెప్పలేను కానీ ఖచ్చితంగా ఉంటుంది. ఈ సినిమాకి కంటిన్యూగా 'పెదకాపు2' ఉంటుంది. అడివి శేష్‌తో ఒక సినిమా, అలాగే మరో రెండు, మూడు కథలు చర్చల్లో ఉన్నాయి.



మన చుట్టూ ఉన్న పాత్రలే..

నిత్యామీనన్ టైటిల్ పాత్రలో నటించిన సిరీస్ 'కుమారి శ్రీమతి'. స్వప్న సినిమాస్ నిర్మించిన ఈ సిరీస్‌కు దర్శకుడు శ్రీనివాస్ అవసరాల స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ అందించగా, గోమటేష్ ఉపాధ్యాయ దర్శకత్వం వహించారు. ఇది ఈనెల 28న ప్రైమ్ వీడియో ఓటీటీలో ప్రసారం కానుంది. మంగళవారం ప్రెస్ ప్రీమియర్ షో అనంతరం దర్శకుడు హను రాఘవపూడి మాట్లాడుతూ,"కుమారి శ్రీమతి' అనే టైటిలే ఎక్స్‌ట్రార్డినరీగా ఉంది. స్వప్న ఎక్కడా రాజీపడకుండా నిర్మించారు. ఇందులో కనిపించిన పాత్రలన్నీ మన చుట్టూ ఉన్నవే. ఫ్యామిలీ అంతా కలిసి చూసే షో ఈ మధ్య కాలంలో ఇదేనేమో. డైలాగ్స్ చాలా బాగున్నాయి. అందరూ ఎంజాయ్ చేస్తారు' అని తెలిపారు.
'స్వప్న 'కుమారి శ్రీమతి' ఐడియా చెప్పిన వెంటనే నాకు చాలా నచ్చింది. తర్వాత శ్రీనివాస్ అవసరాల మాటలు, స్క్రీన్ ప్లే రాస్తున్నారని తెలిసి పర్ఫెక్ట్ అనిపించింది. నిత్యామీనన్ అనగానే క్యారెక్టర్ కనిపించింది. అప్పుడే ఈ షో భలే ఉంటుందని అనిపించింది' అని నందిని రెడ్డి అన్నారు. నిర్మాత స్వప్న దత్ మాట్లాడుతూ,'శ్రీమతి పాత్రని పోషించడం అంత సులువు కాదు. ఆ పాత్రలో చాలా ఎమోషన్స్ ఉంటాయి. అలాంటిది నిత్యామీనన్ అద్భుతంగా నటించారు' అని చెప్పారు.

'స్కంద' కీ ఎలిమెంట్ అదే



బోయపాటి శ్రీను, రామ్ పోతినేని కాంబోలో తెరకెక్కిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్కంద'-ది ఎటాకర్. శ్రీలీల కథానాయికగా నటించిన ఈ చిత్రాన్ని శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ పై శ్రీనివాస చిట్టూరి నిర్మించారు. దీనికి జీ స్టూడియోస్ సౌత్, పవన్ కుమార్ సమర్పిస్తున్నారు.
ఈ సినిమా ఈనెల 28న విడుదల కానున్న సందర్భంగా మేకర్స్ కరీంనగర్‌లో 'స్కంద' కల్ట్ జాతర ఈవెంట్‌ని గ్రాండ్‌గా నిర్వహించారు. అలాగే 'స్కంద' రిలీజ్ ట్రైలర్‌ని విడుదల చేశారు. రామ్ పోతినేని మాట్లాడుతూ, 'బోయపాటి సినిమా అంటే ఫైట్స్ అని అంటారు. అయితే కేవలం ఫైట్స్ మాత్రమే కాదు.. ఆ ఫైట్స్ వెనుక ఎమోషన్, ఆ ఎమోషన్‌ని ఎలా బిల్డ్ చేస్తారనేది 'స్కంద' కీ ఎలిమెంట్. ఇది కేవలం మాస్ సినిమానే కాదు. చాలా అందమైన ఫ్యామిలీ ఎలిమెంట్స్ ఉన్నాయి. ఈ సినిమాకి సోల్ ఫ్యామిలీ ఎమోషన్స్. బోయపాటి ప్రతి సినిమాలో ఒక సోషల్ మెసేజ్ పెడతారు. ఇందులో ఉన్న మెసేజ్‌ని కుటుంబ సభ్యులంతా ఎంజాయ్ చేస్తారు' అని అన్నారు. 'మంచి సినిమా తీసి, మీ ముందుకు వస్తున్నాం. అందరూ ఆదరించాలని కోరుకుంటున్నాను'అని దర్శకుడు బోయపాటి శ్రీను చెప్పారు. 'రామ్ 'ఇస్మార్ట్ శంకర్'కి మించిన ఎనర్జీ ఇందులో ఉంది. బోయపాటితో చేసిన 'సరైనోడు, అఖండ' సూపర్ హిట్ అయ్యాయి. ఇది కూడా పెద్ద విజయం సాధిస్తుంది. నిర్మాత ఎక్కడా రాజీపడకుండా ఖర్చు చేశారు. రామ్, బోయపాటి అభిమానులందరికీ ఈ సినిమా ఒక పండగలా ఉంటుంది' అని హీరో శ్రీకాంత్ అన్నారు.



భావోద్వేగాలు అద్భుతం..

నవీన్ చంద్ర, స్వాతిరెడ్డి ప్రధాన పాత్రలలో నటిస్తున్న చిత్రం 'మంత్ ఆఫ్ మధు'. దర్శకుడు శ్రీకాంత్ నాగోతి ఈ చిత్రానికి రచన, దర్శకత్వం వహించగా, యశ్వంత్ ములుకుట్ల క్రిషివ్ ప్రొడక్షన్స్, హ్యాండ్‌పిక్డ్ స్టోరీస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. సుమంత్ దామ సహ నిర్మాతగా, రఘువర్మ పేరూరి ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం అక్టోబర్ 6న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ గ్రాండ్‌గా నిర్వహించారు మేకర్స్. ఈ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్న హీరో సాయి ధరమ్ తేజ్ మాట్లాడుతూ, 'దర్శకుడు శ్రీకాంత్ తీసిన ఏభానుమతి అండ్ రామకృష్ణ'లో చాలా క్లిష్టమైన ఎమోషన్స్ ఉన్నాయి. ఇందులో కూడా అలాంటి ఎమోషన్స్ కనిపిస్తున్నాయి. నవీన్ చాలా అద్భుతంగా నటించారు. స్వాతికి ఈ సినిమాతో మంచి విజయం రావాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు. 'ఈ సినిమా విషయంలో చాలా నమ్మకంగా ఉన్నాం. చాలా మంచి కథ. రైటింగ్, సినిమాటోగ్రఫీ, మ్యూజిక్ ఇలా అన్నీ అద్భుతంగా కుదిరాయి' అని నవీన్ చంద్ర చెప్పారు. స్వాతి రెడ్డి మాట్లాడుతూ, 'ఈ సినిమా చూసిన అందరూ సర్‌ప్రైజ్ అవుతారు. దర్శకుడు శ్రీకాంత్ అద్భుతంగా తీశారు' అని అన్నారు.
'ఈ సినిమా తప్పకుండా అందరినీ అలరిస్తుందనే నమ్మకం ఉంది' అని దర్శకుడు శ్రీకాంత్ చెప్పారు. నిర్మాత యశ్వంత్ మాట్లాడుతూ,' ట్రైలర్ మీ అందరికీ నచ్చడం ఆనందంగా ఉంది. సినిమా కూడా మీకు కచ్చితంగా నచ్చుతుంది' అని తెలిపారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.